


# అంబరీషుడు





మాస్టర్ పార్వతీకుమార్

## ధనిష్ఠ ప్రచురణలు




ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# అంబరీషుడు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2016 మాస్టర్ సి.వి.వి. మే కాల్

ప్రతులు : 1,000

వెల : రూ॥ **80-00**

ప్రతులకు *:*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-64-7

ముద్రణ *:*

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవ సేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

అంబరీషుడు భక్తులలో అగ్రగణ్యుడు. అంబరీష, ప్రహ్లాద, నారదాది భక్తులని వీరిని సంబోధింతురు. వీరు ప్రథమ శ్రేణి భక్తులు. భక్తుడనగా సతతము దేవునితో కూడి యున్నవాడని అర్థము. అన్ని స్థితుల యందు, అవస్థల యందు కూడ దైవము నుండి విడిపడని వాడు. సూర్యుని కాంతి సూర్యుని వీడి యుండదు. అట్లే పరమభక్తుడు సర్వకాల సర్వావస్థల యందు దైవమును వీడక యుండును. అట్లుండుట సహజమై యుండును. దైవమే తానుగ అహర్నిశలు ఉండువాడు పరమ భక్తుడు. అంబరీషు డట్టివాడు.

అంబరీషుడు సామాన్యుడు కాదు. చక్రవర్తి. అందున, సప్త ద్వీపములతో కూడిన భూమండల చక్రవర్తి. అట్టి మహా చక్రవర్తికి బాధ్యతలు బహు విస్తారమై యుండును. తీరికలేని కార్యక్రమములు ఆసాంతముండును. కార్యక్రమములందు వైవిధ్యము బహుళమై యుండును. రాజ్యపాలనము సులభమగు కార్యము కాదు. రాజులకు రాజైన వానిని సామ్రాట్టు అని, చక్రవర్తి అని పిలుతురు. అట్టి చక్రవర్తి ఏ క్షణమునందును దైవమును మరువక, సమస్తము నందును దైవమునే దర్శించుచు, వినుచు యుండుట మరి యే కథ యందును మనము వినము. గురుతర బాధ్యతలు లేనివారు నిత్యము దైవముతో కూడియుండుట గోపికలు చూపిన భక్తి. తపస్విజనులు, ఋషులు దైవముతో కూడి యుండుట అంబరీషునితో పోల్చినచో సామాన్య మనిపించును.

ప్రహ్లాదుడు కూడ. బలి చక్రవర్తిని వామనుడు సుతలమునకు పంపు సందర్భమున విష్ణు లీలలు గమనింపలేక కించిత్ సందేహపడెను. సామాన్య గృహస్థులగు వారు, అంతంత బాధ్యత గలవారు నిత్యము దైవముతో కూడియుండుట అంత విశేషము కాదు. మొత్తము భూవలయమును సమర్థవంతముగ పరిపాలించుచు నిత్యము దైవముతో కూడియుండుట అంబరీషునికే చెల్లినది. అతని భక్తికి ముగ్ధుడైనటువంటి శ్రీ మహా విష్ణువు తన సుదర్శనమునే అంబరీషుని కిచ్చివేసెను.

భక్తి రసమును, తెలుగువారికి కొల్లగ అందించిన బమ్మెర పోతనామాత్యుల వారు అంబరీషుని భక్తిని తన వాఙ్మయమునందు పట్టలేక *''భళి, భళీ! అంబరీషుని పొగడగ వశమే''* అనినారు. ఇట్టి వాక్ప్రయోగము భాగవతమునందు మరి యే యితర భాగవతోత్తముని గూర్చి వాడ లేదు.

అక్షరములలో ''అ'' ప్రథమము. భక్తులలో అంబరీషుడు ప్రథముడు. అంబరీషునికి అంబరీషుడే సాటి. అతడు భక్తుల యందు చక్రవర్తి.

అంబరీషోపాఖ్యానము విజయవాడలో ప్రతి సంవత్సరము జరుగు మాస్టర్ సి.వి.వి. గురుపూజలలో మాస్టర్ పార్వతీకుమార్ గారిచే (మార్చి, 2010) మధురముగ వ్యాఖ్యానింపబడినది. ఆ వ్యాఖ్యానము తరచు వినుచుండిన అనుయాయులు గ్రంథస్థము చేయుటకు పూనుకొనిరి. ఈ కార్యము సద్గురువు అనుగ్రహ కారణముగ చిరంజీవి గానుగుల విజయ్ (శ్రీ జి.వి.యమ్

**రామారావుగారి కుమారుడు**)ని వరించినది. వ్యాఖ్యానమునకు స్ఫూర్తి చెందిన శ్రీ జి.వి.యమ్. రామారావుగారి కుటుంబము లిఖించబడిన ఉపాఖ్యానమును శ్రద్ధతో సంస్కరించుటయే గాక ముద్రణా సహకారమునకు కూడ పూనుకొనిరి. తత్ఫలితముగ ఈ పుస్తకము వెలువడినది. వారి కుటుంబమునకు సద్గురువు అనుగ్రహము సదా వర్షించును గాక! ఇందలి తెలుగుభాష రచించినట్లుగ గాక భాషించినట్లుగ గోచరించును. భక్తి బీజములు తమయందు గలవారికి ఈ వ్యాఖ్యానము స్ఫూర్తి యను నీరు పోసి వృద్ధి చేయగలదు.

**- ధనిష్ఠ**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. ఉపోద్ఘాతము | ....... | 11 |
| 2. అంబరీషుడు | ....... | 24 |
| 3. నిత్యసత్త్వము | ....... | 52 |
| 4. దుర్వాసుడు | ....... | 77 |
| 5. మహామాయ | ....... | 96 |
| 6. సుదర్శన చక్రము | ....... | 116 |
| 7. విష్ణుభక్తి | ....... | 145 |
| 8. ఫలశ్రుతి | ....... | 162 |
| 9. సుదర్శన చక్ర ధ్యానము | ....... | 165 |

# ఉపోద్ఘాతము

జగద్గురుపీఠం, విజయవాడ కేంద్రం నిర్వర్తిస్తున్నటువంటి 33వ గురుపూజా మహోత్సవములలో పాల్గొనుటకు శ్రద్ధాభక్తులతో విచ్చేసినటువంటి సోదరబృందానికి నా హృదయపూర్వక నమస్కారములు. సోదరబృందం మూడుపూటలా మాస్టరుగారి ప్రార్థన ద్వారా మాస్టరు చైతన్యంలోకి ప్రవేశించి, తదనుభూతిని తెలిసిగాని, తెలియకగాని తనయందు నిక్షిప్తపరచుకుని, తమ తమ కార్యక్రమంలోకి మరలా ప్రవేశించి, జీవిస్తూ, తరిస్తూ ఉండడ మనేటటువంటిది మన మార్గం. ఈ ముప్పదిమూడు సంవత్సరములలో యువకులంతా మధ్య వయస్కులు అయ్యారు. కాలస్వరూపంగా జీవనమందు ఆవిధమైన మార్పులు కలిగిస్తూ ఉంటాయి. కుర్రతనంలో చేరినటువంటివారే ఇప్పుడు నడివయస్కు లయ్యారు. నడివయస్కులు వృద్ధులయ్యారు. అలాగే కొంతమంది నడివయస్సులో ఉన్నారు. కొంతమంది కుర్రవాళ్ళు మళ్ళీ చేరుతూ వస్తున్నారు. మాస్టరు చైతన్యం అనేటటువంటి, శాశ్వతమైనటువంటి, అనంతమైనటువంటి చైతన్యమునందు జీవచైతన్యం అనుసంధానం చెందినప్పుడు అటుపైన బుద్ధి వికాసం

జరుగుతూ ఉంటే మనసు, ఇంద్రియములు, శరీరం ఈ మూడు కూడా వాటికి ఒక పుట్టుక, ఒక పెరుగుదల, ఒక తరుగుదల, ఒక వృద్ధాప్యం, ఇలాంటి మార్పులు జరుగుతూ ఉండగా, మాస్టరు అనుయాయులు మాస్టరు చైతన్యంలో స్థిరపడుతూ ఉంటారు. దేహము, వయసు వీటితో సంబంధం లేకుండా, వాటి మార్పులు ప్రకృతి సహజంగా జరిగేవి జరుగుతూ ఉండగా, మన లోపల ఉన్నటువంటి స్థిరమైనటువంటి బుద్ధి మాస్టరు చైతన్యమునందు స్థిరపడుతూ ఉంటుంది. అలాంటి స్థిరత్వం అందరియందూ ఏర్పడడానికి ప్రధానమైనటువంటి కారణము మాస్టరుగారి అనుగ్రహము, అనుశ్యూతముగా సాధకుల ప్రయత్నము, ఇలా ముప్పదిమూడు సంవత్సరాలు గురుపూజలుగా విజయవాడ కేంద్రంలో నిర్వర్తింపబడ్డాయి అంటే, అది చాలా ఆనందింపవలసి నటువంటి విషయము. మాస్టరుగారు కూడా రకరకములైన భంగిమలతో మనకి ఈ విధంగా కార్యకర్తల స్ఫూర్తినిబట్టి ఇక్కడ తమని తాము ప్రకటించుకుంటున్నారు. ముప్పదిమూడు సంవత్సరాలు అంటే తెలిసీతెలియని వయస్సు నుంచి వృద్ధాప్యం వరకూ, మధ్యలో ఉండేటటువంటి ప్రధానమైనటువంటి వయస్సు. ఆ ముప్పదిమూడు సంవత్సరములు మాస్టరు చైతన్యంలో ఉద్యోగములు, వ్యాపారములు ఏర్పరుచుకోవడం, వివాహములు చేసుకోవడం, సంతానాన్ని కనడం, అటుపైన కుటుంబపరంగానో, ఆర్థికపరంగానో, సేవాపరంగానో వృద్ధి చెందడం, ఇవన్నీ అందులో భాగంగా జరిగిపోయిన జీవితాలు చాలా ఉన్నాయి. ఒడుదొడుకులు ఎన్ని వచ్చినా ఆ ఒడుదొడుకులని తట్టుకోవడానికి

శక్తిని కూడా మాస్టరుగారినే ఆధారంగా చేసుకుని ఇలా సాగి వచ్చారు.

ముప్పదిమూడు సంఖ్య అత్యంత పవిత్రమైనటువంటి సంఖ్యగా చెప్తారు. ఏకాదశ రుద్రులు మూడు లోకముల్లో కలిపి ముప్పదిమూడు. "త్రయస్త్రింశత్సహస్రాణి త్రయస్త్రింశత తానిచ, త్రయస్త్రింశచ్చదేవానాం సృష్టిస్సంక్షేమ లక్షణా" అని మహాభారతంలో శ్లోకం ఉంది. అంతా మూడే! మూడే ముప్పదిమూడు. ముప్పదిమూడు మూడువందల ముప్పదిమూడు అవుతుంది. మూడువందల ముప్పదిమూడు మూడువేల మూడు వందల ముప్పదిమూడు అవుతుంది. మూడువేల మూడువందల ముప్పదిమూడు, ముప్పదిమూడువేల మూడువందల ముప్పదిమూడు అవుతుంది. అలా కోట్లలోకి చేరిపోతుంది. ముప్పదిమూడుకోట్ల ముప్పదిమూడులక్షల ముప్పదిమూడువేల మూడువందల ముప్పది మూడు. ఇవన్నీ మూడు నుంచే వచ్చాయి. ఆ మూడు చైతన్యం యొక్క మూడు స్థితులు – ఇచ్ఛా, జ్ఞాన, క్రియా తత్వములుగా, శక్తులుగా, శుద్ధ చైతన్యం నుంచి వ్యక్తమై, అక్కడి నుంచి వరసగా అట్లా త్రిభుజాలుగా పెంచుకుంటూ ఉంటుంది.

The whole creation is but a manifestation of triangular forces అంటారు. ముగ్గురు ఉంటే మహత్కార్యాలు చెయ్యవచ్చు. ముగ్గురు మధ్య సామరస్యం చాలు అని చెప్పారు పరమగురువులు. ఇద్దరి మధ్య సయోధ్య ఏర్పడుతుందిగాని మూడవవాడు దొరకడట. మూడవవాడు దొరికే వరకూ ఏ కార్యాలు కావు. అంచేత, ముప్పదిమూడు సంవత్సరాలపాటు

రకరకములైనటువంటి ఒడుదొడుకులు తట్టుకుంటూ ఈ విధంగా ముప్పదిమూడవ గురుపూజ, అన్ని రకములుగా కూడా చాలా వైభవాన్ని ప్రదర్శిస్తోంది. ఎంచేతనంటే, ముదురు ఆకుపచ్చ నుంచి కొంచెం పాలమీగడ రంగులోకి మార్పు చెందింది మన ప్రాంగణం. ఆకుపచ్చ రంగు శనికి ప్రతీక అయితే, ఈ రంగు (cream colour) బుద్ధికి ప్రతీకగా ఉంటుంది, బృహస్పతికి ప్రతీకగా ఉంటుంది. ముప్పదిమూడేళ్ళలో అలా తయారయ్యిందంటే గొప్ప విషయమే! ఎన్ని జన్మలయినా పట్టొచ్చు. అంచేత, మనమే ఎలాంటి ప్రాంగణం యిచ్చినా ఇలా తయారు చేసుకోవడం అనే ఒక స్థితికి ఎదిగాము కదా! అంటే, ఉన్నది ఉన్నట్టుగా వాడుకోవడం కాకుండా దాన్ని మెరుగుపరచుకోవడం అనేటటు వంటిది సాధనలో భాగం. అంత గొప్ప శరీరం ఇవ్వలేదను కోండి, దాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అంత గొప్ప తెలివిని ఇవ్వలేదనుకోండి, దాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అంత గొప్ప సంపద ఇవ్వలేదనుకోండి, దాన్ని మెరుగుపరుచుకోవచ్చు. దేన్నయినా మెరుగుపరుచుకోవచ్చు. మెరుగుపరుచుకోవడమే సాధనలో ప్రధానమైనటువంటి అంశం. ఇంతకన్నా బావుండాలి, ఇంకా బాగా చెయ్యాలి అనేటటువంటిది పరిపూర్ణత కొరకు చేసేటటువంటి ప్రయత్నంలో భాగంగా మనిషి క్రమంగా పవిత్రుడు అవుతూ ఉంటాడు.

అలా ముప్పదిమూడేళ్ళ క్రితం, లబ్బీపేటలోని కపిలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణమందలి కల్యాణ మండపంలో మన గురుపూజలు 'దక్షయజ్ఞం'తో మొదలయ్యాయి. ఎందుచేతంటే,

ఎప్పటికయినా జీవుడు తరించాలంటే కావలసినది దక్షయజ్ఞమే. ఎవరు దక్షుడు అంటే, నేను సమర్థుడను అనేటటువంటి భావనతో బాగా కరుడు కట్టినటువంటి అహంకారం ఉన్నవాడు. రుద్రుడుని బాగా ఆవాహనం చేసుకుని, కొంచెం అహంకార పురుషుడిని మెత్తపరుచుకోవటం సాధన. అహంకార పురుషుడు ఎంత పలచగా, పారదర్శకంగా ఉంటే అంతర్యామి పురుషుడు, దైవము అంతగా భాసించేటటువంటి అవకాశం ఉంటుంది. అంచేత, మాస్టరుగారిని గురుపూజలను విజయవాడలో నిర్వర్తించమని సోదరులు కోరితే, ''అలాగే'' అని పలికి, ''ప్రతి సంవత్సరం నిర్వర్తించుకోవాలి సుమా!'' అని హెచ్చరించారు. ''ఏదో ఒక సంవత్సరం ముచ్చటగా జరిపేవి గురుపూజలు కావు.'' అని కూడా తెలిపారు. ''నిరంతరంగా సాగాలి.'' అని కూడా హెచ్చరించారు. మాస్టరుగారి ప్రధానమైనటటువంటి బోధన ఏమిటంటే సాధన ఏదైనా నిరంతరంగా సాగాలి. చైతన్యం ఎప్పుడూ నిరంతరమే. సత్యమెప్పుడూ నిరంతరమే. అంచేత, ఎక్కడ నిరంతరత ఉంటుందో అక్కడ మరపు ఉండదు, మరణమూ ఉండదు. "అలా నిరంతరంగా సాగాలి సుమా!" అని మాస్టరుగారు అంటే, నూతన ఉత్సాహంతో కార్యకర్తలు కార్యానికి పూనుకుని, అక్కడ మొదలుపెట్టి గురుపూజలు చేస్తుంటే మంచి వేడుకగా ఉండేది. సభ కిటకిటలాడుతుండేది. మాస్టరుగారు బాగా ఉత్సాహంతో, అమితోత్సాహంతో ఆయన ప్రవచనాలు చేస్తుండేవారు. సింహరాశి ప్రజ్ఞ కాబట్టి ప్రవచనంతోబాటు దానికి ఒక నటనా వైభవం కూడా జోడవుతుంది. ఆ విధంగా ఆయన చెప్తూ ఉంటే, అప్పుడే క్రొత్తగా మాస్టరుగారి ప్రవచనాలు వింటున్న వారందరికీ కూడా

ఆకురాలు కాలంలో ఆకులు రాలిపోయినట్టు అలా టపటపా వారి అపోహలు రాలిపోయేవి. బయటకొచ్చి, క్రొత్తగా వచ్చినవాళ్ళు, “పంతులుగారు బాగా చెప్తున్నాడురా!”, “నిజమే కదా ఆయన చెప్పేది!” అనుకునేవాళ్లు. అలా మన విజయవాడ కేంద్రంలో గురుపూజలు లబ్బీపేటలో, అటుపైన CVRGMH స్కూల్లో, అక్కడినుంచి Railway School కి వెళ్లి, అక్కడినుంచి తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలోకి వెళ్లి, అక్కడినుంచి ఒక రెండుసార్లేమో, Lorry Owner’s Association ప్రాంగణం లోకి వెళ్లి, అలా అలా ఇటు వచ్చి కందుకూరివారి ప్రాంగణంలో వచ్చిపడ్డాము. ఇటుపై మరల ఎటు వెళ్తామో మాస్టరుగారు నిర్ణయమే! ఇక్కడ దాదాపు మనం స్థిరపడ్డట్టే. దీన్ని బాగా అంతకంతకీ అంతకంతకీ మనమే సర్వాంగ సుందరంగా తయారు చేసుకుంటూ వస్తూ ఉన్నాం. వాళ్ళు రంగులు వెయ్యకపోతే మనమే వేయించుకుందాం, వారు సౌకర్యాలు అంతంత మాత్రంగా ఇస్తే మనమే ఏర్పాటు చేసుకుందాం అనే స్థితికి పెరిగాము.

ఇలా ముప్పదిమూడు ఏళ్ళు గడిచాయి. అందులో మొదటి ఆరేళ్ళు మాస్టరుగారు ప్రవచనాలు ఇచ్చారు. 1978, 79, 80, 81, 82, 83. 1984 గురుపూజలు ఒక విచిత్రం. ఆరు సంవత్సరాల తర్వాత ఏడవ సంవత్సరం మాస్టరుగారు వెళ్ళిపోయిన మర్నాడు ఇక్కడ గురుపూజలు. మార్చి 17, 1984 దహనక్రియలు పూర్తి చేసుకుని, ఇంటికి వస్తే, రాధామాధవానికి అప్పయ్యగారు వచ్చారు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో. ఆరు గంటలకల్లా మాస్టరుగారి దహన క్రియలు పూర్తి

అయిపోయినాయి. ఆయన రాధామాధవంలోకి వచ్చి, "ఇప్పుడు మేం ఏంచెయ్యాలి? రేపు గురుపూజలు" అని అడిగారు. "ఏం చెయ్యడం ఏమిటి? గురుపూజలు చెయ్యడమే. మాస్టరుగారు ఉన్నారా లేరా? దేహం మారితే మాస్టరుగారు లేకుండా ఉండరు కదా! అంచేత, గురుపూజలు నిర్వర్తించండి. కొంత లోపల దుఃఖం ఉంటుంది, బాధ కలుగుతుంది. కాని నిర్వర్తిస్తే మాస్టరుగారు చాలా సంతోషిస్తారు" అని చెప్పాను అప్పయ్యగారికి. ఆయనకి బాగా నచ్చింది. రాత్రే అందరికీ కబురు చెప్పేసి, బస్సు ఎక్కేసి, పొద్దున్నే విజయవాడలో దిగి... అంతరాయాలు లేకుండా విజయవాడలో గురుపూజలు నిర్వహించారు. అది ముఖ్యం. గొప్పగా చెప్పుకోవాలి విజయవాడ గురించి. మాస్టరుగారు లేరనుకోవడం, మాస్టరుగారు వెళ్ళిపోయారనుకోవడం, అలా అనుకుని బెంబేలు పడిపోవడం కాకుండా, కుప్పకూలిపోవడం కాకుండా, ఆ మర్నాడు గురుపూజలు చేశారంటే, ఆ ఒక్క విషయంలో విజయవాడని మించిన వాళ్ళు లేరు. సందేహం లేదు. అది ఎప్పుడూ నేను మర్చిపోలేదు. ఆయన వెళ్ళగానే ఇంకొక స్త్రీ వచ్చింది, పద్మావతిగారు, వలివేరు నుంచి. వార్త వినగానే విలవిలలాడిపోయి, "తట్టుకోలేని పరిస్థితి వచ్చింది. మేమంతా ఏమయిపోవాలి?" అన్నారు. ఆవిడకి స్థిరత్వం కుదరాలని మాస్టరుగారు రాధామాధవంలో కూర్చుని, ఏడేళ్ళు ప్రార్థన చేసిన తివాచీని ఆమెకి ఇచ్చాను. యిచ్చి, "ఇది మీ దగ్గర ఉంచుకోండి స్థిరత్వం వస్తుందన్నాను." అది పెట్టుకునే వలివేరులో కొంతకాలం వాళ్ళు మాస్టరుగారి కార్యక్రమం నిర్వర్తించారు. ఇవన్నీ విజయవాడ గురుపూజలంటే నాకు ఎప్పుడూ గుర్తువచ్చే విషయాలు. 1984 గురుపూజలు ఒక ప్రత్యేకత. అటుపైన 1985

నుంచి మాస్టరుగారే ఇలా నాలాంటి వాడి రూపంలో ఇక్కడ అదే ప్రవచనాలు కొనసాగిస్తూ అందరినీ కూడకట్టుకుంటున్నారు.

ఇలా అనుశ్యూతం, అంతరాయం లేకుండా ముప్పదిమూడవ గురుపూజకు చేరుకున్నాము.

**అంతర్యామి - సుదర్శనం - ప్రకృతి, పురుషుడు :**

గురుపూజలో మార్పేమీ ఉండదు. మార్పు కాలంలో, దేశంలో, ప్రకృతిలో వుంటుంది. కాలము, దేశము ద్వారా ప్రకృతి యందలి మార్పును అనుభవిస్తూ వుంటాము. కాని యిన్ని సంవత్సరాలు ఒకే గురుతత్త్వానితో అనుబంధం పెంచుకుంటూ, ఆ తత్త్వమందు స్థిరపడుతూ వున్నాము. ఇది గమనించవలసిన విషయం. మార్పు చెందే దానిలో మార్పు చెందని దానితో కూడటం వలన మన ప్రజ్ఞకు స్థిరత్వం కలుగుతుంది. స్థితమైన ప్రజ్ఞ కలగటం వల్ల స్థిమితంగా అనుభూతి చెందుతూ వుండవచ్చు.

మారుతున్నదల్లా ప్రకృతి. అది కాలానుగుణంగా మారుతూ వుంటుంది. మారనిది, అందు వసించియున్న తత్త్వం. దాన్ని పురుషుడు అన్నారు. పురుషుడంటే పురమందు ప్రవేశించి, వసించి యుండేవాడు. పురుషునికి మార్పులేదు. పురమునకు మార్పు సతతము వుంటుంది. మనం మారము. మన స్వభావము, దేహము మారుతూ వుంటాయి. మారుతున్న ప్రకృతికి, మారని పురుషుడు ఆధారం. మార్పులేని, స్థిరమైన, శాశ్వతమైన పురుషునితో కూడటం కోసమే గురుపూజలు. ఆ పురుషుడే గురువు. మారని తత్త్వంతో

అనుబంధం పెంచుకుంటూ వుంటే, స్థిరత్వము కలిగి, మారుతున్న ప్రకృతిని తనయందు, పరిసరములయందు గమనించవచ్చు. అనుభవింపవచ్చు. చిత్రవిచిత్రంగా ఎలా మారుతోందో సినిమా చూచినట్లు చూడవచ్చు. అలా చూడగలగడాన్ని సుదర్శనం అన్నారు.

పురములు ప్రకృతిచే నిర్మాణము చేయబడతాయి. ప్రకృతి 8 ఆవరణలు నిర్మాణం చేస్తూ వుంటుంది. తాను తొమ్మిదవది. దివ్యమైనది. వెలుగుతో కూడి వుంటుంది. అది వెలుగే! అదే అదితి, గాయత్రి, లలిత, శ్రీ అనే పేర్లతో పిలువబడుతూ వుంటుంది. ఈ దివ్య ప్రకృతి తొమ్మిదవది. అదే పురుషునకు ప్రథమ ఆవరణం. పురుషుడు 10వ వాడు. దివ్య ప్రకృతి లేక మూల ప్రకృతి తొమ్మిదవది. దాని నుండి ఏర్పడే చిల్లర ప్రకృతులు 8. మూడు గుణములు, ఐదు భూతములు, 10వ వాడైన పురుషునికి నవ(9) ఆవరణలు వున్నాయి. ఈ ఆవరణలకు పురుషుడే ఆధారం. పురుషుడు లేక 9 ఆవరణలు లేవు.

ఒకే తత్త్వం, పురుషుడు ప్రకృతిగా అనగా రెండుగా ఏర్పడుతుంది. రెండుగా ఏర్పడక ముందు అది పూర్ణం, అది శూన్యం. అది బ్రహ్మము. అది పురుషుడు కాదు, ప్రకృతి కాదు. రెండూ కలిసి యున్నది. దానిని పరము అని కూడా అంటారు. సృష్టి కొరకు అది రెండు అవుతుంది. జీవుల కొరకు రెండు అవుతుంది. రెండుగ ఏర్పడిన తరువాత మూడు గుణములు ఏర్పడతాయి. అటుపైన జీవ సృష్టి.

సృష్టిలో కనపడేది ప్రకృతియే! దివ్య ప్రకృతి, దాని 8 ప్రకృతులను దర్శించవచ్చు. దానికి ఆధారమైన పురుషుడు కనపడడు. అతడు కనపడటం అంటే, ప్రకృతి ఆవరణలోనే. దివ్య ప్రకృతితో, వెలుగుగా కనపడితే దివ్య దర్శనం అంటారు. దివ్య ప్రకృతితో కూడిన పురుషుని దర్శించవచ్చు. కాని, అసలే ఆవరణ లేక కనపడటం సాధ్యంకాదు. దర్శనం అంటే దివ్య దర్శనం అని అర్థం. దివ్య దర్శనం నుండి స్థూల దర్శనం వరకు దర్శనా లున్నాయి. దర్శనమంతా పురుష– ప్రకృతి దర్శనమే. అలా దర్శనం చేయటమే సు–దర్శనం.

మనకు మనం కనపడం. మన రూపమే కనపడుతుంది. మన స్వభావం తెలుసుకొనవచ్చు. కాని మనకు, మనం కనపడం. కాని ఉన్నామని తెలుసు. ఎలా ఉన్నాము? రూపమేమిటి? మన రూపం, మన స్వభావం మనం కాదుకదా! అవి మనవి. కాని మనం కాదు. విద్యుత్తు కనపడదు. విద్యుత్తు వెలుగు కనపడుతుంది. దాని శక్తి గ్రహించవచ్చు. అట్లాగే ''నేను'' అనిర్వచనీయం. ''నాది'' నిర్వచనీయం. గ్రాహ్యం.

మనం ఎంత ఎక్కువ ప్రకృతితో అనుసంధానం చెంది ఉంటామో, అంత ప్రకృతికి ఆధారభూతమైనటువంటి తత్త్వం అనుసంధానం చెంది ఉండాలి. ఆలోచనల గురించి తెలుసుకుంటూ ఉంటాము తప్ప, ఆలోచనలు పుట్టడానికి ఆధారభూతమైన దాని గురించి ఆలోచించము. ప్రకృతి–పురుషుల యొక్క అనుసంధానం వలనే సమస్తమూ కనిపిస్తుంటుంది, వినిపిస్తూ ఉంటుంది, అనిపిస్తూ ఉంటుంది.

అలా అన్నిటి యందలి దివ్య ప్రకృతితో కూడిన పురుషుని స్మరించటం, తద్వారా దర్శించటాన్నే అంతర్యామి దర్శనం అంటారు. 8 ఆవరణలతో కూడిన ప్రకృతికి ఆధారమైన దివ్య ప్రకృతి, దానికి ఆధారమైన పురుషుని చూడటమే అంతర్యామి దర్శనం. అదే సు–దర్శనం! 8 ప్రకృతులకు మూలము 9వ ప్రకృతి. దానికాధారము పురుషుడు లేక నేను (10వ వాడు). 9, 10లతో కూడితే సుదర్శనం. 9+10 = 19; 19 = 1, 9 = 10 ! ఇలా అవగాహన చేసుకోవాలి. ఉన్నది ఒకటే, అది పదిగా కనిపిస్తుంది. ''అత్యతిష్ఠద్దశాంగుళం'' అన్నది వేదం. అదే పదిగా ఏర్పడింది. అదే దశావతారాలు ఎత్తుతూ వుంటుంది. ఒకటి దశమముగా ఏర్పడి వున్నదని ఏమరుపాటు లేకుండా దర్శించడం, సు–దర్శనం. అదే అంతర్యామి దర్శనం.

అలాంటి తత్త్వమందు బాగా స్థిరపడ్డామనుకోండి, అంతర్యామి దైవమే తనయందు భాసిస్తుంది. అలాంటి అంతర్యామి దైవమే అన్నిటియందూ భాసిస్తోంది అనే స్థితి వచ్చిందనుకోండి, ఇలా వస్తే ఇహ వాడికి ఇబ్బంది లేదు. అన్నిటా, అంతటా స్థిరము కోల్పోకుండా ఉంటాడు. ఎంచేతంటే, శాశ్వతము, స్థిరము అయినటువంటి విషయములయందు అతడు స్థితిగొని ఉండడంచేత. అలా ఉన్నటువంటి వాడికి చుట్టుప్రక్కల కనిపించేదంతా కూడా అంతర్యామి దర్శనమే కనిపిస్తూ ఉంటుంది. ఎటు చూసినా అంతర్యామి దైవమే దానియొక్క అష్టప్రకృతులతో వ్యక్తమవుతూ ఉంటుంది. రూపాలన్నీ ప్రకృతి ఏర్పాటు చేసినవే. అందుండేటటువంటిది అంతర్యామి దైవమే. అలాంటి భావన

ఉన్నదనుకోండి, ఉంటే చుట్టుప్రక్కలన్నీ కూడా తనకి దైవముగా గోచరించడము వలన అతనిని సుదర్శనము అనేటటువంటి భగవత్ శక్తి కాపాడుతుంది. ఆ భగవత్ శక్తి కాపాడుతూ ఉంటే అందులోకి ఇతరములైనవంటి విషయాలు, ప్రతికూలమైనటువంటి విషయాలు ప్రవేశించడానికి అవకాశం ఉండదు. అదలా కనబడక తిరుగుతూ ఉంటుంది. అందులోకి ఎవరు ప్రవేశించగలరంటే అనుకూలమైనటువంటివే ప్రవేశిస్తాయి. ప్రతికూలమైనటువంటి వాటిని ఆ చక్రం దూరంగా ఉంచేస్తుంది. దానిని సుదర్శన చక్రం అన్నారు, మొత్తం సృష్టి చక్రమే సుదర్శన చక్రం. అది ధర్మచక్రం. దైవమును దర్శించేటటువంటి వారికి ఆ ధర్మచక్రం వారి చుట్టూ ఎప్పుడూ ఏర్పడి ఉంటుంది. భాగవతోత్తములు ఇలాంటి సుదర్శన చక్ర పరిరక్షణలో ఉన్నటువంటివారు. ఎందుచేతంటే, వారు “సు”దర్శనము చేస్తూ ఉంటారు. దివ్య దర్శనము చేస్తూ ఉండడం చేత, ఎంత దివ్య దర్శనం చేస్తూ ఉంటే, అంతసేపు ఆ చక్రం వారిని కాపాడుతుంది. అది చెయ్యనప్పుడు అది కాపాడే అవకాశం లేదు. అట్టివారిలో అంబరీషుడు, ప్రహ్లాదుడు, నారదుడు ప్రథమ శ్రేణికి చెందిన వారని నానుడి. అలా సుదర్శనమందు స్థిరపడినవారే తరించినవారు.

అంచేత, ఈ విధంగా దైవమే తాను అనేటటువంటి ఒక స్థితిలో, ఒక ఎరుకలో శాశ్వతముగా ఉండిపోయినటువంటి, ఉత్తమోత్తమైనటువంటి భక్తులు ఉన్నారు. వారి కథలే మనకి భాగవతంలో ఇచ్చారు. అందులో మాస్టరుగారి పలుకుగా ఈసారి ‘‘అంబరీష ఉపాఖ్యానం’’ చెప్పుకుందాం. ఇదివరకు మూడు

సంవత్సరములపాటు మనము ధృవోపాఖ్యానము చెప్పుకున్నాం. మూడేళ్ళ తర్వాత మనం ఇవ్వాళ, రేపు అంబరీషోపాఖ్యానం బాగా పారాయణం చేసుకోవచ్చు. ఇందులో అంబరీషుడి కీర్తి ఉంటుంది, సుదర్శనము యొక్క ప్రార్థన ఉంటుంది. ఆ సుదర్శనము ప్రార్థన ఎవరు బాగా చేసుకుంటారో వారందరికీ ఇబ్బంది లేదు. కేవలం పద్యాలు చదివేసి, తర్వాత మన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడానికి వీలులేదు. సుదర్శన చక్రం గురించి ప్రార్థన చేస్తే, మన చూపు మేరకు ఉండేటటువంటి వలయంలోకి ఎవరు ప్రవేశిస్తారో వారందరినీ కూడా విష్ణురూపాలుగా చూస్తూ ఉండాలి. ఇదొక ప్రయత్నం జరుగుతూ, ప్రార్థన జరుగుతూ ఉంటే, సుదర్శన చక్రమూ సాయం చేస్తుంది. మనం చేసే ప్రయత్నం వలన, అస్థిరత్వములోంచి స్థిరత్వములోకి మనం ప్రవేశించే అవకాశం కలుగుతుంది. ఇప్పుడు చెప్పినదంతా అంబరీషోపాఖ్యానానికి ఉపోద్ఘాతము.

# అంబరీషుడు

సూర్యవంశ రాజుల కథ, ఇక్ష్వాకు వంశము అని పేర్కొంటూ నవమ స్కంధంలో అంబరీష ఉపాఖ్యానము ఇచ్చారు. ఈ ఉపాఖ్యానములో మొదటి పద్యం:

"సప్తద్వీప విశాలభూభరము దోఃస్తంభంబునం బూని సం
ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవసంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణగరిష్ఠుం డంబరీషుం డిలన్."

అంబరీష ఉపాఖ్యానము భూమి మీద జరిగిన కథ. ఆయన పరిస్థితి ఏమిటయ్యా అంటే ఏడు భూఖండాలకీ ఆయనే చక్రవర్తి – సప్తద్వీప విశాలభూమి. అది ఎంత బరువు బాధ్యతలతో ఉంటుందండి? ఒక్క దేశాన్ని పాలించడమే చాలా కష్టం. ఒక్క రాష్ట్రాన్ని పాలించడం ఎంత కష్టమో మన ముఖ్యమంత్రిగారిని చూస్తే తెలుస్తుంటుంది! ఒక జిల్లాని పరిపాలించడమే కష్టం కదా! అంతెందుకు ఒక బృందాన్ని నిర్వహించడం మాత్రం సులభమా? మన జగద్గురుపీఠం విజయవాడ సోదరబృందం అని ఒకటి ఉంది కదా! దాన్ని నిర్వహిస్తున్న వాళ్ళని అడగండి ఏం చెప్తారో. సులభమా? ఇంకొంచెం తక్కువలోకి వెళ్తే ఒక కుటుంబాన్ని నిర్వహించడం సులభమా? అలాంటిది, మొత్తం ఏడు ఖండాలు,

సప్త ఖండాలతో కూడినటువంటి... ఖండం అంటే ఒకే భూభాగం కాకుండా దాని మధ్యలో నీళ్ళు ఉంటాయి. అందుకనే ఏడు అయినాయి, ఒకటే భూమి అయినా. మధ్యలో నీళ్ళు ఉంటాయి కాబట్టి అవి ద్వీపాలు అయినాయి. ఆ ద్వీపాలన్నిటినీ కూడా పరిపాలించుకుంటూ ఉండేటటువంటి ఒక భారం ఉంది – భూభారం. దీని నిర్వహణ భారం అంతా తన బలమైన రెండు భుజస్కంధాల ద్వారా మోస్తున్నాడట. చదువుతుంటే నాకు ఒక భావం వచ్చింది. మన శరీరం కూడా సప్త ద్వీపాల భూమియే! మనతో చెయ్యబడినటువంటి సప్తలోకములు ఉన్నాయి కదా! సప్త లోకాలు శరీరానికి ఉన్నాయి కదా!

మనలో ఉండేటటువంటి ఇడ–పింగళ నాడులు ఇరు పార్శ్వములుగా మనలో సప్త ద్వీపాలు మోస్తున్నాయ్యండి. ఈ ద్వీపం అంతా కూడా... ద్వీపం ఎందుకయ్యిందంటే లోకానికి, లోకానికి మధ్య గడపలు ఉన్నాయి. ఏడు అంతస్తుల మేడ లాగ, ఏడు ద్వీపాలతో కూడినటువంటి శరీరమే మానవ శరీరం. దాని భారం మనం మోస్తూ ఉన్నాం కదా! ఈ శరీరాన్ని మోసుకునే కదా ఇక్కడికి వచ్చాం! పొద్దున్నే నిద్ర లేవలేదనుకోండి దాన్ని మోసుకురావాలి లేపితే! బాగా ఉత్సాహంగా ఉన్నప్పుడు సులభంగా మోసేస్తాం కదా! నిద్రపోయిన తర్వాత, దాన్ని ఎంతో సులభంగా, లేడిలాగా చెంగుచెంగున వచ్చేస్తాం కదా! అది ఎందుకు జరుగుతుందంటే "సంప్రాప్త శ్రీయుతుఁడై".

మనమంతా సంప్రాప్త శ్రీయుతులం. అంటే ఇది చాలా మంచి విషయం. మనకి పొద్దున్న తెలివిరావడం ఇలాంటివన్నీ జరుగుతాయి కదా! మేల్కొంచడం అంటాం. ఇవన్నీ మనకి సంబంధించినటువంటివి కాదు. మనలో ఉండేటటువంటి "శ్రీ" చేస్తూ ఉంటుంది. మనలో ఉండేటటువంటి "శ్రీ"నే మనకి మెలకువ తెప్పించడంగాని, మనకి ఇచ్ఛ స్ఫురించడంగాని, క్రియ చేయించడంగాని, అన్నిటికీ ఆమే ఆధారం. క్రియగాని, తెలియుటగాని, జ్ఞానంగాని, ఇచ్ఛగాని, ఇవన్నీ అమ్మ మనకి ఇచ్చి ఉన్నది. అవి ఆమె మనకి ప్రాప్తింపచేస్తుంది, మనం కాదు. అవి ఆమెవే అన్న భావం ఉన్నచోట బాగా పనిచేస్తుంది. మనది అనుకున్నచోట పప్పులో కాలేస్తుంది. ఎవరయినా మన్ని, "మీరు చాలా తెలివికలవారు, మేధావులు" అంటే "ఇహిహి!" అనకూడదు. వెంటనే లోపలుండే అమ్మకి దణ్ణం పెట్టుకోవాలి, "నీవల్లే వాళ్ళు ఇట్లా నన్ను పొగుడుతున్నారు" అని. మనలో ఉండే ప్రతి శక్తీ అమ్మదే. మనలో ప్రతి దక్షతా అమ్మదే. ఇలా చేద్దాం అనిపించడం... మాస్టరుగారి బొమ్మలు ఏర్పాటు చేశాం కదా! ఇలా అనిపించడం అది మొట్టమొదటిసారి ఎక్కడినుంచి వచ్చింది? దాని గురించి ఆలోచిస్తే మనకి ఇవ్వబడ్డది ఆ భావన. సంకల్పాలు ఇవ్వబడుతూ ఉంటాయి. అంచేత, అలా ఉన్నవాళ్ళకి అంతా "శ్రీ"నే, అంతా శుభమే. అంచేత, ఆ విధంగా మనమంతా సంప్రాప్త శ్రీయుతులం. కానీ దానియందు మనకి శ్రద్ధ లేకపోవడంవల్ల అది పోతూ ఉంటుంది. శ్రద్ధ లేకపోవడంవల్ల వైభవం ఉండదు. దానియందు శ్రద్ధ ఉండాలి. దానియందు భక్తి

కలిగి ఉండాలి. దానియందు కృతజ్ఞతా భావం ఉండాలి. నీవు లేక నేను ఎక్కడున్నాను తల్లీ అని చెప్పుకోవాలి. నువ్వు లేపితే నేనున్నాని ఒకడిని లేచాను. "కాంసోస్మితాం" అని మాటిమాటికి చెప్తూ ఉంటాను. అంటే, నేను ఉన్నానని అనిపించడానికి ఎవరు ఆధారం మనలో? చైతన్యం ఆధారం. అది నిద్రలో ఎక్కడ ఉంది? శివుడితో ఉంది. శివుడితో ఉన్న చైతన్యము ఒక కెరటంలాగా వ్యక్తమయ్యింది. వ్యక్తమైన తర్వాత ఇలా చేద్దాం అనుకోవడం, దాన్ని చెయ్యడం, ఇలా జరుగుతూ ఉంటుంది. వెండితెర వెలగక ముందు ఏముంది ఆట? అది చూస్తూ ఎంతసేపు కూర్చుంటావు? వెలిగితే చప్పట్లు కొడతాం. చిన్నప్పుడు మనమంతా అదే చేశాము. ఎందుకంటే, సినిమాహాలుకి గంట ముందో, ముప్పావుగంట ముందో వెళ్లి కూర్చోవడం! తెర తీయగానే చప్పట్లు. దానిమీద వెలుగు పడగానే మరిన్ని చప్పట్లు. ఇంక బొమ్మలు పడతాయి కదా! బొమ్మల కథ శాశ్వతం కాదు. బొమ్మల కథ కన్నా వెలిగించిన వెండితెర శాశ్వతం. వెలిగించిన వెండితెర కన్నా ఉత్తతెర శాశ్వతం. ఉత్తతెర లాంటి వాడు పరమాత్మ. వెలిగించిన తెర లాంటి వాళ్ళు అర్ధనారీశ్వరులు. "The space alternatingly becomes dynamic and static" అంటుంది మేడమ్ బ్లావెట్స్కీ. అట్లా static, dynamic అవుతూ ఉంటుంది కాబట్టి అది ఒక pulsating principle గా వచ్చి, "space pulsates" అంటూ ఉంటాము. అట్లాగే మనలో కూడా స్పందన, అది శివ-శక్తుల యొక్క స్థితి. అలా వెళ్లిపోవద్దు మనం! ప్రస్తుతంలోకి వద్దాం.

ఆ విధంగా దేనివల్ల మనకి మెలకువ వచ్చింది? మెలకువ రాకముందు? మెలకువ వచ్చిన తర్వాత? మెలకువ రావడం బట్టి కదా మనకి ఇచ్ఛ కలుగుతోంది! ఏదో ఇచ్ఛ. ఏదయినా కావచ్చు – కాఫీ గురించి అవ్వచ్చు, పక్కవాళ్ళ గురించి అవ్వచ్చు. ఏదయినా రావాలి కదా! అంచేత, ఇలాంటి చైతన్య వ్యాపారమే సృష్టి అంతా. అది నీ యందు ఉండకపోతే నువ్వు ఎక్కడ ఉన్నావు? నీకూ రాయికి తేడా లేదు. రాయిలా పడుంటావు, నిద్ర పోతావు. అందుకనే, శివలింగం పెట్టినచోట ఉంటుంది, కదలిక ఉండదు. మొక్కలో ఇంకొంచెం కలవంటి చైతన్యం ఉంటుంది. జంతువులో చైతన్యం ఉంటుంది గాని పూర్ణచైతన్యం ఉండే అవకాశం మనిషిలో ఉంటుంది. ఇలా మనకి నాలుగు స్థితులు ఉంటాయి. "*సంప్రాప్త శ్రీయుతుఁడై.*" "*సప్తద్వీప విశాలభూభరము దోఃస్తంభంబునం బూని*" అంటే ఇడ–పింగళ నాడులుగా, కుడి–ఎడమగా, ప్రజ్ఞ–పదార్థముగా రెండు స్తంభాలు ఉన్నాయండి. అదే మిథున రాశి కుడి–ఎడమగా. ప్రకృతి అంతా ఎడమ, ఇడ. కుడి అంతా పింగళ, పురుషుడంతా పింగళ. ఈ రెండిటికి నడుమ దారి ఉంది. ఇట్లా ఏడు లోకాలుగా మనిషి ఏర్పడుతాడు. మనిషి అంటే మానవుడు, మనువు నుంచి వచ్చినవాడు. ఇలా ఏర్పడ్డ వాళ్లకి ఈ రెండే ఆధారం. ఇందులో ఏది తక్కువ అయినా పక్షవాతం వస్తుంది. కొంతమందికి ఒక కన్ను బాగా కనిపిస్తుంది, ఒక కన్ను కనిపించదు. కొంతమందికి ఒక మెదడు బాగా పనిచేస్తుంది, ఇంకొక మెదడు అంత బాగా పనిచెయ్యదు. కొంతమందికి శ్వాస ఒక పుటం నుంచి బాగా వస్తుంది, రెండో పుటం నుంచి అంతంత

మాత్రంగా వస్తుంది. ఇవే హెచ్చుతగ్గులు. కుడి–ఎడమలు సమతలం అవ్వాలి. ఇట్లా ఎడమ–కుడి, రెండిటిని సమతలం చేసుకోవడమే యోగసాధన, దైవారాధన, ఇవన్నీ కూడా. అలా చేసుకుంటే తన గురించి తనకి తెలిసేటటువంటి అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీనికి ప్రధానమైన పాత్ర ఎవరు పోషిస్తారంటే అమ్మయే, లేక చైతన్యమే.

అంచేత, "సంప్రాప్త శ్రీయుతుఁడై" అంటే అర్థం ఏమిటంటే "శ్రీ"తో కూడి ఉన్నటువంటివాడు. "శ్రీ"తో కూడి ఉన్నవాడు అంటే తను కూడలేదు "శ్రీ"తో, "శ్రీ" తనని కూడింది, ప్రాప్తించింది. ప్రాప్తించకపోతే ఏమీ లేదు. ప్రాప్తిస్తేనే అంతా. అంటే, మనలో ఉండే శ్రీ అంటే ఇచ్ఛ. శ్రీ అంటే జ్ఞానం. శ్రీ అంటే క్రియ. శ్రీ అంటే అజ్ఞానం. నాలుగు రకాలుగా చెప్పారు. శ్రీ అనంగానే ఈ నాలుగు స్థితులు ఉన్నాయి. ఏదో దానితో అది మనని కూడి ఉన్నది. అజ్ఞానం అన్నా కూడి ఉన్నది, జ్ఞానం అయినా కూడి ఉన్నది. అజ్ఞానానికి ఇచ్ఛా, క్రియా శక్తులు ఉన్నాయి. జ్ఞానానికి ఇచ్ఛా, క్రియా శక్తులు ఉన్నాయి. అంచేత, శ్రీ మనని కూడింది తప్ప మనం శ్రీని పొందలేము. ఇది ఒకటి తెలుసుకోండి. శ్రీని మనం పొందాలి అనుకునే కన్నా, శ్రీని ఆరాధన చేస్తే, శ్రీ మనని పొందుతుంది. ఒక పెద్ద సభలో ఒక సామాన్యుడు ఆ సభకి ప్రధానమైనటువంటి వ్యక్తి దగ్గరగా వెళ్ళాలంటే అంత సులభం కాదు కదా! ఆ ప్రధానమైన వ్యక్తే ఆ సామాన్యుడి దగ్గరకు వెళ్ళడం అనే దాంట్లో ఏమాత్రమైనటువంటి ఆయాసం లేదు, ఇబ్బంది లేదు. అంటే పద్యాలు చదువుకునేటప్పుడు ఇలా చదువుకుంటే

బావుంటుందన్న ఉద్దేశ్యంతో చెప్తున్నాను. పద్యం చదువుకుని, తాత్పర్యం చదువుకుంటే బావుంటుంది.

*"సప్తద్వీప విశాలభూభరము దోఃస్తంభంబునం బూని సం*
*ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవసంపచ్చాతురిం గల్గి"*

ఎప్పుడయితే శ్రీ తనను ఆవరించిందో, "తత్సవితుర్వరేణ్యం" అంటూ ఉంటాం కదా! నువ్వు నన్ను కౌగలించుకో, నువ్వు నన్ను ఆవరించు, నువ్వు నన్ను నీ ఆవరణలోకి తీసుకో, ఇలా కోరేది గాయత్రి. నేను వచ్చేస్తాను అని చెప్పేది కాదు గాయత్రీ మంత్రం. ఇదిగో నేను వచ్చేస్తున్నాను అనడానికి కుదరదు. ఎందుకంటే, సూర్యుడిని దాటి వెళ్ళాలి గాయత్రి అనే వెలుగులోనికి. కాని సూర్యుడి నుండి మన దగ్గరకు గాయత్రే వచ్చేస్తుంది కదా! ప్రతినిత్యం ఎక్కడెక్కడనుంచో వచ్చి మన్ని ఆలింగనం చేసుకుంటుంది శ్రీ. "తత్సవితుర్వరేణ్యం" – నువ్వే నన్ను ఆలింగనంలోకి తీసుకో తల్లీ! నువ్వు నన్ను ఒళ్లోకి తీసుకో తల్లీ! నువ్వు సంరక్షించుకో తల్లీ! నీ స్పర్శ ఎప్పుడూ ఉండేటట్టుగా చూడు తల్లీ! అని కోరేదంతా గాయత్రి. అంటే గాయత్రి మంత్రం ద్వారా అలా కోరుతూ ఉంటాము.

అంచేత, అలా ఉన్నప్పుడు ఏం జరుగుతుందంటే, అలాంటి శ్రీ మనతో ఉన్నప్పుడు "మహావిభవసంపత్" అంటే మహావైభవము. జ్ఞానము (సరస్వతి) ఉన్నచోట లక్ష్మి ఉండదట. లక్ష్మి ఉన్నచోట సరస్వతి ఉండదట. ఈ రెండూ ఒకచోట చేరితే అక్కడ వైభవము ఉంటుంది. మామూలుగా బాగా తెలిసినవారు అంత సంపదలో ఉండరు. బాగా సంపదలో ఉన్నవారికి

కొంచెం బుర్ర తక్కువగా ఉంటుంది కదా! పూర్ణ అనుగ్రహం ఉన్నచోట రెండూ కలిసి ఉంటాయి. అందుకనే లక్ష్మి, సరస్వతులు అత్తాకోడళ్ళు, ఒకే ఇంట్లో ఉండరు అని మనకి కథలు చెప్తూ ఉంటారు. సంపద ఉన్నది, జ్ఞానము ఉన్నది. కాబట్టి మహత్తరమైన వైభవము అక్కడున్నది. అంతే కాదు. చతురత అంటే ఆ వైభవాన్ని ఏ విధంగా సద్వినియోగం చెయ్యాలి, తనకున్న జ్ఞానాన్ని ఏ విధంగా సద్వినియోగం చెయ్యాలి? జ్ఞానాన్ని ఏ మాత్రం సంకోచించకుండా పంచాలి. అలాగే సంపదను పంచాలి. ఇలా జ్ఞానాన్ని, సంపదను పంచుతూ ఉండేవాడు చాలా వైభవంలోకి నడిచి వెళ్తాడు. ఆ విధంగా ఉన్నాడటండి అంబరీషుడు.

*"దుర్వ్యాప్తిం జెందక"* ఇదొకటి ఉంది. జ్ఞానం ఉన్నా ప్రజలను బాధ పెట్టేస్తాం. సంపద ఉన్నా బాధ పెట్టేస్తాం. సంపదని దుర్వినియోగం చెయ్యొచ్చు. జ్ఞానాన్ని దుర్వినియోగం చెయ్యొచ్చు. ఏం సందేహం లేదు. కాస్తోకూస్తో అహంకారం ఉంటే, తగుదునమ్మా అని తనది కాని పనిలోకి దిగడం, అనువుకాని చోట అధిక ప్రసంగాలు చెయ్యడం, వ్యర్థంగా ధనాన్ని వ్యయం చెయ్యడం ఇలాంటివన్నీ దుర్వ్యాప్తి అవుతుంది. ఆ దుర్వ్యాప్తి లేదుట అంబరీషుడి దగ్గర. *"దుర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం"* – అంతవరకేటండి. ఒక పొలిమేర అంటాం చూశారా, ఒక హద్దు ఏమిటయ్యా అంటే *"వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్"*. వైష్ణావార్చన అంటే ఎప్పుడూ ఇంట్లో పూజగదిలో కూర్చుని విష్ణుపూజ చెయ్యడం కాదు. పూజగదిలో కూర్చుని విష్ణువుకి పూజ చెయ్యడం అంటే, ఆ పూజగదిలోంచి వచ్చినప్పుడు

కనబడినదంతా కూడా విష్ణువే అని భావించినప్పుడు, దానితో మనం ప్రతిస్పందించడం జరుగుతున్నప్పుడు అది వైష్ణవార్చన అవుతుంది. మనం పూజగదిలోంచి బ్రహ్మాండంగా పూజ చేసి బయటకు వచ్చామనుకోండి. ఆ time లోనే ఇంట్లో పనిమనిషి చీపురు పట్టుకుని అడ్డం వచ్చిందనుకోండి! "ఆహా! విష్ణువు" అనిపిస్తుందా? పైకి తిడితే మళ్ళీ రేపు పనికి రాదేమో అని లోపల తిట్టుకుంటావు! ఈ రోజుల్లో పనివాళ్ళని బయటకు తిట్టడం అంత తెలివైన విషయం కాదు. ఎందుకంటే వాళ్ళు రారు. లేకపోతే, నువ్వే రేపు పొద్దున్న అది (చీపురు) పట్టుకోవాలి కదా! అంచేత, నీవు లోపల ఏ ఆరాధన చేశావో, బయట కూడా దాన్నే దర్శించడం అనేటటువంటిది విష్ణువుని అర్చించడం. ఎందుకంటే, *"విశ్వం విష్ణుః", "విశ్వంబు విష్ణుడు", "విష్ణువు కంటే వేరేమియు లేదు"*. విష్ణుపరంగా చూడడం మనకు అంతగా వీలుపడదు. కానీ అంబరీషుడు అది నేర్చుకున్నాడు, ప్రహ్లాదుడిలాగా. ఆయన కార్యక్రమాల క్షేత్రం చాలా పెద్ద క్షేత్రం. ఏడు ఖండాలతో కూడినటువంటి సామ్రాజ్యానికి ఆయన నిర్వహణాధికారి. కాని ఎప్పుడూ కూడా దుర్వ్యాప్తి లేదు. అంతా విష్ణుపరంగా చూస్తున్నాడన్నమాట.

అది చెప్పడానికి *"వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్ సుప్తిం బొందక"*. అదొకటి ముఖ్యం. సుప్తి అంటే నిద్ర. గాఢ సుప్తి అంటూ ఉంటారు. నిద్ర అంటే ఇంకో అర్థం మరపు. మరపు లేదాయనకి. విష్ణువును గూర్చిన మరపు లేదాయనకి. మరపే మృత్యువు అన్నారు. అంటే, మనకెవరికైన ఒక ideal

పెట్టుకుందామనుకుంటే మన భక్తికి, మన యోగసాధనకి, అంబరీషాదులు పర్వత శిఖరాలలాంటి వాళ్ళు, సామాన్యులు కాదు. మనం చేసేవి చిన్నచిన్న పనులు. మన పరిధి కూడా చాల తక్కువ. ఊరికే చిరాకు పడిపోతూ ఉంటాం పూజలు చేస్తుంటే – చిరాకు, కోపం, ఏమిటో కక్ష సాధింపుగా ఉంటాయి! ఎందుకయ్యా అలా జరుగుతుందంటే అంతరంగంలో చూసేది బహిరంగంలో చూడడం లేదు. మళ్ళీ చదివేస్తాం, "అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణస్థితః" అని మంత్రపుష్పం ఒకటి దగ్గర పెట్టుకుని ఏదో చాలా తన్మయత్వం చెందినట్టుగా భావిస్తాము. అలా ఉంటే, పక్కనే ఉన్న కుర్రవాడు తన్నేస్తాడు పూలు! "బహిశ్చ" అయిపోయింది! అసలు మనకి పరీక్ష అంతా బహిరంగంలోనే ఉంటుంది. అంతరంగంలో ఏముంటుందండి? అంతరంగంలో నువ్వు ఏకాంతంలో దేవుడితో ఉంటావు. బహిరంగంలో ఆయనే బహుపాత్రధారిగా ఉంటాడు. "*నర్తకునిభంగిఁ బెక్కగు మూర్తులతో నెవ్వఁ డాడు మునులు దివిజులుం గీర్తింప నేర రెవ్వని వర్తన మొరు లెఱుఁగ రట్టివాని నుతింతున్*" అని గజేంద్రుడు ఒక పద్యం పాడతాడు. అలా బయటకి రకరకాలుగా పాత్రధారులు వస్తూ ఉంటారు. వారిలో కొంతమంది విష్ణువుని చూసి, అది ప్రాతిపదికగా వారితో నువ్వు ప్రతిస్పందించడం అనేటటువంటిది నిజమైన భక్తికి తార్కాణం. అలాంటి వారు నెమ్మదిగా ఉంటారు, త్వరపడరు. ఎంచేత అంటే అతని రూపంలో దైవము ఇప్పుడు, ఈ కాలంలో, ఈ ప్రదేశంలో ఏది నిర్దేశించాడో తెలుసుకుని,

అటుపైన తనవంతు కర్తవ్యం మేర ప్రతిస్పందిస్తూ ఉంటాడు. ఇంత కథ నడుస్తూ ఉంటుంది. అంచేత, ఆయన *"సుప్తిం బొందక"* – మరపు రాదు, అంతే తప్ప నిద్రపోడని కాదు అర్థం. నిద్రపోడు అంటే నిర్వహణ సమయంలో విష్ణువుతో ఉంటాడు. విష్ణువుని మర్చిపోడు. *"సుప్తిం బొందక యొప్పె"* ఉన్నాడట అలా.

*"సద్గుణగరిష్ఠుండు"* అంటే చేరవలసిన సద్గుణాలు అంతకన్నా మించి లేవు. ఎందుకంటే అది అంతే! విష్ణువు సృష్టిలో ఉండే సమస్త సద్గుణాలకి మూలము. ఆయన ఆరాధనలో వుంటే అలా ఒక్కొక్కటీ వచ్చి చేరిపోతుంటాయట సద్గుణాలు, busy busy గా, నేనంటే నేనని పోటీపడి. *"సద్గుణంబులెల్ల సంఘంబులై"* వచ్చి చేరతాయట ప్రహ్లాదుడిని. సంఘాలు, సంఘాలుగా వస్తాయట. ఒక్కొక్కటీ రావడం కాదు. సంఘాలు, సంఘాలుగా వచ్చేసినాయట సద్గుణాలు. ఎంచేత? నారాయణ మంత్రం. ఉచ్ఛ్వాస నారాయణ, నిశ్వాస నారాయణ, కళ్ళు తెరిస్తే నారాయణ, కళ్ళు మూస్తే నారాయణ. అంచేత, ఇక్కడ ఈ అంబరీషుడికి కూడా ఈ వైష్ణవార్చనల కారణంగా ఒకటి– మరపు పోయింది. రెండు– సద్గుణాలన్నీ చేరిపోయాయి. సత్వగుణాలే సద్గుణాలు. బాగా రౌద్రం ఉన్నటువంటి వాళ్ళకి విష్ణుపూజ చేసుకోండి బావుంటుంది అని చెప్పాలి. "రుద్రాభిషేకం చెయ్యి గురూ!" అంటే వాడింకా రెచ్చిపోతాడు. ఇప్పటికే మనకి లోపల చాలా రౌద్రం ఉన్నది, వేదన ఉన్నది. వాడికి విష్ణువే సుఖం. అంచేత, ఆరాధన బట్టి కూడా ఉంటుంది. ఏ మూర్తి ఆరాధన చేస్తే ఆ మూర్తి గుణాలన్నీ మీకు వస్తాయండి. "ఆరు నెలలు ఎవరితో తిరిగితే వాడు వీడవుతాడు",

అంటారు కదా అలా! అంచేత, ఇక్కడ ఈయన సద్గుణగరిష్ఠుండు అయ్యాడటండి.

అంబరీషుడు ఆయన పేరు. పేరు ముందు ఇవ్వలేదు. ఇప్పుడే ఇచ్చారు. "అంబరీషుడు" అంటే ఆకాశమును అధిష్ఠించి ఉన్నవాడు అని అర్థం. ఆకాశమంటే పృథ్వి, ఆపస్సు, తేజస్సు, వాయువు దాటినటువంటి హృదయాకాశంలో ఉంటూ అన్ని కార్యాలు నిర్వర్తిస్తుంటాడు. అది ఆయన యొక్క గుణకీర్తనము, ఆ విధంగా రాస్తారు పోతనామాత్యులవారు.

*"సప్తద్వీప విశాలభూభరము దోఃస్తంభంబునం బూని సం*
*ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవసంపచ్చాతురిం గల్గి దు*
*ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్*
*సుప్తిం బొందక యొప్పె సద్గుణగరిష్ఠుం డంబరీషుం డిలన్"*

ఒక పద్యం చదువుకుని, ప్రతిదానికి అర్థం తెలుసుకుంటూ, దానిమీద మనం కొంత విచారణ చేస్తుంటే... విచారించకూడదు! విచారణ చెయ్యాలి. చేస్తుంటే అందులోంచి మనకి బాగా రసం వస్తుంది. భాగవతం ఒక మధురమైన గ్రంథం. ఎంత పిండుకుంటే అంత రసం వస్తుంది. పిండే వాడి ఓపిక బట్టి అలా పిండుకుంటూ చదువుకోవచ్చు పద్యాలు. అలా చదువుకుంటే భాగవతం చాలా ఆనందాన్ని ఇస్తుంది.

*"చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద".* మనసెప్పుడూ మధురిపు అంటే మధువు అనే రాక్షసుడిని సంహరించినవాడు

మధుసూదనుడు. అతని యొక్క "శ్రీపాదములయందు". శ్రీ పాదములు అంటే శుభకరమైనటువంటి పాదములు. సర్వమంగళ పదములైనటువంటి పాదములు. ఆ పాదములయందు ఉంటుందటండి చిత్తము. నిజానికి భగవంతుడి పాదాలు మన భూమి ఏడో పొరపై ఉంటాయట. అంతకన్నా కిందకి రావని విష్ణుపురాణంలో చెప్తారు. భూమి ఏడో పొరలో పుష్కరద్వీపం ఉంటుంది. దాన్నే శ్వేతద్వీపం అంటూ ఉంటాం. అక్కడ ఉంటుంది పొర స్పర్శ. మనలో ఆ ద్వీపమే సహస్రారము. ఏడు లోకాలు కదా ఏడు ప్రజ్ఞా కేంద్రాలు! ఈ ప్రజ్ఞా కేంద్రాలలో ఏడోది సహస్రారం. అందుకని శిరస్సున భగవత్ పాదాల స్పర్శ ఉంటుంది. ఆ స్పర్శ వలన సహస్రారం నుండి మూలాధారం వరకు అయస్కాంతంలా తయారవుతుంది భక్తుడికి. అది contact point అన్నమాట. మాములుగా ఏడు లోకాలు, ఏడు ఉపలోకాలు అని చెప్తారు – నలభైతొమ్మిది లోకాలు. సృష్టి ఏడో లోకం మన భూమి. ఏడు ఉపలోకాల్లో మనకి కనిపించే భూమి అన్నిటికన్నా బాగా, touch down అంటారు చూశారా, ఘనమైన భూమి. అటుపైన నీరు, అటుపైన అగ్ని వలయం, అటుపైన వాయువలయం, అటుపైన ఆకాశవలయం అట్లా ఉంటాయి. ఏడో వలయంలో ఆయన స్పర్శ తగులుతుందండి. ఆయన స్పర్శ... అలాగే మనలో కూడా, మనం ఎక్కడుంటాము? ఏదో మూలాధారంలోనో, బొడ్డులోనో పడుంటాము. ఈ శ్రీపాదముల యొక్క ఆరాధన అలాంటిది. అందుకనే మీరు తిరుపతి వెళ్తే స్వామివారి పాదాలు నెత్తిమీద పెట్టుకోమని చెప్తారు. గుండెలకి అద్దుకోమని చెప్తారు. ఆ పాద

స్పర్శ వలన మన ప్రజ్ఞ హృదయం చేరి, ఆపైన సహస్రారం చేరుతుంది. అలా ఒక చైతన్యం... మహా చైతన్యం స్పర్శ కలిగితే ఇంక అంతా పైకే... *"కపర్దినేచ"* అంటూ ఉంటాం చూశారా! అలా ఊర్ధ్వముఖమై వుంటుంది. అపుడు శరీరం తేలిక పడిపోతుంది. గాలిలో తేలిపోతున్నట్లుంది. స్వామి పాదుకల స్పర్శ అంత మహిమ కలవి. అవి నెత్తిన పెట్టుకొని అలిపిరిలో స్వామి చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేస్తే అటుపైన ఏడు కొండలూ సునాయాసంగా ఎక్కవచ్చు. ఇది స్వానుభవం! 21 సార్లు అలాగే ఎక్కటం జరిగింది. అహంకారపడి, మనమే ఎక్కుతున్నామనుకుంటే అంతా ఆయాసమే! మాటి మాటికి కూర్చోవటమే! బిందెడు నీళ్ళు తాగేస్తూ ఎక్కకూడదు. దైవమే మన శిరస్సుపైనుండి మనలను తేలికగా పైకి లాగేస్తున్నాడన్న భావన వుంటే, శరీర పరిస్థితి ఎలా వున్నా, ఎక్కటం సాధ్యం. అందుకే "గోవిందా!" అని స్మరిస్తూ ఎక్కటం.

శివుని చైతన్యం అంతా ఊర్ధ్వముఖమే. దిగదు కిందకి. అదే శివుడితో వచ్చిన తంటా అంటారు. శివుడికి ఒక కుమారుడు కలిగితే, అతని వల్ల సృష్టికి చీకటి బాధలు తప్పుతాయని ఋషులు, దేవతలు భావిస్తారు. కాని శివుడు పరిపూర్ణ ఊర్ధ్వరేతస్కుడు. అతనిని చేరడమే అతి కష్టం. అతడు అగ్ని స్వరూపం. అగ్నికే అగ్ని. నిజానికి వేదంలో అగ్నినే, పురాణాలలో శివుడన్నారు. అగ్నిశిఖ ఊర్ధ్వముఖమే కాని, అధోముఖం కాదుకదా! ఊర్ధ్వముఖుని అధోముఖుని చేయటం ఎవరి తరం? శివ చైతన్యం ఊర్ధ్వముఖమై ఉంటుంది. అధోముఖం రాదు. నువ్వు ఏం చేసినా రాదు. మన్మథుని ప్రయోగించినా రాదు. ఎలా చేసినా

రాదు. అలా ఊర్ధ్వరేతస్కులుగా ఉంటారు. తపోధనులందరూ ఊర్ధ్వరేతస్కులే. మనలా అధోప్రవాహం ఉండదు. ప్రజ్ఞ మనయందు ఊర్ధ్వమునుండి ఆలోచనల తీరుబట్టి అధోముఖంగా ప్రవహిస్తూ వినియోగపడుతుంది. అది సద్వినియోగమూ కావచ్చు, దుర్వినియోగమూ కావచ్చు. దుర్వినియోగమైనపుడల్లా మనం కూడా అధస్సు చేరుతూవుంటాం. అదే పాతాళం చేరిన గంగ అని భర్తృహరి విన్నవించాడు. ఊర్ధ్వలోకాల నుండి, మన శిరస్సును చేరి, అక్కడ నుండి హృదయం చేరి, అటుపైన వినియోగానుసారం పాతాళం చేరటమో లేక దివ్యలోకాలు చేరటమో ఉంటుంది.

హృదయం చేరిన ప్రజ్ఞకు ఒక దారి ఊర్ధ్వముఖంగాను, వంద దారులు అధోముఖంగాను వుంటాయి. ఊర్ధ్వమగు దారిని సుషుమ్న అంటారు. ఆ దారిలో ప్రవేశించాలంటే జీవితం యజ్ఞార్థం కావాలి. పరహితమే పరమ ధర్మం కావాలి. స్వహితం కోరే వారికి ఊర్ధ్వగతి లేదు. *"పెక్కుభంగులు వివేక భ్రష్ట సంపాతముల్"* అని రాస్తాడు భర్తృహరి. అంచేత, ఊర్ధ్వముఖంగా బాగా ఆయనకి, అంబరీషుడికి, ఆ విధంగా భావన జరుగుతూ ఉంటుంది. అలా మనం ఊర్ధ్వముఖంగా ఆరాధన చేస్తుంటే అనుగ్రహం వలన హృదయం వరకూ దేవుని పాదాలు మనకి అనుభూతి అవుతుంది. దిగి వస్తాడు. హృదయం వరకూ దిగి వస్తాడు. బుద్ధిలోకం వరకూ దిగి వస్తాడు. అంచేత, ఆ విధంగా ఆరాధన చేసుకుంటున్నాడు.

*"పలుకులు హరిగుణపఠనమంద".* హరిగుణ పఠనం చేస్తుంటాడట. అంటే ఏమిటంటే ఈ వచ్చిన వాళ్ళలో, మనకి

కనిపించిన వాళ్ళలో, మనకు తెలిసిన వాళ్ళలో సద్గుణాలు ఉంటాయి. ఇతర గుణాలు కూడా ఉంటాయి. బొత్తిగా ఏం సద్గుణాలు లేకుండా ఎవడూ ఉండడు. మీరు పరిశీలించి చూడాలి తప్ప మనం వెధవ అనుకునే వాడిలో కూడా ఒక మంచి గుణం ఉంటుంది. వెతుక్కోవాలి. అదీ పతనం. ఎవరియందు ఏ విధమైనటువంటి సద్గుణమున్నదో ఆ సద్గుణాన్ని పరిశీలించి, గ్రహించి, ఆ సద్గుణంతో అనుసంధానం కలిగి ఉండాలి. మిగతా విషయాలతో మనకి పనిలేదు. "అదేంటండి, ఆయన తాగుబోతు కదా! ఆయనతో తిరుగుతున్నారు?" అంటే, ఆయనలోని తాగుబోతుతో నీకు సంబంధం లేదు. "అదేంటండి, ఆయన బాగా smugling చేస్తూ ఉంటాడు?" అంటే, నాకు సంబంధం లేదు. అంత మంచివాడు కాదంటే, అయ్యి ఉండొచ్చు. నాకు అతనిలో ఉండే సద్గుణంతోనే సంబంధం. ఇట్లా పెట్టుకోవచ్చు. సంఘంలో పెద్దపెద్దవాళ్ళు ఉంటారు. వాళ్ళలో అలా పెద్ద అవ్వడానికి ఒక సద్గుణం ఉంటుంది. మనం కాలేదు కదా! మనం Prime Minister అయిపోగలమా? Chief Minister కాగలమా? Minister కాగలమా? అవ్వలేము. అవ్వకూడదని కూడా అనుకుంటాము! అంటే, అతనిలో ఉండే మిగతావన్నీ బాగా ప్రచారం అవుతూ ఉంటాయి. కానీ ఏదో సద్గుణం లేకుండా అప్పనంగా ఎవరు పెద్దవాళ్ళు కాలేరు. "నా విష్ణుః పృథ్వీపతిః" అన్నారు. రాజముద్ర అధికారం ఎవరికొచ్చినా, అంటే బిళ్ళజవానుతో సహా, వాడిలో ఏదో విష్ణుగుణం ఒకటి ఉంది. సద్గుణం లేకపోతే కాలేడు. అందరూ బిళ్ళజవాను కాలేరు.

ఎందుకంటే, ప్రభువు విష్ణువే. అంచేత, గుణపఠనం చెయ్యమంటే ఎదుటివ్యక్తిలో ఉండేటటువంటి సద్గుణాలని పరిశీలించి, గమనించి, దానితో మనకి సంబంధం గట్టి చేసుకోవాలి. మిగిలిన విషయములతో మనకి సంబంధం లేదు. తేనెటీగ చూడండి. పూలమొక్కలతో తేనెటీగకి ఏమిటి సంబంధం? మధువుతోనే సంబంధం, మిగతా వాటితో సంబంధం లేదు. అంచేత, సరాసరి పూవు మీద వాలీవాలనట్టుగా వాలి, ముక్కుతో తేనే మాత్రం పొందుతుంది కదా! అన్ని పువ్వుల్లో మధువు ఉంది కాబట్టి మధువు సేకరణలో తాను లగ్నం అయ్యి ఉంటుంది తేనెటీగ. మరి దాని ఏకాగ్రత అది. అంటే, నీకు ఏది ప్రప్రధానమైనటువంటి విషయమో దానితోనే నువ్వు అనుసంధానం చెందు అందరిలోనూ. ఇతర విషయాలతో అనుసంధానం చెందక. ఎన్ని గుణాలు కనిపిస్తే అన్ని గుణాలు వాడిలో చూసి కీర్తిస్తూ ఉండు. మనం దానికి సరిగ్గా వ్యతిరేకంగా చేస్తాము! ఎంతసేపూ రంధ్రాన్వేషణే మన ప్రధాన కార్యంగా ఉంటుంది. ఎక్కడ మచ్చ ఉంటే అక్కడ చూస్తాము. ఇంత గోడ ఉంటే అది చూడము. బావుంది కదా ఎక్కడా మచ్చ లేకుండా! ఏ మూలో వున్న మచ్చ చూస్తాము. ఇంత పెద్ద గోడ చందనం రంగులో ఆనందం కలిగిస్తూవుంటే, ఏ మూలో వున్న మచ్చచూసి, అందరికి ఆ మచ్చ చూపిస్తాము. అదే దుర్దర్శనము. ఇక సుదర్శనం ఎక్కడ లభిస్తుంది? చూస్తే చంద్రుడిలో కూడా మచ్చ కనిపిస్తుంది. మచ్చ చూసి బాగా ఆనందపడ్డారా కవులు, రసికులు? లేకపోతే చంద్రుడిని చూసి, అతని వెన్నల చూసి అనుభూతి పొందారా? చంద్రుడి వెన్నలను దర్శించి, ఆ వెన్నలలో

దివ్య దర్శనం పొందటం సద్భక్తుల వంతు. అందులో మచ్చలు వెతకటం మూర్ఖుల వంతు.

మాస్టరుగారు ఒక చోట రాస్తారు, అయస్కాంతం వంకరగా ఉందని ఏడవక, అది ఇచ్చే అయస్కాంత శక్తిని తీసుకోమని. అయస్కాంతం సొట్ట పడ్డదని ఒకాయన అంటే, "సొట్టతో నీకేం సంబంధం? అందులో ఉండే అయస్కాంత శక్తితో కదా నీకు సంబంధం!", "గురువుగారిలో ఉండే రంధ్రాలన్నీ చూడకండి. అక్కడ ఉండే గురుతత్వం పొందండి. దానితోనే మీకు సంబంధం. ఇతర విషయాలతో మీకు సంబంధం లేదు." గురువుగారు సిగరెట్టు కాలుస్తాడు. గురువుగారు వక్కపొడి తింటాడు. గురువుగారు పచ్చిమిరపకాయబజ్జీ తింటాడు. సినిమాలకి వెళ్తాడు. అవన్నీ ఎందుకు నీకు? గురువు నీకు సంబంధం. గురువుతో మాత్రం పెట్టుకోవటంవల్ల గురుతత్త్వము మనలను స్పృశిస్తూ వుంటుంది. సిగరెట్లతో, వక్కపొడితో, సినిమాలతో సంబంధం పెట్టుకున్నవాడు అవి పొందుతాడు. గురువు దక్కడు. గురువు రూపాన్ని, స్వభావాన్ని ఆశ్రయిస్తే అవి దక్కుతాయి. వాటిని ఆవరించియున్న గురు తత్త్వాన్ని ఆశ్రయిస్తే గురుతత్త్వం అయస్కాంతంలా శిష్యుని అయస్కాంతాన్ని చేస్తుంది. అనుగ్రహం అలా లభించేదే! ఊరికే గురురూపాన్ని బావుకుని లాభం లేదు. ఆయనను కాపీ కొట్టటం అసలు లాభం లేదు.

*"కరములు విష్ణుమందిర మార్జనములంద"* అంటే చేతులు విష్ణుసేవకి వాడతాడు. ఎవడికి ఏ పని చేసినా ఎదుటివాడిలో

ఉండేటటువంటి వాడి చైతన్యాన్ని చూసి అతనికి పని చేసి పెట్టడం. అన్ని రూపాలు విష్ణుమందిరాలే కదా! మందిరం కడుక్కోవడం ఇవన్నీ కూడా అర్థం ఉంది మార్జనం అంటే. పూజగది, పూజగూడు కడుక్కోవడం, తుడుచుకోవడం, అంబరీషుడు ఎప్పుడూ అవే చేస్తూ ఉంటాడుట అని. చక్రవర్తి ఎంతసేపూ ఇంట్లో దేవుడి మందిరం కడుక్కుంటూ ఉంటాడండి, ఇంకేమి చెయ్యడండి అన్నట్టుగా ఉండదు కదా! ఎందుకిలా చెప్తారు అంటే అసలు విష్ణువంటే ఏమిటి, మందిరం అంటే ఏమిటి, ఇవన్నీ ముందుగానే చెప్పేస్తారు. మందిరం అంటే విశ్వమే మందిరం. విష్ణువుకి విశ్వమే మందిరం, అంటే ఆయన ఇల్లు. అందులో ఆయన ఉంటాడు. విష్ణువు నిండి ఉంటాడు కాబట్టి విష్ణుమందిరాన్ని కడుక్కోవడం అంటే చెప్పండి? ఇప్పుడు మన పెద్దపెద్ద boards అవీ పెట్టుకుంటూ, anti-pollution board, anti-pollution authority కదా! ప్రతివ్యక్తీ కూడా తన లోపల, తన బయటా ఎప్పుడూ కడుక్కుంటూ ఉండాలి. ఎంచేత? మనకిచ్చిన దేహం విష్ణుమందిరమే. ఈ పంచభూతాలతో చెయ్యబడిన సృష్టి విష్ణుమందిరమే. అందుకని శుభ్రం లేకుండా ఉంటే మనసు ఒప్పుకోకూడదు. శుచి, శుభ్రత. శుచి, శౌచము అంటారు కదా! లోపల కంపు కొట్టకూడదు, బయటా కంపు కొట్టకూడదు. అలా ఏర్పాటు చేసుకోవాలి. అది విష్ణువు యొక్క ఆరాధనగా భావన చెయ్యాలి. అలా భావన చేస్తే అది విష్ణుమందిర మార్జనం గురించి చేతులు పని చేస్తున్నట్టు.

*"శ్రవములు హరికథాశ్రవణమంద."* చెవులు ఎవరు ఏం మాట్లాడుతున్నా, అవతలవాడు ఏం సోది కొడుతున్నా,

అందులో ఉండేటటువంటి ఓంకారం వినడం. అంతా వినరు తెలిసిన వాళ్ళు. వాడు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడో మూడు, నాలుగు వాక్యాలలో తెలుస్తుంది. ఆ తర్వాత వాడు చెప్పే మాటలు వినకుండా, ఆ మాటల వెనకాల ఉండేటటువంటి శబ్దము, ఆ శబ్దము వెనకాల ఉండేటటువంటి నాదముతో అనుసంధానమై అట్లా ఉంటారు. కాసేపు విశ్రాంతి దొరుకుతుంది. వాడు అట్లా మాట్లాడుతూనే ఉంటాడు కాబట్టి అంతా వినక్కర్లేదు. అసలు విషయం తెలిసిపోయింది కాబట్టి ఉంటాడు, వినడు. ఏం వింటాడయ్యా అంటే ఇదిగో ఇక్కడ రాశారు కదా! లోపలనుంచి వినిపించే నాదాన్ని వింటూ ఉంటాడు. అదే మనం సరస్వతీ సూక్తంలో కూడా చదువుకుంటూ ఉంటాము *"ఉతత్వః పశ్యన్ న దదర్శ వాచమ్ ఉతత్వః శృణ్వన్ న శృణోతి."* వింటూనే ఉంటాను, అసలు నేను పలకడం లేదంటావు. చెవిటివాడికి ఏం చెప్తే లాభం? చూస్తూనే ఉంటాను. నన్ను చూడట్లేదు నువ్వు. నేనేం చెయ్యనురా అంటుంది. నీకు నేను ఎప్పుడూ కనపడుతూనే ఉన్నాను, నీకు నేను ఎప్పుడూ చెప్తూనే ఉన్నాను. నువ్వు చూడవు, వినవు. "మే క్యాకరూ!" అంటుంది. "నేనేం చెయ్యను?" అంబరీషుని చెవులు *"విష్ణునాకర్ణించు వీనుల వీనులు"*. అంటే ఎవరు మాట్లాడినా, "వీడు పిల్ల వెధవ, వీడి మాట వినేదేముంది" అంటూ ఉంటాం మామూలుగా. ముందు మనం నిర్ణయం గావించి దానిమీద వింటూ ఉంటాం అవతలవాడిని – వీడు మనకి important, కదా అని భావించి దానినిబట్టి వింటాం. Unimportant అయితే, "ఆ! వీడి మాట వినేదేమిటి" అని వినం. అలా కాదు.

శ్రద్ధగా ఎవరు చెప్పినా విష్ణువుని విన్నట్టుగాను, ఎవరిని చూసినా విష్ణువుని చూస్తున్నట్టుగాను భావించాలి. "May the light in me, be the light before me. May I learn to see it in all." అంటే ఏమిటి? "May the sound I utter, reveal the light in me. May I listen to it while others speak." ఏదో style గా చదువుకోవడం తప్ప ఆచారం లేదు. కేవలం ప్రచారమే కదా! ఇంకొకళ్ళకి కూడా ఇస్తూ ఉంటాం, "మా గురువుగారు..." అని! అసలు ఆచారమే నిజమైన ప్రచారం. ఆచారం లేని ప్రచారం వల్ల ఉపయోగం ఉండదు. దానివల్ల distrubance ఎక్కువ.

అది అలా ఉండగా *"శ్రవములు హరికథాశ్రవణమంద చూపులు గోవింద రూపవీక్షణమంద."* ఇంక మీకు అర్థమైపోతుంది. ఏముంది? నేను చెప్పక్కర్లేదు కదా! *"శిరము కేశవ నమస్కృతులయంద."* కేశవ అనేటటువంటి భగవత్ తత్త్వము శిరస్సుయందు ఉంది. అంచేత, శిరస్సు కేశవుని నమస్కరిస్తున్న భావంతో ఉంటుందట. *"పదము లీశ్వరగేహ పరిసర్పణములంద."* ఎక్కడ నడుస్తున్నా భూమిని తన్నుతూ నడవడం కూడని పని. భూమికి భారంగా ఉండకూడదు మనిషి నడకగాని, ఉనికిగాని. భూమి ఎంత భరిస్తోంది? క్షమాగుణానికి భూమే ప్రధానం. మూర్ఖులందరూ భూమి మీద చేరారు కదా! శ్రీదేవి కన్నా భూదేవికే చాలా ఇబ్బంది ఎక్కువ. అందుకే మాటిమాటికి భూదేవి దగ్గరకు స్వామి వచ్చేస్తూ ఉంటాడు. *"శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే."* ఆయనకి వైకుంఠం

అంటే విరక్తట! ఎప్పుడూ అక్కడ అంతా తేలికగా ఉంటుంది. ఇక్కడ బరువెక్కువయిపోయి, బాధతో ఉందని వస్తూ ఉంటాడు. అంచేత, మనం తిరిగే ప్రదేశం ఉందే, దానియందు సున్నితంగా మెలగాలి. మోటుతనం కుదరదు.

నడకతోనే చెప్పెయ్యచ్చు వీడు రాక్షసుడా, మనిషా, దేవుడా అని. నడిచేవాడు రాక్షసుడా, మనిషా, దేవతా? అంటే, ఏ స్వభావం ఎక్కువగా ఉంది అనేది. దైవీ స్వభావం ఉండేటి వారు చాలా తేలికగా నడుస్తారు. ఎంత తేలికగా నడుస్తారంటే నడుస్తున్నారా, తేలిపోతున్నారా అనిపిస్తుంది. Master CVV గారు కుంభకోణంలో డబ్బీర్ స్ట్రీట్లో నడుస్తుంటే, ఈయన నడుస్తున్నాడా, గాలిలో తేలుతున్నాడా అని సందేహం కలిగేదిటండి వాళ్ళకి. మన మాస్టరుగారు పుస్తకంలో రాసి ఇచ్చారు. తన్నుకుంటూ నడిచాడనుకోండి, దభీదభీమని. కొంతమంది మేడమీద నడుస్తుంటే కిందవాళ్ళకి ఎవరు నడుస్తున్నారో తెలుస్తూ ఉంటుంది! తన్నకూడదు భూమిని. పరిస్పర్శ కలగాలి. అంటే, భూమిమీద నడుస్తున్నప్పుడు తల్లిమీద నడుస్తున్నట్టే. ఇలా ఎవరూ చెప్పరు కదా! ఎంత సున్నితంగా నడవాలి? తన్నకూడదు కదా కాలేసి గట్టిగా! మీరు గమనించండి పాశ్చాత్యులు నడవడం, భారతీయులు నడవడం. నేను బాగా చూశాను. మనం వాళ్ళకన్నా చాలా తేలికగా నడుస్తాము. మన కాళ్ళకన్నా వాళ్ళ కాళ్ళు చాలా బరువు ఎక్కువ, బాగా బరువు ఉన్న పాదాలు. ఎక్కువ భూమిని తన్నుకుంటూ నడుస్తారు.

ఆసురీ స్వభావం కలిగినవారికి పాదాల బరువెక్కువ. క్రింది భాగం బరువెక్కువ. శిరస్సు, ఉరస్సు, ఉదరం, ప్రజ్ఞ, శక్తి, పదార్థములకు సంకేతం. శిరస్సులో దేవతలు, హృదయంలో మనుష్యులు, పొట్టలో అసురులు వుండాలి. మనవారు (అంటే మానవులు) పొట్టలోను, మొకాళ్ళలోను, పాదాలలోను వుంటూ వుంటారు. పెద్ద పాదాలు, లావుపాటి కాళ్ళు, ఊరువులు రాక్షస తత్త్వాన్ని సంకేతిస్తాయి. బుర్ర పెరగాలిగాని పాదాలు, కాళ్ళు బరువుగా, మోటుగా పెరగకూడదు. అలా అని డైటింగ్ చెస్తే ముఖం తాటిముంజల్లే చిక్కుతుంది తప్ప వలసిన మార్పురాదు. శుభకరమైన మార్పు రావాలంటే, భావాలు శుభకరంగా ఉండాలి.

*"కామంబు చక్రి కైంకర్యమంద."* కామం అంటే ఇచ్ఛ. ఇచ్ఛా శక్తి, తన సంకల్పం అంతా కూడా భగవంతునికి సమర్పణ చెంది వసిస్తూ ఉంటాడు అంబరీషుడు. మనకీ సంకల్పాలు వస్తూ ఉంటాయి, తప్పదు. వద్దన్నా వస్తాయి సంకల్పాలు. ఏది చెయ్యవచ్చు, ఏది చెయ్యకూడదో కొంతవరకూ విచక్షణతో మనం నిర్ణయం చేసుకుని చేస్తూ ఉంటాము. కొన్నికొన్ని చాలా బలీయంగా వచ్చేస్తాయి. లోపలనుంచి అంతరాత్మ చెప్తున్నా స్వభావం బాగా బలంగా లాగేస్తుంది. చాలా సామాన్యం. ఇలా ఉంటుందాండి అని ఎవరూ అడగక్కర్లేదు. ప్రతివాడికి దాని అనుభవం ఉంటుంది. అప్పుడు ఏం చేస్తావు? సమర్పణ చెంది అటుపైన నిర్వర్తించటమే! ఇంకో మార్గం లేదు.

అంచేత, సమర్పణ మార్గం మహాత్ములు బాగా నిర్వర్తించి చూపిస్తారు. "Father, Thy will be done", అంటారు. "నీ

సంకల్పమే నెరవేర్చు, నా సంకల్పం కాదు.” మన సంకల్పమా, ఆయన సంకల్పమా అని ఈ విచికిత్సలో పడిపోకుండా, వచ్చినదల్లా ఆయనకి సమర్పించి ఫలితం ఆశించకుండా, మడతలు పెట్టకుండా, మోహపడకుండా చేస్తూ ఉండు. చేస్తుంటే నీ శ్రేయస్సుకి భంగం లేకుండా, అది అవ్వడం, కాకపోవడంగా లేకుండా దాన్ని నిర్వర్తించేస్తారు. మాటిమాటికి అదే వస్తుంటే, మాటిమాటికి అదే చేస్తుంటే, మాటిమాటికి కాకపోతే, కొన్నాళ్ళ తర్వాత ఇది మనకి కాదు అని పక్కన పెట్టేస్తారు. అయిపోతుంది కదా! ఇహ మళ్ళీ రాదు అది. ఇది మన వల్ల అయ్యే పని కాదు అని పక్కకి పెట్టేస్తాడు. నిన్ను చెడనివ్వడు. కైంకర్యంలో గొప్పదనం ఏమిటంటే చెడనివ్వడు. కార్యం చెడినా, మనిషి చెడడు. మనిషి చెడితే అది ప్రమాదం. కార్యం చెడితే మరల ప్రయత్నించవచ్చు. మనిషి బాగుపడడానికి కార్యంగాని, కార్యం బాగుపడి మనిషి పతనం చెందుతూ వుంటే జీవుడి కథ తలక్రిందులవుతుంది. అందుకే పెద్దవారు మనిషి క్షేమం కోరుతారుగాని, కార్య సఫలత్వం కోరరు. మనిషి క్షేమంగా వృద్ధి చెందాలి. అంతేకాని చాలా ధనము, కీర్తి, పదవి పొంది మనిషి పాడైపోతే పెద్దలు దుఃఖిస్తారు. రావణుడు పరమ శివ భక్తుడు. సంపద, కీర్తి, పదవి పొంది, సద్బ్రాహ్మణుడు అసురుడై పతనం చెందితే, రాముడితో సహా అందరూ బాధపడ్డారు.

ఇప్పుడు చూడండి మనవాళ్ళందరికి చాలా విషయాలు చెడిపోతున్నా, వారు చెడలేదు. *“నమే భక్త్యా ప్రణశ్యతి”* అన్నాడు కృష్ణుడు. నా భక్తుడు నశించడు అన్నాడు తప్ప, నా భక్తుడి వ్యాపారాలు నశించవు, నా భక్తుడి ఆరోగ్యం నశించదు, ఇట్లా

ఉండదు. వాడికి నశింపు ఉండదు. వాడిని ముట్టుకోదు ఏదీ. ఏవి జరిగితే అతడికి శ్రేయస్సో అవే జరిపిస్తాడు. కైంకర్యంలో ఉండే పెద్ద లాభం అది. భగవద్భక్తుడు భగవంతుడికి సమర్పణ చేసుకుని కార్యాలు చేస్తుంటే అవి వాడికిగాని, సంఘానికిగాని పనికొచ్చేవి అయితే అవి కానిస్తాడు. వాటి వల్ల వీడికి అపాయం ఉందంటే వీడిని అసలు వెళ్ళనివ్వడు. ఏదో అడ్డం వచ్చేస్తుంటుంది. అడ్డుపడిపోతుంది. అలా జరుగుతూ ఉంటుంది. ఆ విధంగా అంబరీషుడి గురించి చక్కగా ప్రశంసిస్తూ ఉన్నారు.

"చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద
పలుకులు హరిగుణపఠనమంద
కరములు విష్ణుమందిర మార్జనములంద
శ్రవములు హరికథాశ్రవణమంద
చూపులు గోవింద రూపవీక్షణమంద
శిరము కేశవ నమస్కృతులయంద
పదము లీశ్వరగేహ పరిసర్పణములంద
కామంబు చక్రి కైంకర్యమంద

సంగ మచ్యుతజనతనుసంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రికమలమంద
రసన తులసీదళములంద రతులు పుణ్య
సంగతులయంద యా రాజచంద్రమునకు."

అంబరీషుడు రాజులలో చంద్రునివంటి సూర్యవంశపు

రాజు! చంద్రుడంటే చల్లని మనస్సు కలవాడని అర్థం. ఆ విధంగా ఉన్నాడటండి. అలాగే ఇంకా చాలా ఉన్నది ఆయన గూర్చిన గుణకీర్తనము.

"ఘన వైభవంబునఁ గల్మషదూరుఁడై
యజ్ఞేశు నీశు నబ్జాక్షుఁ గూర్చి
మొనసి వసిష్ఠాదిమునివల్లభులతోడఁ
దగలి సరస్వతీ తటమునందు
మేధతో బహువాజిమేధంబు లొనరించె
గణుతింపరాని దక్షిణలు వెట్టి
సమలోష్ట హేముఁడై సర్వకర్మంబులు
హరిపరంబులుగాఁగ నవనియేలె
విష్ణుభక్తులందు విష్ణువునందుఁ గ
లంక మెడల మనసు లంకె వెట్టి
విహితరాజ్యవృత్తి విడువనివాఁడునై
యతఁడు రాచతపసి యనఁగ నొప్పె."

అంచేత, ఆ విధమైనటటువంటి అంబరీషుడు ఎంత వైభవమున్నా కల్మషములు లేనివాడు అతడు. వశిష్ఠాది మహర్షులతో కలిసి సృష్టి యజ్ఞమునకు ఈశ్వరుడై, నారాయణుడిని ఉద్దేశించి సరస్వతీ నదీ తీరమున ఎన్నో ఆశ్వమేధములను నిర్వర్తించాడు. శాస్త్రము తప్పకుండా యజ్ఞములు చేసి బ్రాహ్మణులకు లెక్కలేనన్ని దక్షిణలు సమర్పించాడు. మట్టిగడ్డలయందును, బంగారమందును

సమానమైన దృష్టి కలవాడై సర్వకర్మలను హరికి సమర్పణ చేసి భూమిని పరిపాలించాడు. రాజ్యపాలన విషయమున కూడా ఒకే మార్గమును అవలింబించాడు. విష్ణుభక్తులయందును, విష్ణువు యందును మనసు లగ్నము చేసి, తన స్వధర్మమైన పాలనను నిర్లక్ష్యం చేయక పరిపాలన చేయుచు, రాజఋషి అని ప్రసిద్ధి చెందాడు. ఆ విధంగా...

"హరి యని సంభావించును
హరి యని దర్శించు నంటు నాఘ్రాణించున్
హరి యని రుచిగొనఁ దలఁచును
హరి హరి ఘను నంబరీషు నలవియె పొగడన్."

అంతా హరిమయంగా ఉన్నాడటండి. అటువంటివాడిని ఏం పొగుడుతాం అంటున్నాడు పోతనామాత్యుడు.

"అతని కీహ మానె హరులందుఁ గరులందు
ధనములందుఁ గేళివనములందుఁ
బుత్రులందు బంధుమిత్రులయందును
బురమునందు నంతిపురమునందు."

'కీహ మానె' అంటే ఏం చెప్తారంటే వాటిమీద విరక్తి కలిగిందండి అని చెప్పేస్తారు. విష్ణుమార్గంలో విరక్తి ఏం లేదు. అంతా అనురక్తే. మామూలు అర్థం ఏమిటంటే అన్నిటిమీదా విరక్తి కలిగింది ఆయనకి అని ఉంటుంది. ఏమిటా విరక్తి?

అంచేత, అంబరీషోపాఖ్యానం ఈ గురుపూజలకి

మనకి ప్రత్యేకంగా అందించబడింది. బాధ్యతతో వివరిస్తాను. త్వరత్వరగానే వివరిస్తాను. మంచి ఘట్టాలు కొంచెం ఆపి వివరణ ఇస్తాను. మనం కూడా ఇక్కడనుంచి లేచి వెళ్తాం కదా! లేచి వెళ్ళిన దగ్గర నుంచి విష్ణుదర్శనానికి ప్రయత్నం చెయ్యాలి. అలా చెయ్యకపోతే ఇది ఊరకనే పురాణ కాలక్షేపం అవుతుంది. చూసేవి, వినేవి, తినేది విష్ణువు అనుకుంటే అదొక ఆనందం ఉంటుంది. ఇందులోనే వేరే ఒక రుచి. దివ్యమైన ప్రపంచంలో మనం జీవిస్తూ ఉండేటటువంటి ఒక పరిస్థితి ఏర్పడుతుంది. రేపు ఉదయం 6 గంటలకు మరల సమావేశమవుదాం.

స్వస్తి.

# నిత్య సత్త్వము

"ప్రహ్లాద అంబరీష నారద" అని ఒక ఒరవడి ఉన్నది. ప్రహ్లాదుడి తర్వాత భాగవతంలో చెప్పుకోదగిన ఉత్తమోత్తమ మైనటువంటి భాగవతోత్తముడు అంబరీషుడు. అతడి గుణ గుణాలని మనం అవగాహన చేసుకుంటున్నాము. అతడి కీర్తన చేసుకుంటున్నాము. భక్తుడి కీర్తన భగవంతుడికి చాలా ఆనందం కలిగిస్తుంది. భగవంతుని కీర్తించడంకన్నా భక్తుడిని కీర్తిస్తేనే భగవంతుడికి ఆనందం ఎక్కువగా ఉంటుంది. హనుమంతుడిని మనం చాలా ఉత్సాహంగా పూజ చేసినా, భజన చేసినా, రాముడు చాలా సంతోషిస్తాడట. ఎంచేత అంటే, భగవత్ భక్తుని యందు భగవంతుడు పరిపూర్ణంగా వసించి ఉండడమే కాకుండా భగవంతుని చేరు విధానం అంతా కూడా భక్తుని యందు ఉంటుంది. అంచేత భక్తుడు, భగవంతుడు మరియు భగంతుడిని చేరు మార్గం రెండూ కలిగి ఉంటాడు.

భగవంతుడి కన్నా భగవద్భక్తునికి రసానుభూతి ఎక్కువ. భగవంతుడు రసస్వరూపుడు. అతడు రసమై ఉండడం చేత ప్రత్యేకంగా తన గురించి తాను పొందవలసిన ఆనందం ఏమీ లేదు కదా! పంచదార తనకి తాను రుచిగా ఉన్నాను అనేటటువంటి అనుభూతి లేదు. భక్తుడికి భగవంతుని అనుభూతి ఉంటూ ఉంటుంది. పంచదార నాలుక మీద వేసుకున్నటువంటి వాడికి

పంచదార అనుభూతి ఉంటుంది తప్ప, పంచదారకి అనుభూతి ఎట్లా? అగ్నిదేవుడు ఉన్నాడు – తనకి తాను వేడిమి కాదు, మనకి వేడి. అలా భగవద్భక్తుని ఆనందం చూసి భగవంతుడు ఆనందిస్తూ ఉంటాడు. ఎంచేత అంటే, తనకుగా తాను ఆనంద స్వరూపుడై ఉండడం చేత ఆనందం పొందడం అనేది భగవంతుడికి ఉండదు. ఇది మాములుగా మనం ఎప్పుడూ గమనించం కదా! అతడు అదే అయి ఉన్నాడు కదా! అంచేత, ఇంక రెండోది లేదు. భక్తుడి యొక్క సౌలభ్యం ఏమిటంటే అతడు రసానుభూతి పొందుతూ ఉంటాడు. ఆ అనుభూతిలో తాను ఒక్కొక్కసారి అతడైపోతూ ఉంటాడు. అయిపోయినా మళ్ళీ తానుగా వచ్చి, అతడి ఆరాధనలోని అనుభూతినే ఎక్కువగా ఆస్వాదిస్తూ ఉంటాడు. అందుకనే, విశిష్టాద్వైతంలో ఏం చెప్తారంటే భగవంతుడైపోతే ఆనందం లేదు. భగవత్ స్పర్శ కలిగి, భగవంతుడితో అనురక్తి చెందుతూ ఉంటే ఆనందం ఉంటుంది అని చెపుతారు. కృష్ణుడు అయిపోతే ఆనందం లేదు. కృష్ణుడు దగ్గర ఉండి అనుభూతి చెందుతూ ఉంటే అనందం. అప్పుడప్పుడూ కృష్ణమయం అయిపోతూ ఉంటాము. అది ఆనందంగా ఉంటుంది. ఎప్పుడూ అదే అయిపోతే అంత ఆనందం ఉండదు. ఇది ఒక అవగాహన.

భక్తి కలిగినటువంటి జీవునికి ఉన్న అనుభూతి వర్ణనాతీతం. అతడు ఎప్పుడూ భగవంతుని ఆరాధనలో ఆనందంగా ఉంటూ ఉంటాడు. తాను అనేటటువంటి ప్రత్యగాత్మగా తాను ఉండడం చేత, ఈ ప్రత్యగాత్మ పరమాత్మతో అనుసంధానం చెందుతూ ఉండడం చేత, అతడు రసస్వరూపుడు అవ్వడం చేత, తాను ఆ

రసానుభూతి పొందుతాడు. అతడు ఆనందస్వరూపుడు అవ్వడం చేత ఆ ఆనందాన్ని సతతం అనుభవిస్తూ ఉంటాడు. అతడు అనంతమైన జ్ఞానం అవ్వడం చేత తాను కూడా ఆ జ్ఞానంతో ఉంటాడు. అంచేత, భగవంతుడు అయిపోవడంలో రుచి లేదు. భగవత్ స్పర్శ పొంది, భగవద్భక్తుడుగా శాశ్వతంగా ఉండడంలో రుచి ఉందని తెలిసినవాళ్ళంతా కూడా ఉత్తమోత్తమమైనటువంటి భాగవతోత్తములు. సాయిభక్తుడు ఒకాయన ఉన్నారు. ఆయన భక్తులకే రాజు, ఆయన పేరు భక్తరాజ్ మహారాజ్. ఆయన ఒక మాట అంటారు, *"ఓ తో భగవాన్ హోగయనా! ఇస్ మే క్యా ఆనంద్ హై?"* భగవంతుడు అయిపోతే ఆనందం లేదు. భగవంతుడు ఉండి, మనం ఉండి, భగవంతుడితో మనం అనుసంధానం చెందుతూ ఉంటే, భగవంతుడు అపరిమితమైన ఆనందం కాబట్టి, నువ్వు కూడా అది పొందుతూ ఉంటావు. మామిడిపండు అయిపోతే ఏం లాభం? మామిడిపండు ఉండాలి, మనం ఉండాలి, దాన్ని మనం ఆస్వాదించాలి, ఆనందం పొందాలి. ఇది ఒక భక్తుని యొక్క సౌలభ్యం. అంచేత, భగవద్భక్తుని కథలో భగవంతుడి గూర్చి భక్తుడు పొందేటటువంటి ఆనందాన్ని మనం గమనిస్తూ ఉంటే, భగవంతుడు చూపేటటువంటి లీలలు మనం గమనిస్తూ ఉంటే, మనకి ఒక తన్మయత్వ స్థితి, ఒక నిర్మలమైనటువంటి స్థితి, ప్రశాంతమైనటువంటి హృదయం, ఇటువంటివన్నీ ఏర్పడతాయి. అంచేత, భగవద్భక్తులు మనకి ప్రధానం అనేటటువంటిది భాగవత మార్గం. అంటే, భగవంతుడు అప్రధానమా అంటే, కాదు. భగవంతుని లీలావైభవము భక్తుని రూపంలో మనకి అంది వస్తూ

ఉంటుంది. అంచేత, భగవద్భక్తుల కథలు చదువుకోవడంలో ఉండే అనందం అది వేరుగా ఉంటుంది.

ఆ విధంగా మనం అంబరీషుడు యొక్క కథ చదువుకుంటూ ఉన్నాము.

అన్ని పనులూ కూడా భగవంతునికి సమర్పణగా, హరికి సమర్పణగా, *"సర్వం శ్రీ బ్రహ్మార్పణమస్తు, కృష్ణార్పణమస్తు"* అంటూ ఉంటాం కదా! ఆ విధంగా అనన్య బుద్ధితో, ఎక్కువ తక్కువలు లేకుండా... *"సమలోష్ట హేమ్నుడై"* అంటే బంగార మైనా, మట్టైనా, రెండిటియందూ ఒకేఒక తత్వాన్ని దర్శనం చేస్తూ జీవిస్తూ వుండేవాడు అంబరీషుడు. తత్వదర్శికి అన్నిటియందూ భగవంతుని అస్తిత్వమే గోచరిస్తుంది తప్ప దాని ఆవరణలుగా ఏర్పడిన విషయముల యందు, ప్రపంచం ఏర్పరిచిన విలువలయందూ అంత మనస్సు నిలువదు.

అంచేత, అతడు ఆ విధంగా వసిష్ఠుడితో కూడి సరస్వతీ నదీతీరంలో చక్కగా యజ్ఞములు నిర్వర్తించి, దానములు గావించి... సరస్వతీ తీరం అంటే సుషుమ్నానాడికి దగ్గరలో ఉండడం అని అర్థం. యమున అంటే పింగళ నాడికి దగ్గరగా ఉండడం. ఇడ అంటే గంగానది లేక బాహ్య ప్రపంచానికి దగ్గర. బాహ్య ప్రపంచాన్ని గంగా ప్రవాహం అని, అంతర్గత ప్రపంచాన్ని యమునా నది ప్రవాహం అని. ఈ రెండిటినీ చక్కగా సమన్వయం చేసుకుని బాహ్యాంతరములయందు ఒకే తత్వాన్ని దర్శించేటటువంటి వాడు సరస్వతీ నదీ ప్రవాహమునందు ఉన్నట్టు

పెద్దలు తెలుపుతారు. అంచేతే, మైత్రేయ మహర్షి కూడా ప్రయాగ, త్రివేణీ సంగమమందు ఉన్నాడు అని చెప్తూ ఉంటారు. ఎంచేత అంటే, తాను సుషుమ్నయందు ఉండి, ఇడా-పింగళ నాడుల కార్యక్రమం అంటే, పదార్థం, ప్రజ్ఞ రెండిటినీ కూడా చక్కగా సమతూకంగా నిర్వరిస్తూ ఉంటారు. పదార్థమందు, ప్రజ్ఞయందూ కూడా దైవమునే దర్శిస్తూ ఉంటారు. అలా నిర్వర్తించే వారే సరస్వతీ తటి యందు వసించేవారు.

అందరికీ సరస్వతి దగ్గర అని చెప్పరు. యమున దగ్గర చేరారు అని చెప్తారు. యమున దగ్గర చేరడం అంటే అంతరంగం చేరడం. గోపికలందరూ యమునా తీరాన్ని చేరారని చెప్తారు. అంటే అర్థం ఏమిటంటే వారందరూ బాహ్య ప్రపంచంలో కాకుండా అంతరంగ ప్రపంచంలో... అంతరంగమునందు కృష్ణుడితో అనుభూతి చెందుతూ ఉంటారు. ప్రతీరాత్రి భావన చేత సూక్ష్మమైనటువంటి మార్గంలో యమునను చేరి అనుభూతి చెందుతూ ఉంటారు. అంచేత, ఈ సరస్వతీ తటియందు వసిష్ఠుని యొక్క సాన్నిధ్యంలో అని చెప్పటం విశేషం. వసిష్ఠుడు అంటే సాక్షాత్తు బ్రహ్మర్షి, బ్రహ్మమే. బ్రహ్మము అనే స్థితి నుండి అటుగాని, ఇటుగాని కదలనివాడు బ్రహ్మమే. అలాంటి రాజపురోహితుడు ఆయన. అతడు బ్రహ్మమందే ఉంటాడు, బ్రహ్మసంకల్పమునే నిర్వర్తిస్తూ ఉంటాడు. అటువంటి బ్రహ్మర్షి. బ్రహ్మర్షులలో చెప్పుకోవాలంటే మొట్టమొదట చెప్పుకోవలిసింది వసిష్ఠుడిని. అతడే మనందరికీ కూడా గమ్యము. మనకి వివాహం అయిన తర్వాత వసిష్ఠ నక్షత్రము, దాని పక్కన ఉండే అరుంధతి నక్షత్రము

చూపిస్తారు. దాని విశేషం ఏమిటంటే ఈ భార్యాభర్తల గమ్యం అది. ఇక్ష్వాకు వంశానికే ఆయన పురోహితుడు. శ్రీరాముడుకి ఆయనే పురోహితుడు. దశరథుడుకి ఆయనే పురోహితుడు. అంబరీషుడు కూడా ఇక్ష్వాకు వంశంలోని వాడే. అతడికి కూడా వసిష్ఠుడే పురోహితుడు. అటువంటి పురోహితుడు పక్కన చేరితే ఇంక అంతకన్నా ఏం కావాలి?

మాస్టరుగారు వసిష్ఠ ప్రజ్ఞ అని చెప్తూ ఉంటారు. వసిష్ఠ ప్రజ్ఞ అంటే బ్రహ్మ ప్రజ్ఞ అని అర్థం. అంచేత, ఎక్కడ స్థిరంగా ఉండాలో అక్కడ స్థిరంగా ఉండాలి. స్థిరత్వము ఎక్కడుందంటే సత్వగుణములో కూడా లేదట. శ్రీకృష్ణుడు చెప్తాడు, "స్థిరత్వము సత్వగుణంలో కూడా లేదు, నిత్యసత్త్వం అని ఒకటి ఉంది." నిత్యసత్త్వం అన్న పదం ఒక్క భగవద్గీతలోనే కనిపిస్తుంది. అంటే, రజస్సు, తమస్సు, రెండిటినీ సత్వగుణం చేత సమం చేసుకోవచ్చు. అటుపైన నిత్యసత్త్వంలో, అంటే ఇంకా సూక్ష్మమైన సత్త్వంలో, నిలబడితే అది బ్రహ్మపదం. అక్కడ విష్ణు పాదాలు స్థిరంగా దర్శన, స్పర్శనల నందిస్తూ వుంటాయి. అక్కడ కూర్చున్నవాడు అక్కడినుంచి చలించి రాడు. అక్కడే కూర్చుని అన్నీ నిర్వరిస్తూ ఉంటాడు. యజమాని పొలంలో చెట్టుకింద ఉండి మొత్తం పొలాన్ని అంతా నిర్వర్తిస్తూ ఉంటాడు తప్ప ప్రతి ఎకరంలోకీ తిరగడు ఉదయం నుంచి సాయంత్రం వరకూ. యజమాని ఉన్నాడనేటటువంటి భావంతో అన్ని పనులూ జరిగిపోతుంటాయి. అలాగే factory అయినా, అలాగే ఒక company అయినా, అలాగే ఒక ఆశ్రమం అయినాను. పరిపాలన కూడా అలాగే

చేయాలి. మాటిమాటికీ చలించేవాడు పరిపాలించలేడు. తాను విష్ణుపాదాల చెంత స్థిరంగా ఉండటం చేత అంబరీషుడు 7 ఖండాలను సులభంగా పరిపాలించాడు.

నిజమైన పరిపాలకుడు పొలిమేరల్లో ఎప్పుడూ తిరుగుతూ ఉండడు. తనయందు తాను బాగా లోతుల్లో ఉండడం చేత, అతడు అప్రమత్తుడై ఉండడం చేత, అందరూ కూడా అప్రమత్తులై ఉంటారు. అతడు నిద్రపోయేవాడయితే అందరూ నిద్రపోతారు. అతడు మరపు కలవాడయితే అందరికీ మరపు వస్తుంది. అతడియందు అశ్రద్ధ ఉంటే అందరికీ అశ్రద్ధ వస్తుంది. *''యథా రాజా తథా ప్రజా''*. అంచేత, నీలో రాజు నువ్వే. జీవుడిగా నువ్వు ఎంత అప్రమత్తుడివై ఎంత దైవముతో కూడి ఉంటావో నీలో ప్రజ్ఞలు కూడా నీకు అంత సహకారాన్ని అందిస్తాయి. లేకపోతే, "విప్లవం, విప్లవం!" అంటూ ఉంటాయి. పొద్దునే మనకి విప్లవకారుడు లేవచ్చు శరీరంలోంచి! ఎందుకంటే, పొద్దునే నిద్రలేవడం, ఈ కార్యక్రమాలు చెయ్యడం, వేటికీ శరీర అంగాలు అంత పెద్ద ఉత్సాహం చూపించవు. నీ ఉత్సాహం బట్టే అవి ఉత్సాహం చూపిస్తాయి. అందుకనే, కొంతమంది ముఖాలు పొద్దునపూట బరువుగా ఉంటాయి. సాయంత్రం చాలా బావుంటాయి. సాయంత్రం ముఖాలు బావుండి, పొద్దున్నకి బావుండనివన్నీ కూడా ఆసురీతత్త్వం ఎక్కువ ఉన్నవి. కొంతమందికి పొద్దున్నే ముఖాలు ఉదయభానుల్లాగా వెలిగిపోతుంటాయి. "ఏమిటిరా పొద్దున్నే వీడింత ఉత్సాహంగా ఉన్నాడు!" అనిపిస్తుంది. పొద్దున్నే ఉత్సాహంగా ఉండడం సత్వగుణానికి చిహ్నము, దైవీ స్వభావానికి చిహ్నము. సాయంత్రం

నుంచి అర్ధరాత్రి వరకూ పులిలా ఉన్నాడనుకోండి అది ఆసురీ స్వభావానికి చిహ్నం. రోజంతా కూడా ఒకే పద్ధతిలో వెళ్ళిపోయే వాడికి అసలు ముఖం వాడదు. ఎందుచేతంటే సత్వగుణంలో ఉన్నాడు కాబట్టి.

అట్లా ఉన్నాడు అంబరీషుడు. ఈయన గురించి చాలా చెప్తారు. అంచేత, ఈ విధంగా... *"సమలోష్టహేముఁడై సర్వ కర్మంబులు హరిపరంబులుగాఁగ నవనియేలె"* – అంతా భగవంతుడికి సమర్పణ చేసి తాను పరిపాలిస్తున్నాడట.

*"విష్ణుభక్తులందు విష్ణువునందుఁ గ*
*లంక మెడల మనసు లంకె వెట్టి*
*విహితరాజ్యవృత్తి విడువనివాఁడునై*
*యతఁడు రాచతపసి యనఁగ నొప్పె."*

విష్ణు భక్తులయందుగాని, విష్ణువుయందుగాని ఎప్పుడూ చెరగని లంకె వేసుకున్నాడటండి. విష్ణుభక్తులయందు విష్ణుదర్శనం జరుగుతుంది. విష్ణువునందు ఆ విధంగా లంకె వేసుకోవడం అంత సులభం కాదు. విష్ణువు భక్తులనగానే విష్ణువు చాలా అప్రయత్నంగా మనకి గుర్తువస్తాడు. ఎందుకంటే అతని భాషణంగాని, అతని చేతగాని, అతని రూపంగాని మనకి విష్ణువుని గుర్తుచేసే విధంగా ఉంటుంది. అంటే, దైవాన్ని గుర్తు చేసేటట్టుగా ఉంటుంది. దైవీ స్వభావం కలవాడు కనబడితే మనకి కూడా దైవం గుర్తువస్తాడు కదా! అలా చూడడం కొంత సులభమే. విష్ణు భక్తుల యందు చూడడం కొంత సులభమే. విష్ణువు నందు? విష్ణువు అంటే మిగతా

జీవులందరిలాగా ఉంటాడే వారియందు కూడా అతని మనసు ఎప్పుడూ చెదరదుటండి. విష్ణువునే చూస్తాడు.

*"విహితరాజ్యవృత్తి విడువనివాఁడునై"* – అలా అని పని మానేస్తాడా? మనం ఇది చేస్తే అది చెయ్యలేము, అది చేస్తే ఇది చెయ్యలేము అనుకుంటాము కదా! అందుకనే ఇప్పుడు నిత్యజీవితంలో యోగసాధన. Spirituality in daily life, అంటూ ఉంటాము. ఏమిటయ్యా అంటే, ఈ కనబడేది కూడా అదే కదా! *"ఓం ఇతి ఏ తత్"* అని చెప్తుంది ఉపనిషత్తు. ఇదంతా అదే. అదే ఇది. ఇది అదే! ఇది బాగా స్థిరపడిపోతే ఇటు చూసినప్పుడు కూడా దాన్నే దర్శించడం ఉంటుంది. దాన్ని దర్శించి, దాని ఆవరణలు దర్శించడం ఉంటుంది. లేకపోతే గుర్తు పెట్టుకోలేము కదా! గుర్తుపట్టాలంటే ఆ ఆవరణల అవగాహన కూడా ఉంటుంది గాని ప్రాతిపదిక మూలమందు, విష్ణువుయందు ఉండాలి. విష్ణువంటే వ్యాపనం చెందినటువంటి దివ్యశక్తి అని అర్థం. సర్వ వ్యాపకము అయినటువంటి దైవము.

అంచేత, విష్ణువును దర్శించి... ఆవరణలని దర్శించడం. విష్ణువే స్త్రీగా ఉన్నాడు. విష్ణువే పురుషుడుగా ఉన్నాడు. విష్ణువే తండ్రిగా ఉన్నాడు. విష్ణువే తల్లిగా ఉన్నాడు. విష్ణువే తమ్ముడు. విష్ణువే మనం. ఇష్టం లేనివాళ్ళుగా ఉన్నాడు. విష్ణువే ఇష్టం ఉన్నవాళ్ళుగా ఉన్నాడు. అందరికీ మనం ఇష్టం ఉండక్కర్లేదు కదా! కొంతమందికి కష్టంగా ఉంటుంది. ఆ రూపంలో కూడా విష్ణువునే చూడడం అనేటటువంటిది. ఇలాంటి సాధన చేస్తూ ఉంటారు

భాగవతులు. అంచేత, వాళ్ళకి ఇక ఏముంది? కళ్ళు మూసుకుంటే విష్ణువు, కళ్ళు తెరిస్తే విష్ణువు. "కన్ను మూసినప్పుడు తెరిచినప్పుడు" కృష్ణుడే కనబడాలని ఒక పద్యం ఉంది. కృష్ణుడన్నా, విష్ణువన్నా, ఈశ్వరుడన్నా, అన్నీ ఒకటే. ఒక తత్వానికే ఇన్ని పేర్లు పెట్టారు. ఈశ్వరుడు అంటే సర్వమునకు ఆయన స్వామి అని. స్వామి అన్నా అదే, బాబా అన్నా అదే. ఇంగ్లీషులో మనం Master అంటున్నాం. Master అంటే అదే. ఈశ్వరుడు కాకుండా అది వేరే కాదు. Master అంటే ఈశ్వరుడు. కాబట్టి ఆ విధంగా తన లోపలా, తన బయటా గమనిస్తూ ఉండడం చేత తనకి బయట రాజ్యం ఏలడంగాని, లోపల అర్చనలుగాని, అందరినీ చూచినప్పుడుగాని, గోచరించేది ఒకే ఒక తత్త్వము. ఆ తత్వాన్ని భాగవతంలో విష్ణువు అంటారు. అదే తత్వాన్ని శివపురాణంలో సదాశివుడు అంటారు. సదాశివుడు వేరు, విష్ణువు వేరు ఇలా అనుకున్నవాడికి ఎప్పటికీ తెమలదు. అది తత్త్వం. తత్వాన్ని రకరకాలుగా చెప్పారు తెలిసినవాళ్ళు. *"ఏకం సత్ విప్రా బహుదావదంతి."* విప్రుడంటే విశిష్టమైన ప్రజ్ఞ కలవాడు. అందుకని, రకరకాలుగా చెప్పారండి. ఒకే విధంగా చెప్తే bore కొడుతుందని!

ఎప్పుడూ ఒకే రకంగా వంకాయ కూర చేస్తే తినగలమా! అందుకని, రకరకాలుగా వంకాయతో కూర చేసుకుంటాము, పచ్చడి చేసుకుంటాము, బజ్జి పచ్చడి చేసుకుంటాము. వంకాయ తీసుకెళ్ళి చిక్కుడుకాయలో కలుపుతూ ఉంటాము. వంకాయని తీసుకెళ్ళి బంగాళదుంపలో కలుపుతూ ఉంటాము. ఎందుకివన్నీ? వైవిధ్యంలో రుచి ఉంది, అందుచేత. ఒకే తత్వాన్ని రకరకాలుగా

చెప్పారు. కాసేపు బంగాళదుంపతో కలిపి, కాసేపు చిక్కుడుకాయతో కలిపి, దాన్ని అట్లాగే pure గా వండి... pure గా వండితే తత్త్వం. వంకాయ వంకాయగా వండేశామనుకోండి... అది శుద్ధతత్త్వం. అది అంత బాగా ఎక్కువ ఎక్కదు. దానితో కొంచెం ఏదయినా కలిపితే బావుంటుంది. లేకపోతే, ఎప్పుడూ వంకాయ కూరేనా అని కోప్పడతారు. అంచేత, పేర్లనిబట్టి మోసపోకండి. పేర్ల వెనకాల ఉన్న తత్వాన్ని గుర్తించండి. ఈశ్వరుడన్నా, విష్ణువన్నా ఒకటే. వాసుదేవుడన్నా, సదాశివుడన్నా ఒకటే. నారాయణుడన్నా, పరమేశ్వరుడన్నా ఒకటే. ఒక్కోసారి ఒక్కో భాష వాడారు. పంఖా అన్నా ఫ్యాన్ అన్నా ఒకటే. నాకు పంఖా వద్దు ఫ్యాన్ కావాలంటే, ఫ్యాన్ లేదు పంఖా ఉంది అని అంటే? వాడుకుంటే వాడుకో అంటే ఎలా ఉంటుంది! భారతీయులకి 'అది' ఏమిటో తెలియక, బాగా తికమక పడిపోతున్నారు. ఇన్ని రకాలుగా వండుకుంటున్నాము. ఒకే పదార్థాన్ని రకరకాలుగా వండుకుని తిని ఎక్కువ ఆనందం పొందడం కోసం బాగా రుచి కలిగినటువంటివాళ్ళు తయారుచేసుకున్నారు. యిన్ని పేర్లు, రూపాలు. 16 రకాల వంటలు చేసుకుని ఇవి అనుభవించే తత్త్వం మన ఋషులది. అరుగుదల లేక, ఇంత కూర అన్నం, మజ్జిగ పోసుకునేవాడికి ఏం తెలుస్తుంది, ఋషులిచ్చిన వైభవం? ఏ రుచీ లేనివాడికి ఏమి పెట్టినా ఒకటే కదా!

అంచేత, ఆ విధంగా భావన చెయ్యండి, గుర్తుపెట్టుకోండి. శివపురాణం చదువుతున్నప్పుడు ఇదే విషయం శివుడు పేరుమీద చెప్తారు. అందరియందు శివుడున్నాడు అంటారు. "అదేంటండి?

అందరి యందు విష్ణువు ఉన్నాడని చెప్పారు కదా!” అంటే, పేర్లు మార్చాము, తత్త్వం ఒకటే. శివుడు పేరున చెప్పుకోవచ్చు. మహారాష్ట్రలో వాళ్ళు గణపతి పేరుతో చెప్పుకున్నారు. ఏం ఎందుకు చెప్పుకోకూడదు? *“త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి”* – అన్నీ నీలో ఉన్నాయని చదువుతాము కదా పొద్దున్నే! అంతర్యామి దైవానికి అనేక పేర్లండి. అంతర్యామి దైవానికి అనేకమైనటువంటి నామాలు. కృష్ణుడిగా చెప్పుకోవచ్చు, విష్ణువుగా చెప్పుకోవచ్చు, వినాయకుడిగా చెప్పుకోవచ్చు, దత్తాత్రేయుడిగా చెప్పుకోవచ్చు. మీ ఇష్టం! ఏం చెప్పినా తెలియవలసిన విషయం ఒక్కటే – ఒకే ఒక్క అంతర్యామి దైవం ఉన్నది. అది ప్రకృతి–పురుషుల యొక్క సమాగమ ప్రజ్ఞ. ఇన్ని రూపాలుగాను ఏర్పడి, ఇన్ని నామాలు ధరించి ఉన్నదని తెలియాలి. అలా తెలియకపోతే మళ్ళీ పోట్లాటలే. విష్ణువు పార్టీ, శివుడు పార్టీ వాళ్ళు మన దేశంలో చాలా యుద్ధాలు చేసుకున్నారు ఒకప్పుడు, పేర్లు బట్టి. ఒకడేమో అరటిపండన్నాడు, ఇంకొకడేమో కేలా అన్నాడు. కేలా కాదు అరటిపండు అన్నాడు, అరటిపండు కాదు కేలా అన్నాడు, అలా అని కొట్టుకున్నారు! ఇంతలో బనానా అంటూ ఇంకోడు చేరాడు.

అలాగే, Masters పేర్ల మీద కూడా కొట్టుకోవడం! ఒకడే Master. రకరకాల రూపాలు. వాడెప్పటినుంచి వచ్చాడు? CVV గారి దగ్గరనుంచి వచ్చాడా? ఎప్పుడూ ఉన్నాడు Master. అంటే Master అనే పదం కొత్తగా పుట్టించారు తప్ప ఈశ్వరుడన్న పదానికి అనువాదం చేస్తే Master పలుకుతాడు. ఎప్పుడూ ఉండేవాడు కదా Master! ఈ Master ఆ Master. అంటే, ఈ

ఫ్యాన్ ఆ ఫ్యాన్ అన్నట్టు. అన్ని ఫ్యాన్లు గాలి ఇస్తాయి కదా! ఫ్యాను గాలి ఇస్తుంది, light వెలుగు ఇస్తుంది. ఇది మారదు కదా! దీని పేరు Master, దాని పేరు Master. అంటే, ఈ Master, ఆ Master, ఇంకో Master ఉండదు. ఒకటే Master ఉంటాడు. చాలా రూపాలు ఏర్పరుచుకుంటూ ఉంటాడు, పని చేసుకుంటూ ఉంటాడు. ఇది తెలియాలి మనకి... *"విష్ణుడింతియేగాని వేరొండుగాదని"* అని హాయిగా నవ్వుకున్నాడట ప్రహ్లాదుడు. అంబరీషుడికి కూడా అది తెలిసింది. అందుకని ఆయనకి కంగారు లేదు. గణపతి పూజ చేశామండి ఇవ్వాళ. ఇంకా లక్ష్మీనారాయణ పూజ చెయ్యలేదని దుగ్ధ ఉండదు. అంతర్యామినే గణపతిగా ఆరాధన చేస్తాము. అంతర్యామినే లక్ష్మీనారాయణులుగా ఆరాధన చేస్తాము. కొంతమంది ఉమామహేశ్వరులుగా ఆరాధన చేస్తారు. అంతర్యామినే అగ్ని స్వరూపంగా ఆరాధన చేస్తాము.

కొంతమందికి మన ఆంధ్రులకి ప్రత్యేకంగా, "అన్నం తిన్నారా?", అంటే "లేదండి!" అని అంటాడు. వాడంతకుముందే మూడు దోశలు, నాలుగు పెసరట్లు, ఐదు ఇడ్లీలు, మూడు గారెలు తినేస్తాడు. అన్నం కాదుట! ఎందుకంటే, వాడికి బియ్యం తింటేనే అన్నం! బియ్యం తింటేనే అన్నం కాదు, ఆకలి తీర్చేది అన్నం. అన్నం తిన్నారా అంటే పళ్ళు తింటే అన్నం తిన్నట్టే. తిన్నాను అని చెప్పాలి. అన్నం తినలేదండి, పళ్ళు తిన్నాను అంటే! పండు అన్నం కాదా? పానీయం అన్నం కాదా? చూస్తేనే కడుపు నిండిపోతుంది కొంతమందికి. అలాంటి వాళ్ళకి అదే అన్నంట! "ఆహార్యము" – ఆహారం అంటే కంటితో చూసి ఆనందించేది తృప్తినిస్తుంది.

అందుకనే మర్చిపోతావు ఆకలిని. అలాగే వినే దాంట్లోంచి మంచి ఆనందం కలుగుతుంటే తినడం మర్చిపోతారు. ఇలా రకరకాలుగా ఆహారం ఉంటుంది. అంచేత, కేవలం బియ్యం తింటేనే అన్నం తిన్నామనుకునే వాళ్ళుంటారే, అలా ఉంటారు మామూలు భక్తులందరూ. అందుకని, వాళ్లకి తెమలదు. ఇప్పటికే కాదు, ఎప్పటికీ తెమలదు. ఎన్ని జన్మలకీ తెమలదు. ఎందుచేతంటే, వైవిధ్యంలో తత్త్వం యొక్క వైభవం చూడలేక దాంట్లో ఉండేటటువంటి సందుల్లో పడిపోయారు, ఇరుకుల్లో పడిపోయారు.

అంబరీషుడికి ఈ బాధలు లేవండి. ఆ విధంగా హాయిగా ఉన్నాడు.

*"హరి యని సంభాషించును*
*హరి యని దర్శించు నంటు నాఘ్రాణించున్*
*హరి యని రుచిగొనఁ దలఁచును*
*హరి హరి ఘను నంబరీషు నలవియె పొగడన్."*

మనవల్ల కాదు అంబరీషుడిని పొగడడం. అలా ఉన్నాడటండి. ఎంత బావున్నాడు?

*"అతని కీహ మానె హరులందుఁ గరులందు*
*ధనములందుఁ గేళివనములందుఁ*
*బుత్రులందు బంధుమిత్రులయందును*
*బురమునందు నంతిపురమునందు."*

అతనికి ఆడవాళ్ళ మీద మోజు పోయిందటండి. అంటే, అక్కడ ఉన్న స్త్రీని విష్ణు స్వరూపంగా చూస్తాడు కాబట్టి విష్ణువుగా మక్కువ అలాగే ఉంది. స్త్రీగా కనిపించి వికారాన్ని కలిగించదు. శివుడికే వికారాన్ని కలిగించాడు జగన్మోహిని రూపం వేసుకుని. శివుడు ఒక్కసారి అడిగాడట, "ఏదో బాగా అందంగా తయారయ్యి, ఆడపిల్ల వేషం వేసుకుని ఏదో లీల చూపించావని విన్నాను. అందరూ చెప్పుకుంటున్నారు. నాకు ఒకసారి చూపిస్తావా?" అని. "ఎందుకులే? హాయిగా ఉన్నావు కదా!" అంటాడు విష్ణువు. "ఏదో నా తిప్పలు నేను పడుతున్నాను ఈ సృష్టి విషయంలో. నీకేమి హాయిగా తపస్సు చేసుకుని, నాతో అనుసంధానం చెంది ఉన్నావు కదా! నీకెందుకయ్యా ఇది?" అంటే, "ఆ! ఒక్కసారి చూపించు" అంటాడు శివుడు. "ఒక్కసారి చూపిస్తే మరి ఇబ్బంది పడతావేమో" అంటాడు విష్ణువు. "ఆ! ఇబ్బందేముంది? నాకేం లేదు. పార్వతి తపస్సు చేస్తేనే నేను ఓ పట్టాన లొంగలేదు కదా! ఫర్వాలేదు, చూపించు" అన్నాడట. అసలు శివుడిలో ఉత్సాహం పుట్టడమే మాయలో పడటం. వద్దు, వద్దు అని మురిపించి, తర్వాత చూపిస్తాడు. తర్వాత శివుడు వెంట పడిపోతాడు. తర్వాత తిప్పి, తిప్పి, తర్వాత ఆగి, విష్ణువు "అయ్యా! ఏమిటి ఇలా రొప్పుతున్నావు?" అని అడుగుతాడు. శివుడికే ఆశ్చర్యం వేస్తుందిట. త్రిమూర్తుల్లో విష్ణువు, శివుడు, బ్రహ్మ గూర్చి ఇటువంటివి కొన్ని కథలు చెప్తారు. వీరు అంతర్యామి దైవం కాదు, త్రిమూర్తులలో దైవం. త్రిమూర్తి రూపంలో ఉండే దైవంకి కూడా మాయ ఉంది. అంచేత, ఆ భాగవత భక్తులకు మాయ తప్పదు. విష్ణుభక్తులకు

మాయ కమ్మదు. ఎంచేతంటే, వాళ్లకి మాయ కూడా విష్ణువే. అలా ఉంటుంది.

విద్యాధరుడైనటువంటి చిత్రకేతు అలా ఆకాశంలో విహారం చేస్తూ, కైలాసం సభలో అయ్యవారి ఒడిలో అమ్మవారు కూర్చుంటే ఏదో ఆయనకి నవ్వు వస్తుంది. నవ్వుతాడు. నవ్వితే పార్వతికి కోపం వస్తుంది. నేను మా ఆయన ఒళ్ళో కూర్చున్నాను, వీడికి నవ్వు వచ్చింది అనుకుంటుంది. అనుకుని, నీకు చాలా అహంకారం పెరిగిందని శాపం పెడుతుంది రాక్షసుడై పుట్టమని, అసురుడై పుట్టమని. అంటే, అట్లా దిగి వచ్చేసి, నవ్వుతూ కాళ్ళకి దణ్ణం పెట్టేస్తాడు. నవ్వుతూ! "ఇదేంటి వీడికి నేను ఇంత ఘోరంగా శాపం పెడితే వీడు ఇలా నవ్వుతాడేంటి" అంటుంది. అంటే, శివుడు చెప్తాడు, "అదే విష్ణు భక్తుడు! వాడికది కూడా విష్ణువుగానే కనిపిస్తుంది. మనని చూసి వెకిలిగా అపహాస్యం చేస్తూ నవ్వలేదు. ఆనందంతో నవ్వాడు. కానీ నీకు అలా అనిపించింది. అంచేత, నువ్వు శాపం పెట్టావు. శాపం పెడితే దాన్ని వరంగా తీసుకున్నాడు." మహాప్రసాదం అని అయ్యవారి, అమ్మవారి కాళ్ళకి దణ్ణం పెట్టి వెళ్ళిపోతే, అమ్మవారికి ప్రశ్న మిగిలిపోతుంది. అప్పుడు, విష్ణుభక్తుల గురించి శివుడు చెప్తాడు. చదువుకోండి 'వృత్రాసుర రహస్యం'లో అద్భుతంగా చెప్తారు. అదే మరి! అందుకని, విష్ణుభక్తి అంటే అంతర్యామి భక్తి అని అర్థం. అన్ని సన్నివేశాల్లోనూ అది దైవమే అనుకోవడం అంత సులభం కాదు. అనుకూలంగా ఉన్నప్పుడు దైవమే అనుకోవడం కొంత సులభమేమోగాని, ప్రతికూలంగా ఉన్నప్పుడు అనుకోవడం సులభం కాదు.

అందుకని అనుకూలము, ప్రతికూలము అనే ద్వంద్వాలని దాటి ఉండడం చేత అక్కడ తన భార్యలను చూస్తే విష్ణువే కనిపిస్తాడు ప్రధానంగా. అలాగే సంపదలను చూస్తే విష్ణువే కనిపిస్తుంటాడు. ఉద్యానవనాలు చూస్తుంటే విష్ణువే కనిపిస్తుంటాడు. ఎక్కడ చూసినా విష్ణువే కనిపిస్తాడు. కుమారులని చూస్తుంటే కుమారులు కనిపించరు. నా కొడుకన్న వ్యామోహం ఉండదు. నా భార్య అన్న వ్యామోహం ఉండదు. అలా అని ప్రేమ లేకుండా ఉండదు. ప్రేమ పరిపూర్ణంగా ఉంటుంది, వ్యామోహం ఉండదు. అంతేకాని, ఇవన్నీ కావనుకోవడం కాదు. పాపం ఇవన్నీ వదిలేశాడు, ఆయనకి ఇవి లేవు అని చెప్తూ ఉంటారు పురాణాలు చెప్పేవారు. లేవు కాదు, అన్నీ ఉన్నాయి. మామూలుకన్నా బావున్నాయి. భార్యగా చూసేదానికన్నా విష్ణుస్వరూపంగా చూస్తే ఎక్కువ ప్రేమగా ఉంటావు. చిటపటలాడకుండా, పొద్దున్నే Nux Vomica patient లాగా! మగవాళ్ళకి ఎందుకో కోపం వస్తూ ఉంటుంది పొద్దున్నే కదా! మౌనంగా భరించాలి ఆడవాళ్ళు! లోపల ఏమనుకుంటారో మనకి తెలియదు కదా! అరుస్తూ ఉంటే మగవాడు, స్త్రీ భరిస్తూ ఉంటుంది. అందుకే ఆవిడ భార్య. అలాగే ఆవిడ అరుస్తూ ఉంటే ఆయన భరిస్తూ ఉంటాడు. అందుకనే ఆయన భర్తట. అప్పుడు ఈ విధంగా చూశారనుకోండి, బావుంటుంది కదా! అలా ఏం చూసినా, పుత్రులని చూసినా అంతే. బంధుమిత్రులని చూసినా అంతే. గొప్ప శత్రువులని చూసినా అంతే. ఈ చిత్రం చూడండి! శత్రురూపంలో కూడా విష్ణువునే చూస్తాడు. అంతఃపురంలో ఉండేవాళ్ళని అలాగే చూస్తాడు. మొత్తం రాజ్యంలో ఉండేవాళ్ళని కూడా అలాగే చూస్తాడుట అంబరీషుడు.

మీకు దాశరథీ శతకంలో కూడా ఇలాంటి పద్యం ఒకటి ఉంటుంది: *"దైవము తల్లి తండ్రి తగు తాత గురుండు సఖుండు నెన్నెగా భావన చేయుచున్నదని పాపంబులెల్ల మనోవికారములు దుర్భావింతుజేయుచున్నవి."* పాపం అంటే అజ్ఞానం. అప్పుడే అజ్ఞానం పోతుంది. మాస్టారు ఫోటో చూసినప్పుడు మాస్టారు గుర్తు రావడం కాదు. చుట్టుపక్కల ఎవరిని చూసినా మాస్టారు గుర్తువస్తున్నారా? గుర్తువస్తే వికారాలు అణుగుతాయి. లేకపోతే, వికారాలన్నీ బాగా విజృంభిస్తాయి. మనకిష్టమున్నవాళ్ళు, ఇష్టం లేనివాళ్ళు రెండే కదా ఉంటారు! వీడు మనవాడు, వీడు కాదు! కాదని చెప్పరు! వీడు మనవాడంటారు. అంటే మిగతావాళ్ళు... మనవాడయితే ఒక రకంగాను, మనవాడు కాకపొతే ఇంకో రకంగాను ఉంటుంది కదా వికారం! ముఖంలోనే వ్యక్తమవుతూ ఉంటుంది కదా అది! అవుతుందా, లేదా? అంతలాగా వ్యక్తం చేయొద్దు, బావుండదని లోపలనుంచి అంతరాత్మ చెప్తూ ఉన్నా, అది అలాగే అయిపోతూ ఉంటుంది కదా! అలా కాలేదుట రామదాసుకి. ఎందుకంటే, అన్నీ నిన్నుగానే చూస్తుంటే, ఈ మనో వికారములు అనే పాపము, దానివల్ల వచ్చేటటువంటి అజ్ఞానమందే అవన్నీ పోతాయి. ఎక్కడ తల్లి, తండ్రి, సుతులెక్కడ? వారు ఎక్కడున్నారు? అంతా నువ్వే కదా! అందరూ నువ్వే అనుకున్నప్పుడు, వీరెవరూ లేరనుకోకూడదు. వాళ్ళు అట్లాగే అనుకుంటారు. నేను నీకు లేకపోతే, నువ్వు నాకు లేవంటాడు కొడుకు, అంతేగా! అది కాదు మార్గం. అన్నీ భగవత్ పరంగా చూడడం నేర్చుకున్నాడండి అంబరీషుడు. అదే భాగవతం.

"అంతఁ గొంతకాలంబున కమ్మేదినీకాంతుండు సంసారంబు వలని తగులంబు విడిచి నిర్మలుండై యేకాంతంబున భక్తి పరవశుండయి యుండ నా రాచతపసికి భక్తలోకవత్సలుండగు పురుషోత్తముఁడు ప్రతిభట శిక్షణంబును నిజజనరక్షణంబును నిఖిలజగదవక్రంబునునగు చక్రంబు నిచ్చి చనియె నంత."

అది వచనం. పద్యాలు చదువుకుని వచనం చదువుకోక పోవడం అనేటటువంటిది ఒక అభ్యాసం ఉంటుంది. అసలు పెద్దపెద్ద రహస్యాలన్నీ వచనాల్లో పెట్టేశారు. అన్యాయం అనిపిస్తుంది. పద్యాలు చదువుకుంటాము, వచనాలు వదిలేస్తాము. *"గొంత కాలంబున కమ్మేదినీకాంతుండు సంసారంబువలని తగులంబు"* – అంటే వీళ్ళందరినీ వదిలేశాడు అని కాదు. వీళ్ళని గూర్చి మనకుండే భావాలుంటాయే– మొగుడని, పెళ్ళాం అని, పిల్లలని, మిత్రులని, బంధువులని, సుతులని, ఇటువంటివన్నీ ఉంటాయి కదా! అవి పోయినాయండి ఆయనకి. భారతీయ మార్గంలో, భాగవత మార్గంలో మాత్రమే ఇది చెప్తారు. మిగతా వాళ్ళంతా వదిలేసి వెళ్ళమనే చెప్తూ ఉంటారు. "వదిలేసి వెళ్ళిన వాళ్ళంతా సన్నాసులు" అన్నారు మాస్టరుగారు. "సన్యాసులు కాదు సన్నాసులు" అన్నారు. వదిలి వెళ్ళిన వాళ్ళంతా మోసపోయిన వాళ్ళే అని చెప్తాడు అరవిందుడు. భగవత్ తత్త్వం పేరున తమను తాము మోసం చేసుకున్నవాళ్ళు అన్నిటినీ వదిలేస్తారు. భగవత్ తత్త్వం పరిపూర్ణంగా అనుభవిస్తుంటే దేన్నీ వదలక్కర్లేదు. అన్నిటిలోనూ భగవంతుడిని చూడవచ్చు. ఇది వదిలించుకుందాం, అది

వదిలించుకుందాం... ఏదీ వదిలించుకోనక్కర్లేదు. అటు చూడడమే. అదే ఇది. అంచేత, అతనికి ఈ విధంగా *"సంసారంబువలని తగులంబు"*. అది వదిలేసింది. అది ఆ విధంగా వదిలెయ్యాలి. ఎప్పుడూ మనం బెజవాడలో శిశిర ఋతువులో కలుస్తూ వచ్చాము కాబట్టి చెప్తూ వచ్చాను, అది పడిపోవాలి అని. ఏది? ఆకు. ఆకు దానంతట అది రాలాలి తప్ప, మనం విదిలిస్తే చెట్టు వదులుతుందేమిటి? వదులుతుందా? ఎంత గాలి వచ్చినా ఆకురాలు కాలం కాకపోతే ఆకు రాలనే రాలదు. కర్మవశాత్తు నిన్ను పట్టుకున్నవేవీ నిన్ను వదలవు. నువ్వు లోపల పండుతూ ఉంటే అవి వదులుతూ ఉంటాయి. పండడం వల్ల వదలాలి తప్ప పండకపోతే ఎట్లా? *"ఉర్వారుక మివబంధనాన్"* – పండిన దోసపండు దోసతీగకి అంటు పట్టినట్టు ఉంటుంది గాని ముట్టుకుంటే వచ్చేస్తుంది చేతిలోకి. తుంపక్కర్లేదు, పీకక్కర్లేదు. తీగకీ ఇబ్బంది లేదు, పండుకీ ఇబ్బంది లేదు. అట్లా ఉంటుంది తప్ప తగులుకోదు. తగులంబు లేదు. సంసార తగులంబు విడిచిపోయింది. విడిచిపోతే నిర్మలమవుతాడండి. ఎవడయినా సరే! రాలిపోయిందనుకోండి, సహజంగా రాలిపోయింది కదా! ఇప్పుడు చాలామందికి జుట్టు సహజంగానే రాలిపోతుంది. రాలిపోతే మళ్ళీ ఎట్లాగయినా మొలిపించుకుందా మనుకునేవాడికి తగులం ఉన్నట్టే కదా! అలా కొంతకొంతమంది మనని విడిచి వెళ్ళిపోతారు. కోరి వాళ్ళని మళ్ళీ తెచ్చిపెట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యక్కర్లేదు. వాళ్ళు వస్తే సరి. కొంతమంది మనని చేరుతూ ఉంటారు కదా! జీవితంలో చిన్నతనం నుంచి ఇప్పటివరకూ చూసుకుంటే కొంతకొంతమంది చేరారు. కొంతకొంత కాలం అయిన తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారు.

మళ్ళీ కొత్తగా కొంతమంది చేరారు. ఇట్లా చేరుతూ, విడిపోతూ ఉంటారు, ఒక్క ఆత్మబంధువులు తప్ప. అది ఆత్మతో సంబంధం కాబట్టి ఎప్పుడూ వదిలిపోకుండా ఉంటారు. వాళ్ళ వలన తగులుం ఉండదు. అంటే, లంకెలాగా ఉండదు జీవితం. బంధంగా ఉండదు అది, సంబంధంగా ఉంటుంది. సమ్యక్ బంధం వేరు, బంధం వేరు.

అంచేత, అంబరీషుడికి రాజ్యం ఉంది. బహుభార్యలు ఉన్నారు. సంతానం ఉంది. బంధువులు ఉన్నారు. మిత్రులు ఉన్నారు. అన్నీ ఉన్నాయి. కానీ వాటియందు అతనికి తగులు అన్న తెగులు లేదు. ఏమీ తగులు లేకుండా అన్నిటా దాన్నే చూస్తూ ఆ విధంగా ఉంటే నిర్మలుడయ్యాటడండి. *"నిర్మలుండై"*. ఇవి ఒక్కొక్క పదం చాలా పెద్ద సందేహాలు తీరుస్తూ ఉంటాయి. మనం గబగబా చదువుకుంటూ వెళ్ళిపోతే కుదరదు. *"నిర్మలుండై యేకాంతంబున"*. ఏకాంతం అంటే? మనం అనుకుంటూ ఉంటాము, ఎవ్వరూ లేకుండా ఉండడం అని, కాదు. ఏకాంతం అంటే అన్నిటియందూ ఉండే ఒకదానితో ముడిపడి ఇతరములు లేనప్పుడు అది ఏకాంతం అవుతుంది. అది ఒంటరితనం కాదు. మాస్టారు ఒకచోట చెప్తారు – "ఏకాంతం వేరు, ఒంటరితనం వేరోయ్!" అని. ఒంటరితనంలో ప్రశాంతత ఉండదు. అసహనం ఉంటుంది, భయం ఉంటుంది. ఏకాంతుడికి ఒక్కడున్నా, పదిమంది ఉన్నా, అందరిలో ఉన్న ఒకడితో ఉంటాడు కాబట్టి వాడు ఏకాంతుడు అవుతాడు. ఇక్కడ ఇతడు నిర్మలుడు అవ్వడం వలన, మూడవది ఏకాంతుడు అవ్వడం వలన, భక్తి పరవశుడై ఉండడం వలన... మూడు qualifications ఇచ్చారండి.

ఎంచేత అంటే, మొత్తం ఈ సృష్టి కథలో మనకు తెలిసిన వాటిల్లో తన సుదర్శన చక్రాన్ని తన భక్తుడి దగ్గర ఉంచిన ఏకైక సందర్భం అంబరీషోపాఖ్యానము. ప్రహ్లాదుడికి కూడా ఇవ్వలేదు. అంటే, ప్రహ్లాదుడు తక్కువ వాడని కాదు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకమైనటువంటి వైభవం చూపిస్తూ ఉంటాడు భగవంతుడు. అంచేత, ఈ వచనం బాగా చదువుకోవాలి.

*“అమ్మేదినీకాంతుండు సంసారంబువలని తగులంబు విడిచి నిర్మలుండై”* – అవన్నీ వదిలితే నిర్మలత్వం వస్తుంది. అవన్నీ పట్టుకుని, “I am pure” అనుకుంటే కుదరదు. ఎక్కడికెళ్ళినా పెళ్ళాం, పిల్లలు గుర్తువస్తున్నారనుకోండి, pure ఏమిటి? అట్లా రాకూడదు. అప్పుడు, అక్కడ భగవంతుడితో ఉండడమే కదా! ఎప్పుడు, ఎక్కడ, ఏది ప్రస్తుతమో అక్కడ ప్రస్తుతమైన దైవంతో ఉండడం తప్ప, ఇవన్నీ గుర్తు తెచ్చుకుంటున్నా డనుకోండి, అయ్యో! మా ఆవిడ వస్తే బావుండేదే అని భావించామనుకోండి, అదే మాట పదిమంది కూడా అంటారు, “ఆవిడ వస్తే చాలా బావుండేదండీ” అని. అప్పుడు వాళ్ళందరిముందూ వెక్కివెక్కి ఏడవడం అన్నమాట! అసలు ఆ భావం లేనివాడిని కూడా అప్పుడప్పుడూ విష్ణువు కెలుకుతూ ఉంటాడు, “అమ్మగారు వస్తే బావుండేది గురువుగారూ!” అని ఎవరితోనో అనిపిస్తాడు. అవును బావుండేది అనాలి. బావుండేది గాని రాలేదు. ఇప్పుడు ఇదే. ఇప్పటికి ఇది ప్రస్తుతం ఇంతే! అలా మనకి ప్రతివాళ్ళకీ ఎక్కడికెళ్ళినా ముందు గుర్తువచ్చేది వీళ్ళే కదండి! అట్లాంటివన్నీ వదిలేశాడట. లేకపోతే, వ్యాపారం. తప్పదు! భార్యాపిల్లలు గుర్తు రారేమోగాని వ్యాపారం

వెంట వచ్చేస్తూ ఉంటుంది. లేకపోతే, వృత్తి! మరి ఈయనకో? పెద్ద రాజ్యం ఉంది. కుర్చీ దిగితే ఎవడయినా పట్టుకుపోతాడేమో అన్న భయపడే రోజుల్లో దాన్ని ఎలా మర్చిపోయాడు? అదీ విష్ణువే! అంతా విష్ణువే అనుకోవడం వల్లే ఆయనకు నిర్మలత్వం వచ్చిందండి. కనబడుతున్నదంతా విష్ణువే. దాంట్లోంచి ఆయన ఏకాంతుడయ్యాడండి. ఏకాంతంలో ఏం జరుగుతుందంటే అతడు, తానే ఉంటారు. అప్పుడప్పుడూ తన్మయత్వం చేత అతడైపోతూ ఉంటాడు. మళ్ళీ తానైపోతుంటాడు. తానుగా వస్తుంటాడు. అదైపోతూ ఉంటాడు.

రామకృష్ణ పరమహంస మంచి ఉదాహరణ దీనికి. ఆయన గుళ్ళో పూజ చేస్తుంటే సహస్రం చేయించుకోవడానికి వచ్చేవారు అమ్మవారి గుడికి. ఆ సహస్రం చేద్దామని అన్ని ఏర్పాట్లు చేసి, స్తోత్రం మొదలుపెట్టేసరికి ఆయన, అమ్మవారు మిగిలిపోతారు. ఆ అమ్మవారు ఏదేదో పలకరిస్తుంది, ఈయన ఆవిడతో ఏదో మాట్లాడుతూ ఉంటాడు, ఒకరొకరు నవ్వుకుంటూ ఉంటారు. పూజ ఉండదు. ఇట్లా ఉండిపోతాడు. పూజకి వచ్చిన వాళ్ళు ఏమవ్వాలండి? సహస్రనామం సగంలో ఆపేశాడు. పూర్తి చెయ్యడు. నవ్వుతూ ఉండిపోయాడు, వెర్రివాడిలాగా. వెళ్ళిపోవాలా ఇంటికి, పూజ అయిన తర్వాత వెళ్ళాలా? మనకి భయం కదా! ఉందామంటే time అయిపోతూ ఉంటుంది. చిరాకు వస్తుంటుంది. ఆయన ఎప్పుడో నెమ్మదిగా మళ్ళీ బయటకు వచ్చేవాడు. "ఏమయింది?" అనేవాడు. ఏమయ్యింది అని అడిగితే, భక్తులకి ఎట్లా ఉంటుందండి? ఇట్లా మాటిమాటికీ జరుగుతుంటే ఇంక మనం గుళ్ళో పూజకి

పనికిరామని, వేరే ఒక గది కట్టించుకుని అందులో ఉండిపోతాడు. “ఇంకెవరికైనా అప్పచెప్పండి, నేను పూజలు చేస్తే ఊళ్ళో వాళ్ళకి ఇబ్బంది” అని చెప్పేశారు. ఎందుకయ్యింది? ఆ ఏకాంతంలో, శ్రీకాంతుడు నిన్ను ఏకాంతమున కలిసినప్పుడు నా గురించి చెప్పమని పాటలు పాడుతూ ఉంటాము కదా! ఇంకొకడికి చెప్పడం గురించి ఏముండదు. పాడుతూ ఉంటాము కదా ఏకాంతంగా ఉన్నప్పుడు నా గురించి చెప్పమ్మా అని. నీ గురించి ఆవిడకి గుర్తు ఉంటే అది ఆవిడకి ఏకాంతం కాదు కదా! ఆ ఏకాంతంగా ఉంటే గాని ఆయన రాడు! అది చూడండి! శ్రీకాంతుడు ఏకాంతంలో చేరతాడుట. ఏకాంతం అంటే, *“ఏకో నారాయణో హరిః.”*

అతడు తప్ప ఇతరములు లేనటువంటి భావనలో స్థిరపడినప్పుడు భగవంతుడు కనిపిస్తాడు. అప్పుడు పరవశం కలుగుతుంది. *“భక్తిపరవశుండయి యుండ నా రాచతపసికి భక్తలోకవత్సలుండగు పురుషోత్తముఁడు ప్రతిభట శిక్షణంబును.”* ఇటువంటి వారికి వ్యతిరేకంగా ఏమయినా వస్తే రక్షించే భారం భగవంతుడిదే. *“ప్రతిభట శిక్షణంబును నిజజనరక్షణంబును నిఖిలజగదవక్రంబునునగు చక్రంబు నిచ్చి చనియె నంత.”*

మొత్తం ప్రపంచంలో దానికి అడ్డులేదట. మొత్తం సృష్టి చక్రమే సుదర్శన చక్రం. సృష్టి చక్రమే ఆయన ఆధారంగా అది నడుస్తూ ఉంటుంది. అంతేగాని తిప్పుతూ కూర్చోడు దాన్ని. మనకి అవగాహనకి బొమ్మ ఇస్తే, బొమ్మలో ఇరుక్కుపోతాము. చాలా పెద్ద problem మనతో. ఏమిస్తే దానిలో ఇరుక్కుపోతాము. కూర్చుని దాన్ని తిప్పుతూ ఉండడం ఏమిటి వేళ్ళన్నీ నలిగిపోయేలా?

పైగా చిన్న చక్రమా? సృష్టి చక్రం. ఆయన యొక్క ఆధారంతో తిరుగుతూ ఉంటుంది కాలం రూపంలో. ప్రకృతి–కాలము రెండూ కలిపి అలా తిరుగుతూ ఉంటాయి ఇన్ని లోకాలుగాను. అంచేత, దానికి ఏదీ అడ్డులేదు. *"నిఖిలజగదవక్రంబుననగు చక్రంబు నిచ్చి చనియె నంత"* అంటే, దానివల్ల ఏం జరుగుతుందంటే సృష్టి చక్రమే తను వశమయ్యిందంటే తను ఎంతటి వాడై ఉండాలండి? సృష్టి చక్రం మన వశం అయ్యిందంటే, సాక్షాత్తు విష్ణువే. విష్ణువే అంబరీషుడి రూపంలో ఉన్నాడని అర్థం చేసుకోవాలి, అంతే. అలా ఉన్నాడాయన.

# దుర్వాసుడు

"తనతోడి నీడకైవడి
ననురూపగుణాఢ్య యైన యాత్మమహిషితో
జనవిభుఁడు ద్వాదశీవ్రత
మొనరఁగ హరిఁ గూర్చి చేసె నొకయేఁ డధిపా!"

*'నీడకైవడి'* ఉంటుందటండి ఆయన భార్య ఆయనతో. ఎంత అదృష్టం అనుకుంటారు మగవాళ్ళు కదా! నీడకైవడి భార్య ఉండడం అంటే అర్థమేమిటో తెలుసా? భార్య అంటే ప్రతి జీవుడికి అతడి స్వభావమే, గుర్తుపెట్టుకోండి. నీ స్వభావం ఎలాంటిదో అది నీ భార్య రూపంలో నీకు భగవంతుడు gift గా ఇస్తాడు pack చేసి! మా ఆవిడ నా మాట వినదండి అంటే నీ స్వభావం నీ మాట వినదు అని చెప్పడం. నీ స్వభావం నీ మాట వింటే నీ భార్య నీ మాట వింటుంది. ఇది సత్యం. ఈ దృష్టితో చాలా దంపతిని నేను చూశాను. చాలా సత్యం అది. రాముడికి ఇలాగే ఉంటుంది కదా భార్య! ఎంచేత? రాముని స్వభావం రాముడిని అనుసరించి ఉంటుంది. కృష్ణుడి స్వభావము ఉండాలి కదా! కృష్ణుడు రాముడికన్నా ఎక్కువ కదా! ఉండదు. ఎందుకుండదు? ఎందుకుండదంటే ఆయనలో అన్ని స్వభావాలు ఉన్నాయి. ఆయన రుక్మిణిలాగ వినయంగా ఉండగలడు, సత్యభామలా పొగరుగా ఉండగలడు. అవతలవాడు వినయంగా అయితే మనమూ వినయం. అవతలవాడు ధూర్తుడు

అయితే దానికి double. ఏది ఇచ్చినా x2 వేసుకోవడం. అట్లా ఉంటుంది. శకుని కనిపిస్తే శకునికి తాతలాగా ఉంటాడు కదా! ఎవరికి వాళ్ళ స్వభావము బట్టి తన స్వభావము. ఆయనకు అష్టప్రకృతులు కదా! అష్టప్రకృతులు ఉన్నాయి ఆయనలో. అదొక పద్ధతి. అది వైభవము.

ఇక్కడ భార్యకి భర్తగాని, భర్తకి భార్యగాని, దొరికినది దొరికినట్టు ఆ జన్మకి అనుభవించెయ్యమని చెప్తుంది మన సంప్రదాయం. ఎందుకో తెలుసా? మార్చక! మార్చితే వీలుపడదు. మళ్ళీ వస్తుంది. మార్చినా అలాంటి వస్తువే వస్తుంది. అందుకనే నా స్వభావంలో మార్పు రావాలి కదా! స్వభావంలో మార్పు రావడానికే ఈ భార్యాభర్తలని ప్రకృతి కలుపుతుందండి. విధి కలుపుతుంది. విధి బలీయం కదా! అందుకని, marriages are made in heaven, and they result in experiencing heaven or hell! అది కూడా ఉంది. అంటే, స్వర్గంలో కలుపుతారంటే అర్థం ఏమిటంటే ఏ స్వభావానికి ఎటువంటి భార్యని ఏర్పరచాలి పురుషునికి. అలాగే స్త్రీ స్వభావాన్ని బట్టి పురుషుడు. అంచేత, పతివ్రతా ధర్మం, పాత్నీవ్రత్యము రెండూ ఉన్నాయి. స్త్రీకి పతివ్రతా ధర్మము – ఈసారికి వీడిని ఇచ్చాడు. ఇష్టం ఉన్నా, లేకపోయినా అంగీకరించేటటువంటిది. ఓ పని అయిపోతుంది! స్వభావాన్ని సాపు చేస్తుంది! గయ్యాళి భార్య ఉందంటే సాపు చెయ్యదండీ! మెత్తబడిపోతారు. కొంతమంది నవ్వుతున్నారు అక్కడా ఇక్కడా! అట్లాగే చాలా కఠినాత్ముడైన భర్త వచ్చాడనుకోండి. మీరాబాయికి రాలేదు? వచ్చాడు. భక్తురాండ్రు అందరికీ భర్తలు ఎలాంటి

వాళ్లొచ్చారండి? ఎక్కువ ఇదే ఉంటుంది. అక్కడక్కడా అనుకూలం అయినటువంటి వారొస్తారు. ఎంచేత? నీకు కర్మ క్షాళణానికి ఏర్పాటు చేశాడు భగవంతుడు ఈ భర్తని. అలాగే పురుషుడికి కర్మ క్షాళణానికి ఈ భార్యని ఏర్పాటు చేస్తాడు. ఆమె ద్వారా నీకు కర్మ క్షాళణం అయిపోతుంది. ఆయన ద్వారా నీకు కర్మ క్షాళణం అయిపోతుంది. అందుకని, it's a committment. ఇంక అంతే! అట్లా మార్చుకోకుండా ఉన్నదానితో ఉండటం ఒక law of acceptance అని చెప్తూ ఉంటారు. నీ వశంలో లేనిది నువ్వు ఏం మారుస్తావు? ఎదుటివాడి స్వభావం నువ్వు మార్చగలవా? మార్చలేవు. నీ స్వభావం మార్చుకోగలవా? మార్చుకోలేవు. మరి ఎలా? దైవాన్ని ఆరాధన చేసుకుంటూ కొద్దికొద్దిగా... కొద్దికొద్దిగా మార్చుకో. నువ్వు మారుతూ ఉంటే పరిసరాలు నీకు మారుతూ ఉంటాయి.

అంచేత, ఇక్కడ *"అనురూప"* అంటే అంబరీషుడికి, భార్య కూడా అంబరీషుని వంటి స్వభావమే కలిగి ఉంది. చూడడానికి కూడా వాళ్ళిద్దరూ కాస్త ఒకటిగానే ఉన్నారేమో అనిపిస్తారు. "మేనత్త-మేనమామ బిడ్డలాండి?" అని అడుగుతారు. కాదు. చాలాచోట్ల అట్లా కాకుండానే అట్లా ఉంటారు. ఇదేంటి! ఇద్దరికీ ఒకే పోలికలు ఉన్నాయంటారు. పృథు చక్రవర్తి కథలో కూడా మీకు అట్లా వస్తుంది. పృథు చక్రవర్తి ఆయన భార్య. అట్లాగే అంబరీషుడి భార్య. అదృష్టవంతులు కదా! అలాంటి భార్య ఉంటే మేము కూడా అంతటివాళ్ళు అయిపోతాము అనుకుంటారు! అలాంటి భార్య ఉంటే అంటే, నీలో అలాంటి స్వభావం ఇదివరకే ఏర్పడి ఉంటే

నీకూ అలాంటి భార్య ఉంటుంది. అలా లేదుట అంటే ఇప్పుడు ఏర్పాటు చేసుకోవాలి. Syllabus అదే life కి.

మనకి జీవితంలో ఈ జన్మకి syllabus ఏమిటంటే నీ భార్య రూపంలోను, నీ సంతానం రూపంలోనూ, నీ బంధుమిత్రుల రూపంలోనూ, నీ syllabus నీకిచ్చేస్తారు. వాళ్ళయందు నీ కర్తవ్యము... మారుమాట్లాడక చెయ్యడం, నిర్వర్తించడం. నాకే ఎందుకు జరిగిందంటే మరి నీకే ఎందుకు దొరికిందని ప్రశ్నకి సమాధానం కూడా అదే. మాస్టరుగారు ఒకరి దగ్గరకి వెళ్ళినప్పుడు, "వ్యాపారంలో ఈ నష్టం నాకే వచ్చింది మాస్టారు, మిగతావాళ్లకి రాలేదు" అంటే, "అదేరా! నీకే ఎందుకు వచ్చిందంటావు?" అనేవారు. అందరకీ రాలేదు, నాకెలా వచ్చిందంటున్నాడు, ఎందుకొచ్చింది అంటున్నాడు. "అదే ఎందుకొచ్చిందని" సమాధానం చెప్తుంటారాయన! ఎంచేత? మనకే ఎందుకిచ్చాడండి ఈ మొగుడిని? మన అక్కయ్యకి ఇటువంటి మొగుడిని ఇవ్వలేదు, మన చెల్లెలకి ఇటువంటి మొగుడిని ఇవ్వలేదు. మా ఆడపడుచు ఎంత అదృష్టవంతురాలు అనుకుంటూ ఉంటారు కదా! అలాంటి మొగుళ్ళు కొంతమంది వస్తారు, specialగా. ప్రతి స్త్రీకి తన మొగుడు special ఎన్నో రకాలుగా. చెప్పరుగాని పాపం వాళ్ళూ... స్త్రీ హృదయం చాలా లోతైనదట. పసిఫిక్ మహాసముద్రం కన్నా లోతుగా ఉంటుందట. వాళ్ళు అన్నీ చెప్పరు. అన్నీ చెపితే మనం బ్రతకం! చచ్చిపోతాము! కొన్నికొన్ని వింటుంటేనే చచ్చిపోతాము కదా మనం! అన్నీ అన్నారనుకోండి, అక్కడికక్కడే పేలిపోతాము! అంచేత, నీకిటువంటి భార్య ఎందుకొచ్చింది? This is what

you need for this life. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే పద్యం వచ్చింది కాబట్టి కొంత మన విషయం కూడా చెప్పుకోవాలి కదా!

అంబరీషుడికి అట్లా *"తోడి నీడకైవడి"*– నీడలాగా వెంటపడి ఉంటుంది. *"అనురూపగుణాఢ్య యైన యాత్మమహిషితో"* – ఆత్మమహిషి అంటే అర్థం అదే. ఆత్మకి మహిషి ఎవరయ్యా అంటే స్వభావము. ఇప్పుడు మన స్వభావము బావుంటేనే కదండి మనం ఈ కార్యక్రమాలు చేస్తాము! లేకపోతే, పొద్దునే లేవాలా అనిపిస్తుంది. స్వభావమే అంటుంది. ప్రార్థన చెయ్యడానికి స్నానం ఎందుకు? ప్రార్థన స్నానం లేకుండానే చెయ్యొచ్చు కదా అని చెప్తుంది స్వభావము, కదా! అప్పుడప్పుడూ చెప్తూనే ఉంటుంది. ఈ పూటకి స్నానం మానెయ్యి అని. ఇవన్నీ ఎవరు చెప్తున్నారు? స్వభావం చెప్తోంది. గోంగూర పచ్చడి వేస్తే BP అని తెలిసి కూడా తింటాము కదా! ఏమిటది? నీకు తెలుసు తినకూడదని. కానీ స్వభావం తినెయ్యమంటుంది. తర్వాత చూసుకుందాం అంటుంది. ఇలా ప్రతీది స్వభావం వినదు. దాన్ని మనతో బాగా స్నేహం చేసుకుని, ప్రేమతో, లాలనతో దాన్ని మనకి అనుగుణంగా చేసుకోవడమే మొత్తం సాధన. అంతకన్నా ఇంకేమీ లేదు. ఆత్మ ఎప్పుడూ పరిశుద్ధమే. స్వభావం వల్లే ఇబ్బందులు. అలాంటి స్వభావం ఆయనకి లేదు. ఆయనకి అంతా అనురూపం.

*"... జనవిభుఁడు ద్వాదశీవ్రత మొనరఁగ హరిఁ గూర్చి చేసె నొకయేఁ డధిపా!"* ఒక సంవత్సరం ద్వాదశీవ్రతం చేశాడటండి. భగవద్భక్తులకి భగవంతుడే వేడుకగా వైభవం కలిగించడానికి కొన్ని సంకల్పాలు కలిగిస్తూ ఉంటాడు. ఆరంభపరిత్యాగి

నిజమైనటువంటి భక్తుడు, యోగి. సంకల్పములు సన్యసించి ఉంటాడు భక్తుడైనా, యోగైనా. భక్తులకి కాని, యోగులకి కాని మాటిమాటికి ఇట్లా రజస్సులోంచి సంకల్పాలు పుట్టుకుంటూ రావు. రజోగుణం ఉన్నచోట సంకల్పాలు పుట్టలు పుట్టలుగా వస్తూ ఉంటాయి. సత్వగుణం ఉన్నచోట సన్యస్త సంకల్పాలు. ఇక్కడికెళ్దామా, అక్కడికెళ్దామా, అది చేద్దామా, ఇది చేద్దామా అని అనిపించదు. 'Saturn' అనే పుస్తకంలో auto-throws అని చెప్పాను. అంటే, లోపలినుంచి ఒక ఊపుగా సంకల్పం వస్తుందన్నమాట. ఇంక ఆ ఊపు మనని ఊపేసి పడేస్తుంది. అంతటితో ఆగిందా? ఇంకో ఊపు వస్తుంది... ఇంకో ఊపు వస్తుంది. ఇట్లా ఊగుతూ, ఊగుతూ ఉంటే తల తిరిగిపోతుంది. అంచేత, రజోగుణప్రవృత్తి అనేటటువంటిది భగవద్భక్తులకి ఆరాధనలో ఉండేటటువంటి నిర్మలత్వము బట్టి తగ్గుతూ వస్తూ ఉంటుంది. సత్వగుణం పెరుగుతూ వస్తూ ఉంటుంది. వాళ్ళకేమీ సంకల్పాలు కలగవు. ఒకవేళ ఎప్పుడన్నా కలిగితే అది భగవత్ సంకల్పమే అని భావన చేసి నిర్వర్తిస్తాడు.

అంబరీషుడు సంకల్ప సన్యాసం కూడా చేసినటువంటివాడు. ఏదీ తనకి తానుగా సంకల్పించడు. అటువంటి వాడికి ద్వాదశీవ్రతం భగవంతుని గురించి చేద్దామని అనిపించింది. ఎందుచేత? ఈ ద్వాదశీవ్రతం ఇదివరకూ ఋషులు నిర్వర్తించారు. అలా నిర్వర్తించినప్పుడల్లా దైవమే సంతతిగా పొందారు వాళ్ళు. ద్వాదశీవ్రతాన్ని ఆచరించి దత్తాత్రేయుడిని పొందుతారు అత్రి-అనసూయ. అంటే, భగవంతుడి యందు అప్పటికే ఇమిడి ఉన్నారు.

భగవంతుని గూర్చిన భావనే, భగవంతుడి గూర్చినటువంటి కార్యమే ఆయనకి తట్టింది – పోనీ ఒక సంవత్సరం పాటు మనం engage చేసుకుందామని. ఆ విధంగా ఒక ద్వాదశీవ్రతం అంటే సంవత్సరంలో ఇరవైనాలుగు ద్వాదశులు వస్తాయి – శుక్లద్వాదశి, కృష్ణద్వాదశి. ఈ రెండు ద్వాదశులప్పుడూ... ద్వాదశీవ్రతం అంటే ఏమిటంటే ఏకాదశినాడు ఉపవాసం ఉండి... దశమినాడు రాత్రే దానికి మనసు లగ్నం చేస్తాడు. దశమి లగ్నం చేసి, ఉపవసించడం అంటే దైవానికి దగ్గరగా చేరడం. అప్పటినుంచే భావన. దశమి నుంచీ భావన, ఏకాదశంతా భావన. ద్వాదశంతా భావన. ద్వాదశి సంధ్యా సమయంలో ఆ వ్రతానికి అర్పణం యిస్తారు.

ఇట్లా ఇరవైనాలుగు ఏకాదశులు చేసే విధానం ఉన్నది. అది మనకి భాగవతంలోనే ముందు స్కంధాల్లో వస్తుంది. దత్తాత్రేయుడు, దుర్వాసుడు, చంద్రుడు పుట్టిన సందర్భం. అందుకనే ఈ వ్రతం చేస్తుంటే దుర్వాసుడు రావడం జరుగుతుంది. దుర్వాసుడు ఒక తోకచుక్కలాంటి వాడు, ఎప్పుడొస్తాడో తెలియదు, ఎందుకొస్తాడో తెలియదు. ఆయన పరీక్ష పెడతాడు. ఆ పరీక్షలోంచి నెగ్గుకొస్తే వాడింక మహావైభవంలోకి ప్రవేశిస్తాడు. ఆయన రుద్రమూర్తి. త్రిమూర్తులలో రుద్రుడి రూపంలో దుర్వాసుడు పుడతాడు అంశగా. విష్ణు అంశగా దత్తాత్రేయుడు పుడతాడు. అటుపైన బ్రహ్మ అంశగా చంద్రుడు పుడతాడు. ముగ్గురూ కలిపి మళ్ళీ దత్తాత్రేయుడిగా ఉంటారు. అంటే ఈ కథలో ద్వాదశీ వ్రతం అంబరీషుడు చెయ్యడం వల్ల దుర్వాసుడు వస్తాడు. ద్వాదశీవ్రతం పై విధంగా భక్తిగా నిర్వర్తించుకుంటూ ఉంటాడు.

"ఇట్లు వ్రతంబు సేసి యా వ్రతాంతంబునం గార్తిక మాసంబున మూఁడు రాత్రులుపవసించి కాళిందీజలంబుల స్నాతుండయి మధువనంబున మహాభిషేకవిధానంబున విహిత పరికరసంపన్నుండయి హరి నభిషేకంబు సేసి మనోహరంబులయిన గంధంబులు సమర్పించి యభినవామోదంబులైన పుష్పములం బూజించి తదనంతరంబ."

అలా సంవత్సరం అంతా చేశాడు. కార్తీక మాసం దానికి వ్రత సమాప్తి. అంటే, కార్తీక మాస శుద్ధ ద్వాదశి అనుకోండి వ్రతసమాప్తి. అంటే బహుళ ద్వాదశిలో మొదలుపెట్టాడండి వ్రతం. అప్పుడు ఇరవైనాలుగు ఏకాదశులకు కార్తీకమాస శుద్ధ ద్వాదశి వస్తుంది. ఆ విధంగా చేసి, *"గార్తికమాసంబున మూఁడు రాత్రులుపవసించి"* – రాత్రి పూట భోజనం చెయ్యలేదు. ఈ వ్రతం చేసినటువంటి వారు దశమి, ఏకాదశి, ద్వాదశి– ఈ మూడు రాత్రులూ ఉపవశిస్తారు. విష్ణు చింతన చేస్తారు. ఏకాదశినాడు షోడశోపచార పూజ విష్ణువుకి చేస్తారు. విష్ణు స్తోత్రంతో అభిషేకం చేస్తారు. అలా ఏకాదశి అంతా నడుస్తుంది. దశమి ఉపవాసం, ఏకాదశి ఉపవాసం, ద్వాదశి గడియలు ముగిసే వరకు ఉపవాసం.

*"... కాళిందీజలంబుల స్నాతుండయి మధువనంబున మహాభిషేకవిధానంబున విహితపరికరసంపన్నుండయి ..."*

అభిషేకానికి, మహాభిషేకం చెయ్యడానికి అన్ని ఏర్పాట్లు

చేసుకున్నాడు. *“హరి నభిషేకంబు సేసి”* – హరికి అభిషేకం చెయ్యడానికి విష్ణుసూక్తముల పారాయణ, శ్రీసూక్తముల పారాయణ సంప్రదాయంగా చేస్తుంటారు. పురుషసూక్తం, శ్రీసూక్తం, విష్ణుసూక్తాలు అన్నీ పారాయణ చేస్తూ అభిషేకం చేస్తారు. ఆ పదహారు ఉపచారాలు చేస్తారు.

*“... మనోహరంబులయిన గంధంబులు సమర్పించి యభినవామోదంబులైన పుష్పములం బూజించి తదనంతరంబ.”*

ఆ విధంగా చేసి

“పాలేఱై ప్రవహింప నంగరుచులుం బ్రాయంబులున్ రూపము
ల్మేలై ధూర్తలుగాక వెండిగొరిజ ల్హేమోరుశృంగంబులుం
గ్రాలం గ్రేపుల యఱ్ఱునాఁకుచును రంగచ్చేలలైయున్న మం
దాలన్ న్యర్బుదషట్క మిచ్చె విభుఁ డుద్యద్వైదికశ్రేణికిన్.”

ఎప్పుడూ కూడా ఇలాంటి పూజలు, వ్రతాలలో బాగా దానధర్మాలు చేసుకోవాలి. అప్పుడు చేసిన దానధర్మాలకి చాలా విశిష్టమైన అనుగ్రహం లభిస్తుంది. దాన్నే మనవాళ్ళు పుణ్యం లభిస్తుంది అంటారు. దైవానుగ్రహం చాలా లభిస్తుంది. ఎందుకంటే, జీవుల రూపంలో ఉన్న దైవాన్ని సంతోషింప చెయ్యడం వల్ల. అవి ఎలా ఉన్నాయంటే, దానం చేసినటువంటివి, గోవులు... పూర్వకాలంలో విపరీతంగా గోవులు దానం చేస్తుండేవారు. అవి ఎలా ఉన్నాయి? గోసమూహము ఒక పెద్ద పాలసముద్రంలాగా ఉందండి, మొత్తం గోసమూహం అంతా కూడా. తెల్లటి గోవులు,

పుష్టిగా ఉన్నాయి, కదులుతూ ఉన్నాయి తరంగాల్లాగా. చూడండి మనకి పొద్దున్న పూట ఒక సరస్సులో కాంతులు పడితే ఎలా తళతళలాడుతుంది? అట్లా సూర్యకాంతి అలా గోవులమీద పడుతుంటే ఆ కాంతి ప్రతిబింబించి వాటి కదలికవల్ల ఒక పెద్ద పాల సరస్సల్లే ఉందట. చక్కని దూడలు ఎంతో అందంగా ఉన్నాయట. అవి ఎంతో ముద్దు వస్తున్నాయట. *"ధూర్తలు గాక"* – పొడిచేటట్టుగాను, కుమ్మేటట్టుగాను లేవట. ఆవులుగాని, దూడలుగాని, వాటి కొమ్ములన్నిటికిని కూడా బంగారు తొడుగులు వేశారటండి. అంటే అంబరీషుని సంపద అటువంటిది కదా! అంచేత, బంగారు తొడుగులు వేశారట. ఆ ఆవులు చాలా పుష్టిగా, తుష్టిగా, తెల్లగా, పాలవలే ప్రకాశిస్తూ ఉంటే, వాటియొక్క కొమ్ములు బంగారు కాంతులతో తేజరిల్లుతుంటే... ఒకసారి ఊహించండి ఎలా ఉంటుందో! హిరణ్మయ కాంతులు, స్వచ్ఛమైన తెల్లటి కాంతి సరస్సుగా ఉందట. కదలికలతో ఉందట. దూడలన్నీ కూడా గోవుయొక్క పాలను తాగుతూ ఉన్నాయట. అందుకనే, ఇంట్లో మనం ఏమయినా ఆవు బొమ్మ పెట్టుకుంటే ఆ దూడ ఆవు పక్క ఇట్లా వెర్రిమొహం వేసుకుని చూస్తున్నట్టు పెట్టుకోకూడదు. పాలు తాగుతున్నట్టు ఉండాలి. ఆవుపాలు తాగుతున్నట్టుగా దూడ ఉండాలి. అంతేకాదు, దూడ అట్లా ఏమీ తెలియనట్టుగా నించున్నట్టుగా పెట్టుకోకూడదు. దూడ పాలు తాగుతున్నట్టుగా ఉండాలి. ఆవు ఏం చేస్తుంది? దూడ పుచ్ఛం దగ్గర నాకుతూ ఉంటుంది. అంటే, దూడని ఆవు లాలిస్తూ ఉంటే, దూడ పాలు తాగుతూ ఉంటే, ఆ ఆవు ఎంత ఆనందంగా ఉంటుంది? అదీ ఆవుకి చిహ్నం. గోవంటే అది. తెల్లటి గోవు, పుష్టైన గోవు, పొదుగునిండా

పాలు ఉన్నాయి, దూడ తాగుతోంది, తల్లి పృచ్ఛం నాకుతోంది. వాత్సల్యానికి చిహ్నం అది. ఆ విధంగా ఉండేటటువంటి ఆవులు కొన్ని కోట్లండి, దానం ఇచ్చాడట. ఇలా అప్పుడప్పుడూ అవకాశం ఉన్నప్పుడు మహాత్ములు మానసికంగా దానం ఇచ్చేస్తుంటారు.

అంచేత, *"మం దాలన్ న్యర్బుదషట్క"* – ఒక ఆరు వందల కోట్లు ఇచ్చేశాడట. ఆరువందలకోట్ల ఆవులు ఎక్కడ పడతాయండి? ఆ విధంగా దానం చేశాడట. ఎవరికీ? *"దుద్యద్వేదికశ్రేణికిన్"* – ఉత్తమైనటువంటి, వేదములన్నీ బాగా తెలిసినటువంటి వారిలో ఉత్తములైనటువంటి వారికి దానం ఇచ్చాడట. అంత మందున్నారన్నమాట వాళ్ళు కూడా. ఇప్పుడు ఒక్కడంటే ఒక్కడు కనబడడు కదా!

"పెక్కంద్రు విప్రవరులకు
గ్రక్కున నతిభక్తితోడఁ గడుపులు నిండం
జొక్కపుటన్నం బిడి విభుఁ
డొక్కెడఁ బారణము సేయ నుద్యోగింపన్."

అట్లా దానం ఇచ్చేసి, తర్వాత అందరినీ కూర్చోబెట్టి భోజనాలు పెట్టాడండి. *"గ్రక్కున నతిభక్తితోడఁ గడుపులు నిండం"* – భోజనం పెడితే చాలనిపించాలటండి. తృప్తి చెంది చాలనాలి. కారం ఎక్కువ అవ్వడం వల్ల, ఉప్పు ఎక్కువ అవ్వడం వల్ల ఇంక చాల్లెండి అనకూడదు! తృప్తితో వాడు చాలనాలి. *"తృప్తాత్మా, తృప్తాత్మా, తృప్తాత్మా"* అంటాడుట జీవుడు భోజనం చేసినతర్వాత. భాష రాదు గానీ లోపల అనుకుంటాడుట – ఇంక

చాల్లే, ఇంక చాల్లే, ఇంక చాల్లే అనుకుంటాడు. వాడు ఇంక చాలని మూడు సార్లు అనుకుంటే పెట్టినవాడు అనుగ్రహింపబడ్డట్టే. అట్లా పెట్టాలి. ఈ రోజుల్లో పెట్టడం సులభమే, ఎందుకంటే ఎవడూ ఏమీ తినడు! ప్రతివాడికీ భయమే, ఏం తింటే ఏం వస్తుందో అని కదా! అంచేత, పెడుతుంటేనే చేతులు అడ్డంగా పెట్టేస్తుంటాము. ఏది ఏమయినప్పటికీ తృప్తి పరచాలి కదా! అంచేత, తృప్తి కలిగేటట్టుగా ఆ విధంగా భోజనాలు పెట్టాడటండి. పెట్టేసి ఇంక అప్పుడు తను ముగింపు కార్యానికి వచ్చి, ఆచమనం చేసి, దేవుడికి ఉద్యాపన చెప్పి, తను ఇంక భుజించాలన్నమాట. అది ఎప్పుడుట? ద్వాదశి గడియలు అయిపోయే లోపల చెయ్యాలి.

అలా ఉన్న సందర్భంలో, ఇంకొక కథానాయకుడు వస్తాడు. *"అయ్యవసరంబున"*. అంటే, అదే సమయంలో, ఏదో emergency వచ్చినట్టు వచ్చేస్తాడాయన. ఎప్పుడూ అంతే కదా! దుర్వాసుడు ఎప్పుడొచ్చినా emergency యే! But that emergency is followed by tremendous grace. ఆయన వచ్చి సవ్యంగా వెళ్ళాడుట అంటే ఇంక ఎక్కడికి వచ్చాడో అక్కడి వాళ్ళకి విపరీతమైన ఆశీర్వచనం. ఎందుకంటే, శివుడే కదా! ఆయన్ని దుర్వాసుడని ఎందుకు అన్నారో తెలుసా? ఎక్కడా ఒక్క క్షణం ఉండలేడుట. ఎక్కడున్నా చాలా కంపరం ఎత్తుతుంది దుర్వాసుడికి. అది ఎంతటి అగ్ని ప్రజ్ఞ అంటే, అసలు సృష్టిలో కంపరంగా ఉంటుందట ఆయనకి ఉండడానికి. అది చూడండి! ఎంత వైభవం కలిగినటువంటి సృష్టి! విష్ణువు అందులోనే ఉంటాడు కదా! కానీ ఆయనికి అది చాలదు. ఈ సృష్టిని నువ్వు చూసుకో,

అవసరానికి నన్ను పిలు అని, ఎక్కడో చల్లగా ఉండేచోట... (కంపరం కదా!) మంచుకొండ మీద కూర్చుంటాడు. మంచు అనిపించదు కదా ఆయనకి! మంచు వల్ల ఈయనకి ఎంత చల్లదనం వస్తుందో తెలియదు. కూర్చుని ఉపశమనం చెందుతూ ఉంటాడు. ఊర్ధ్వముఖుడై ఉంటాడు. ఊర్ధ్వరేతస్కుడు అని చెప్పాను కదా! అది అగ్నే. అలాంటివాడు దుర్వాసుడు. అతడిని ఎవరూ ఉంచుకోలేరు కూడా! పోనీ మూన్నాళ్ళు ఉండమందామని కూడా ఎవరూ అనుకోరుట. ఉంటే వీళ్ళకి కాలిపోతుంది. అంత తేజస్సు మరి. మహత్తరమైన తేజస్సు. మామూలుగా సినిమాల్లో చూపిస్తూ ఉంటారు దుర్వాసుడిని, అలా కాదు సుమా! ఆయన అగ్ని స్వరూపుడు. మహత్తరమైన తేజోమూర్తి. ఎక్కడయినా అనుగ్రహించాలన్నా, రాక్షసులపై ఆగ్రహించాలన్నా ఆయనే. ఆయన ఆగ్రహిస్తే అంతా కంపిస్తుంది. అనుగ్రహిస్తే అంతా వర్షిస్తుంది. అలాంటి...

> "భాసుర నిగమపదోప
> న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమయోగా
> భ్యాసుఁడు రవిభాసుఁడు దు
> ర్వాసుఁ డతిథి యయ్యెఁ దన్నివాసంబునకున్."

ఇంట్లోకి సూర్యుడొచ్చేసినట్టుంటుందండి దుర్వాసుడు వస్తే! ఎండ వస్తేనే భరించలేము కదా ఇంట్లోకి! సూర్యుడే వచ్చేస్తే! *"భాసుర నిగమపదోప న్యాసుఁడు."* నిగమాలంటే తెలుసు కదా! ఆపదములే ఉపన్యాసములుగా కలవాడటండి. న్యాసము

ఉపన్యాసము. అంటే కదులుతున్న వేదం. నిగమము పద ఉపన్యాసము. న్యాసమంటే ఉచ్ఛ్వాస, నిశ్వాస. ఉపన్యాసమంటే? ఉచ్ఛ్వాస, నిశ్వాసలని ఏది నిర్వర్తిస్తుందో అదే ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ప్రకటింపబడితే అది ఉపన్యాసం అవుతుందండి. ఏదిపడితే అది మాట్లాడితే అది ఉపన్యాసం అవ్వదు. శ్వాసని ఎవరు నిర్వర్తిస్తున్నారు? స్పందన. స్పందనని ఎవరు నిర్వర్తిస్తున్నారు? స్పందనాన్ని నిర్వర్తించేటటువంటి వాడే స్పందనం నుంచి, న్యాస నుంచి, వాచకం రూపంలో మాట్లాడుతుంటే... న్యాసమంటే ఉచ్ఛ్వాస, నిశ్వాస. అటువంటివాడు పలికే వాచకం అది ఉపన్యాసం. ఏమిటి ఈయన ఉపన్యసిస్తుంటాడు? అది నిగమము. ఆయన ఉపన్యసిస్తుంటే, మాట్లాడుతుంటేనే వెలుగు వచ్చేస్తుందట. *"భాసురత్వం"* – మాట్లాడితే వెలుగొస్తుందండి. అంటే, each time he speaks, పుంజములు, పుంజములుగా కాంతి వస్తుంది. అటువంటి వాడు.

*"భాసుర నిగమపదోప న్యాసుఁడు సుతపోవిలాసుఁ"* ఆయనకి పిల్లాట తపస్సు. విలాసంగా తపస్సు నిర్వర్తిస్తుంటాడట. *"సుతపోవిలాసుఁడనుపమయోగాభ్యాసుఁడు."* అంటే పోల్చటానికి ఉపమానము లేనటువంటి యోగి. సాక్షాత్తు శివుడే! యోగి అంటే శివుడే. ఆదియోగి అలాంటివాడు, దుర్వాసుడు – శివాంశ! యోగముచేత అతడే దైవంగా వర్ధిల్లుతుంటాడు. *"డనుపమయోగా భ్యాసుఁడు"* అంటే ఎప్పటికీ విడదీయరానటువంటి అనుసంధానం దైవముతో ఉన్నటువంటివాడు. *"రవిభాసుఁడు"* – సూర్యుడి వలే మహత్తరమైనటువంటి తేజస్సు కలిగినటువంటివాడు. దుర్వాసుడు

ఎక్కడా ఒక్క క్షణం కూడా నిలబడలేనటువంటి వాడు. అలాంటి వాడు ఆ సమయంలో అతిథిగా వచ్చాడండి.

"అ ట్లతిథియై వచ్చిన నమ్మునివల్లభునకుఁ బ్రత్యుత్థానంబు సేసి కూర్చుండ గద్దియ యిడి పాదంబులు గడిగి పూజించి సేమం బరసి తనయింట నన్నంబు గుడువు మని నమస్కరించిన నమ్మహాత్ముండు సంతసించి భోజనంబునకు నంగీకరించి నిర్మలంబులగు కాళిందీ జలంబులం బరమధ్యానంబు సేయుచు మునింగి లేచి రాక తడవు సేసిన ముహూర్తార్ధావశిష్ట యగు ద్వాదశియందు బారణ సేయ వలయుటఁ జింతించి బ్రాహ్మణాతిక్రమదోషంబునకు శంకించి విద్వజ్జనంబుల రావించి వారల నుద్దేశించి."

అతిథిగా వచ్చాడంటే అర్థమేమిటంటే చెప్పాపెట్టకుండా వచ్చాడని అర్థం. ఇప్పుడు appointment లేకపోతే ఎవరికీ ఇంట్లో అన్నాలు పెట్టరు కదా! అప్పటికప్పుడు వస్తే అన్నం పెట్టడానికి చాలా విసుక్కుంటారు. కానీ మన సంప్రదాయం ఏమిటంటే భోజనం time కి వస్తే భోజనం పెట్టాలి. టిఫిన్ time కి వస్తే టిఫిన్ పెట్టాలి. Dinner time కి వస్తే dinner పెట్టాలి. కాఫీ time కి వస్తే కాఫీ ఇవ్వాలి. పడుకునే time కి వస్తే పడకకి ఏర్పాటు చెయ్యాలి. మనం అప్పుడు ఏ విధమైన కార్యక్రమంలో ఉంటామో, అదే అతిథికి కూడా బాగా చెయ్యాలి. తిథి వార నక్షత్రములతో సంబంధం లేకుండా వచ్చేటటువంటివాడు అ–తిథి. ఇప్పుడు వచ్చాడేంటి అనుకోవడానికి వీలులేదు. వీడి దుంపతెగ,

ఇప్పుడు దిగాడేంటి! అనుకోవడానికి వీలులేదు. "పొద్దునే వచ్చిన వాన, సాయంత్రం వచ్చిన బంధువు అలా పూటకి ఉండిపోతారు" అని ఒక సామెత ఉంది.

అట్లాగే ఈయన వచ్చాడు సాయంత్రం వేళ. అంచేత, రాగానే అంబరీషుడు ముందు దణ్ణం పెట్టాడు. కూర్చోడానికి ఆసనం చూపించాడు. పాదములు కడిగాడు. పూజ చేశాడు. అప్పుడు కదా శాంతి వస్తుంది! వచ్చిన అగ్ని స్వరూపం అప్పుడు కొంత శాంతిస్తుంది. అటుపైన, *"సేమం బరసి"* – కుశలప్రశ్నలు అడిగాడు. అడిగిన తర్వాత, *"తనయింట నన్నంబు గుడువు మని నమస్కరించిన"* – నమస్కరించి, మా ఇంట్లో భోజనం చెయ్యండి అని అడిగాడు.

*"... నమ్మహాత్ముండు సంతసించి భోజనంబునకు నంగీకరించి నిర్మలంబులగు కాళిందీ జలంబులం బరమధ్యానంబు సేయుచు ..."*

సరే, భోజనం చేద్దామని వస్తాడు. ఆ పక్కనే కాళిందీ సరస్సులోకి వెళ్ళాడు స్నానం చెయ్యడానికి. *"నిర్మలంబులగు కాళిందీ జలంబులం బరమధ్యానంబు సేయుచు"* – ధ్యానం మొదలుపెడితే ప్రజ్ఞ పరం అయిపోతూ ఉంటుంది. వీళ్ళంతా అలాంటి వాళ్ళు. అలా అయిపోతే ఎప్పుడొస్తాడో ఆయనకే తెలియదు. ఆయనే లేడు కదా! భగవత్ ధ్యానం చేస్తుంటే భగవత్ తత్వంలోకి ఇమిడిపోతారండి. వాళ్ళంతా అలాంటి వాళ్ళు. అంబరీషుడిదీ అదే పరిస్థితి. వచ్చిన మహర్షిది అదే పరిస్థితి. *"బరమధ్యానంబు*

*సేయుచు మునింగి"* – అంటే దేంట్లో మునిగాడు? నీళ్ళలో కాదు. పరమధ్యానంలో మునిగాడు. ఇట్లా నీళ్ళలో మునిగిపోయాడు, ఇంక లేవలేదని చెప్పుకోకూడదు. పరమధ్యానంలో మునిగిపోయాడు. *"లేచి రాక తడవు సేసిన"* – రావట్లేదు, ఉండిపోయాడు. ఆలస్యం అవుతోంది. *"ముహూర్తార్ధావశిష్ట యగు ద్వాదశియందు"* – ద్వాదశి ముహూర్తం ఇంక అంతర్ధానమైయ్యేటటువంటి ముహూర్తం వచ్చేసింది. అంటే, ఇంక అది last ముహూర్తం. ముహూర్తం అంటే నాలుగు నిమిషాలు. ఇంకా నాలుగు నిమిషాలే ఉందండి. ఆయన ఇంకా అక్కడే ఉన్నాడు. రాడు. ఎప్పుడొస్తాడో తెలియదు. ఆయనకే తెలియదు. ఎంచేతంటే, తన్మయమై పోయాడు. అప్పుడేం చెయ్యాలి? ఆ సమయంలో ఈయన వ్రతం ముగించడానికి ఆచమనం చెయ్యాలి కనీసం. భోజనం చెయ్యడం తర్వాత విషయం. ఉపక్రమించాలి.

*"బారణ సేయ వలయుటఁ జింతించి"* – దాని గురించి భావన వచ్చిందట. *"బ్రాహ్మణాతిక్రమదోషంబునకు శంకించి"* – నీరు పుచ్చుకుందామంటే వచ్చినవాడు... ఆయన దుర్వాసుడే అవ్వక్కర్లేదు. ఎవరయినా తీసుకోవడానికి వీలులేదు. దుర్వాసుడు అవ్వడం ఇక్కడ మనకు అదనం. ఏ అతిథిని అయినా భోజనానికి పిలిచి, ఆయన వచ్చే లోపల మనం చేతులు పెట్టేసి, నాకుతూ కూర్చోడానికి వీలులేదు. మనం ఆగలేములెండి! ఆయన వస్తుంటేనే, "మరేం అనుకోబోకండి. నాకు కొంచెం sugar. నీరసం వస్తోంది, అందుకని తింటూ ఉంటాను. రండి!" అని చెప్పేస్తాడు వీడే! అలా కాదుట. సరే ముహూర్త కాలం ఉంది. ఆయనెప్పుడు వస్తాడో

తెలియదు. ఏం చెయ్యాలో తెలియదు. అంచేత, *"శంకించి విద్వజ్జనంబుల రావించి వారల నుద్దేశించి"* పలికాడు. తెలిసిన వాళ్ళని పిలిచాడు. సొంతంగా నిర్ణయం చెయ్యకుండా, ఇప్పుడు నన్నేం చెయ్యమంటారని తెలిసినవాళ్ళని అడగడం అంటే ఏమిటో తెలుసా? అంబరీషుడి వరకూ విష్ణువుని అడగడమే. "స్వామీ! ఆ రూపంలో నువ్వు వస్తివి. అన్నం తింటానంటివి." ఆ రూపంలో వచ్చింది విష్ణువేగా అంబరీషుడికి! ఇంకోటి కాదుగా! "తింటానంటివి. అక్కడికి పోతివి. అట్లా ఉండిపోతివి. ఇప్పుడు నేనేం చెయ్యాలని?" విష్ణువునే అడుగుతున్నాడు. తెలిసినవారి రూపంలో ఉండేటటువంటి విష్ణువుని అడుగుతున్నాడు.

"ముని నీరు సొచ్చి వెడలఁడు
చనియెడు ద్వాదశియు నింత సనియె న్నీలో
నన పారణయున్ వలయును
వినిపింపుం దర్షధర్మవిధ మెట్టిదియో."

ఆయనేమో లోపలకి వెళ్ళాడు, బయటకు రాడు. ఈ లోపల ఈ ద్వాదశి బయటకు వెళ్ళిపోతోంది. ఆయన రాడు, ఇది వెళ్ళిపోతోంది, ఇప్పుడు నేనేం చెయ్యాలని విష్ణువుని అడిగాడు. తెలిసినవాళ్ళ రూపంలో ఉండేటటువంటి విష్ణువుని కోరాడు. కోరితే వాళ్ళు...

"అతిథి వోయి రామి నధిప! యా ద్వాదశి
పారణంబు మానఁ బాడి గాదు

గుడువకుంట గాదు కుడుచుటయును గాదు
సలిలభక్షణంబు సమ్మతంబు."

వాళ్ళు చెప్పారు. ఆయన రాలేదని. చెప్పి, నువ్వీ ద్వాదశి పారణ మానబోక. తినబోక, అతిథి కదా వచ్చినవాడు! అలా అని తినకుండా ఉండబోక. అందుకని, మంచినీళ్ళు పుచ్చుకుంటే తిన్నట్టు లెక్కేనట. వీళ్ళకి అది తిన్న లెక్కంటే, మరి ఆయనకి కాదేంటి? కాబట్టి, అట్లా వాళ్ళొక తీర్పు ఇచ్చారండి. సరే, విష్ణువే పరిష్కారం చూపించాడు కదా! చేస్తున్న వ్రతం విష్ణువు గురించి, ఆరాధించేది విష్ణువుని, వచ్చిన అతిథి విష్ణువు. ఇప్పుడు ఈ బ్రాహ్మణులు ఈ విధంగా సలహా ఇచ్చారు. అదీ విష్ణువే. సరే! ఆ పైన కథ విష్ణువే చూసుకుంటాడు. అంచేత, మంచినీళ్ళు పుచ్చుకుంటాడండి.

స్వస్తి.

# మహామాయ

అంబరీషుని గుణగణములు, అతని విష్ణూపాసనా విధానము, భగవంతుడు అతనికి సుదర్శనము ఇచ్చి అనుగ్రహించినటువంటి విధానము, అంబరీషుని యొక్క ఉత్తమోత్తమమైనటువంటి స్థితప్రజ్ఞత్వము, అటుపైన అంబరీషుని లోనికి భగవత్ సంకల్పంగా దిగి వచ్చినటువంటి ఒక సంకల్ప రూపంగా ద్వాదశీవ్రత నిర్వహణము, ఆ ద్వాదశీవ్రత నిర్వహణ సందర్భంలో మహాత్ముడైనటువంటి దుర్వాసుని యొక్క ఆగమనము, దుర్వాసుని యొక్క విశిష్టత, ఆయన ప్రత్యేకత, ఆ మహాత్ముని అంబరీషుడు అతిథిగా సత్కరించి, వ్రత పరిపూర్తి సమయానికి భోజనానికి ఆహ్వానించడం, ఆ ముని నీటిలో ధ్యాన నిమగ్నుడై, తనను తాను మరిచినటువంటి స్థితిలో ఉండిపోవడం, అది కారణంగా ద్వాదశీ గడియలు పరిపూర్తి అయ్యేటువంటి ఒక సమస్య, ఆ సమయమున పెద్దల రూపంలో ఉన్నటువంటి విష్ణుమూర్తి యొక్క సందేశాన్ని వినడానికి అంబరీషుడు తెలిసిన వారిని కర్తవ్యము గూర్చి విచారించడం, పెద్దలు కొంత ఆచమనం చేసి, నీరు తీసుకుని ఉపవాస దీక్షను విరమించవలసింది అని తెలియచెప్పడం, ఇంతవరకూ నిన్న సాయంత్రం నుంచి అంబరీషుడి రూపంలో ఉండే పరమభక్తుని యొక్క గుణగణాలన్నిటినీ కూడా విశేషంగా ఆరాధన చెయ్యడం జరిగింది.

తదుపరి ఘట్టము, అంబరీషునికి ఆ విధమైన ఉపాయం పెద్దలు అందించడం చేత...

"అని ధర్మసందేహంబు వాపిన నా రాజర్షిశ్రేష్ఠుండును మనంబున హరిందలంచి నీరు పారణంబు సేసి జలంబుల మనింగిన తపసిరాక కెదురు చూచుచున్న సమయంబున."

వారు ఈ విధంగా సలహా ఇచ్చినప్పుడు అది విష్ణువు యొక్క సందేశంగా భావించి, విష్ణువును మరొక్కమారు స్మరించి అంబరీషుడు నీరుగొని అటుపైన తపస్వి అయినటువంటి దుర్వాసుడి రాకకోసం ఎదురు చూస్తున్న సమయంలో...

"యమునలోఁ గృతకృత్యుఁడై వచ్చి రాజుచే
సేవితుండై రాజచేష్టితంబు
బుద్ధిలో నూహించి బొమముడి మొగముతో
నదరెడి మేనితో నాగ్రహించి
రెట్టించి యాఁకలి గొట్టు మిట్టాడంగ
నీ సంపదున్మత్తు నీ నృంశంసు
నీ దురహంకారు నిందఱుఁ గంటిరే
విష్ణుభక్తుఁడు గాఁడు వీఁడు నన్నుఁ

గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు
ధర్మభంగంబు సేసి దుష్కర్ముఁ డయ్యె
నయిన నిప్పుడు సూపెద నన్నిదిశల
నేను గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు."

ఈయన నీరు గొనిన తదుపరి క్షణంలో దుర్వాస మహర్షి, ఆ పరతత్వంతో నిండిపోయినటువంటివాడు, పరమధ్యానంలో మునిగినటువంటివాడు, మళ్ళీ తన స్పృహ తనకి కలిగి, రాజు సన్నిధికి చేరి, అతడు అందించినటువంటి సేవలన్నీ అందుకుని రాజుని చూస్తూ ఉంటాడు. అంబరీషుడిని చూచీచూడంగానే ఇతడు ఉపవాసం ఉపసంహరించాడు అనేటటువంటి ఒక భావన అతనికి కలిగింది. అంత మాత్రమే కాదు. అతడు జలములు తీసుకున్నాడు అని కూడా తెలుసు. దుర్వాసుడు ఎంతటి వాడో మనం చదువుకున్నాము. కాకపోతే, ధర్మశాస్త్రంలో నీరు తీసుకుంటే ఉపవాసం కొనసాగుతున్నట్టే అని ఒక భావన ఉన్నది. అలాగే, నీరు తీసుకుంటే అది ఉపవాసం ముగించినట్టుగా ఒక భావన ఉన్నది. అంచేతే, మనకి ఏకాదశి ఉపవాసాలు ఉండేటటువంటివారు నిర్జల ఉపవాసం ఉండడం కూడా ఉంటుంది. "ఉపవాసం నిర్జలం అండీ!" అంటారు. అంటే, నీరు కూడా తాగకుండా ఉపవాసం చేసేటటువంటివారు ఉన్నారు. నిజానికి అంబరీషుడు అలాగే నిర్వర్తించాడు.

అంచేతనే, నీరు తీసుకోవడం ఉపవాసాన్ని ఉపసంహరించినట్లు అవుతుంది. అంచేత, ఉపవాసం ఉపసంహరించాడా, లేక కొనసాగిస్తున్నాడా అనేటటువంటిది ఒక మీమాంస. అంచేత, దుర్వాసుడికి అది పొరపాటుగా తోచింది. పొరపాటులో పొరపాటుగా తోచిందని అనుకోవాలి. అతడు పొరపడడం వల్ల పొరపాటుగా తోచింది. అందుచేత, "*బుద్ధిలో నూహించి బొమముడి మొగముతో*" – మొహం చిట్లించాడు. బాగా

భృకుటి ముడివేశాడట. చిట్లించి, *"నదరెడి మేనితో నాగ్రహించి"* — కోపము వచ్చేసింది. రుద్ర తత్త్వము కదా, క్షణంలో వచ్చేస్తుంది! ఉదయం చెప్పినట్టుగా కోపం ఎవరికి వచ్చినా అది చాలా వేగంగా, ఆలోచించుకునేటటువంటి అవకాశం కూడా ఇవ్వనంత వేగంగా వచ్చేస్తుంది. అంత సులభంగా ఉండదు కోపం వచ్చినప్పుడు. అతడు తపస్వి అవ్వడం చేత, సాక్షాత్తు రుద్రస్వరూపుడు అవ్వడం చేత, అలా మితిమీరిన కోపం వచ్చేసరికి, దేహం అంతా కూడా కంపించిందండి. బాగా కోపం వస్తే రక్తప్రవాహ వేగం చాలా విపరీతంగా పెరిగిపోయి, ఒళ్లంతా కంపిస్తూ ఉంటుంది. ఆ తర్వాత శాంతించడానికి కూడా సమయం పడుతుంది. *"రెట్టించి యాఁకలి గొట్టు మిట్టాడంగ"* — అదొకటి తోడు! ఎంచేతంటే, ఆయనకి భోజనం వేళ ఆకలి వేస్తోంది. ఇది కూడా కొంత తోడయ్యిందన్నమాట.

*"సంపదున్మత్తు"* — కోపం వచ్చేసరికి ఏమయ్యిందంటే, ఒళ్ళు తెలియనంత కలిగింది. అతడు సంప్రాప్తశ్రీయుతుడైనటువంటి గుణవంతుడు. బ్రహ్మ అనుగ్రహం చేత సమస్తమూ తనవైపు ప్రాప్తింపబడి ఉన్నటువంటివాడు. *"మహావిభవసంపచ్చాతురి"* — సంపద ఎప్పుడూ సద్వినియోగం చేసినవాడే తప్ప, సంపద వల్ల దుర్వ్యాప్తి చెందినటువంటివాడు కాదు. *"వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్"* అంటూ చదువుకున్నాం కదా! ఈయన, *"సంపదున్మత్తు నీ నృంశంసు నీ దురహంకారు"* — చాలా ఉండకూడనంత అహంకారం ఉందన్నాడు. ఉండకూడదన్న అహంకారం ఎక్కడుంది? లేదు కదా! చూశారా ఇతడిని,

*"ఇందరు కంటిరే"*, మీరందరూ చూస్తున్నారా అతడు ఎంత దురహంకారుడో, ఎంత సంపదున్మత్తుడో? ఇతడు విష్ణుభక్తుడిగా చలామణి అవుతున్నాడు కానీ కాదు అని అన్నాడు.

*"విష్ణుభక్తుఁడు గాఁడు వీఁడు నన్నుఁ*
*గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు*
*ధర్మభంగంబు నేసి దుష్కర్మఁ డయ్యె..."*

ధర్మభంగం చేశాడు కాబట్టి ఇతడిని కర్మ చుట్టుకుంటుంది. తప్పు పని చెయ్యడం వల్ల బంధింపబడతాడు. *"నయిన నిప్పుడు సూపెద"* అని... నీకే కాదు, మొత్తం పది దిక్కులలో కూడా నేనేమిటో ఒక్కసారి చూపిస్తాను. మరీ బావుండడం లేదు ఈ ప్రపంచం, అర్థం చేసుకోవడం లేదు, పెద్దవాళ్ళని గౌరవించడం లేదు, ఇలాంటివన్నీ వచ్చేశాయన్నమాట. భ్రష్టుపట్టిపోతోంది. మనలను కాస్త సరిగ్గా చూడలేదన్న భావన చేత ఎన్నో మాటలు వచ్చేస్తుంటాయి కదా! ఎంచేతంటే, మనం పెద్దవాళ్ళన్న భావన చేత. మన గురించి మనకే భావనా లేకపోతే, ఇతరులకి ఏ భావన ఉన్నా అది మనకి సంబంధం లేదు. మాములుగా తన గురించి తనకి తాను పెద్దవాడన్న భావన ఉంటే, ప్రపంచం గుర్తిస్తోందా లేదా, ఒకటి. గౌరవిస్తోందా లేదా, రెండు. ఎప్పటికప్పుడు గౌరవిస్తూ ఉండాలి. పెద్దవాళ్ళు అనుకునే వాళ్ళని గౌరవించకపోతే వాళ్ళు నీలుగుతూ ఉంటారు. అందరికన్నా పెద్దవాడు ఎవరు? ఒకడే పెద్దవాడు. అతడు లీలావిలాసంగా ఒక్కొక్కరు ఒక్కొక్కప్పుడు "అగ్ర" అనబడతారు. ఒక్కొక్కడిని ఒక్కొక్కప్పుడు పట్టించుకోరు.

మనం చాలా పెద్ద important అనుకుని వెళ్తే, అక్కడ ఎవరూ పట్టించుకోలేదనుకోండి, ఎట్లా ఉంటుంది? మండిపోదూ? ఎక్కడో మండుతుంది! దాంతో మొత్తం వికారంగా తయారవుతారు. అటుపైన ఏవో మాటలు, విమర్శలు, నిందలు, ఇటువంటివన్నీ చేస్తూ ఉంటారు.

అంచేత, ఎలా వచ్చిందిట? నేను చూపిస్తాను వీళ్ళందరికీ – *"సూపెద నన్నిదిశల"*. ఒక్కసారి, I want to show, అంటూ ఉంటాడు! *"సూపెద నన్నిదిశల నేను గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు."* అది! నేను కోపింప... అంటే నేను కోపించి ఏదయినా చేస్తే దానికి అడ్డువచ్చేవా డెవడయినా ఉన్నాడేమో చూస్తానని చెప్పి, అంతవరకూ రెచ్చిపోయాడు. రెచ్చిపోవడానికి లోపల... మనం మాములుగా ఏం చేస్తామంటే కొంతమంది మనమే మంచివాళ్ళని దూరం చేసుకుంటూ ఉంటాము. మంచివాడిని మంచివాడుగా చూస్తుంటే సరిపోతుంది. చాలా ఎక్కువ గౌరవం చేస్తున్నారనుకోండి, వాడికది అలవాటయిపోతుంది కదా! మాములుగా స్టేషనులో దిగి, పెట్టె పట్టుకుని వచ్చేస్తే గురుపూజలకి, ఏం ఇబ్బంది ఉండదు. ముందు స్టేషన్ నుంచి కాఫీ, ఫలహారాలు, పూలు, పళ్ళు, ఇలా అలవాటయిపోయాయనుకోండి, ఒక్కోసారి దైవం మనకి ఎవడినీ పంపించడు, చూద్దామని! స్టేషనుకి కూడా ఎవరూ రారు. ఎప్పుడు రారంటే నువ్వు బాగా సామాను తెచ్చుకున్నప్పుడు రారు. ఎంచేతనంటే, ఉంటారు వీళ్ళంతా అని నీకు ధీమా! స్టేషనులో కూలీలు ఉన్నా, వీళ్ళు కూడా ఉంటారు కాబట్టి, ఒకటి, రెండు extra తెచ్చుకుంటూ ఉంటారు. మోస్తారు

కదా! అలా వాడికి అలవాటు చేశారు. ప్లాట్ఫారం మీద దిగంగానే కాఫీ ఇచ్చేసి, అక్కడే టిఫిన్ పెట్టేసి, మళ్ళీ ఇంటికి తీసుకొచ్చి, ఏవో కాళ్ళు కడిగేసి, పూజలు చేసి ఇలా అలవాటయిపోయిందనుకోండి, చాలా ఇబ్బంది కదా! అభ్యాసం పూర్తిగా అందులో దించిన తర్వాత, ఎవడూ రాలేదనుకోండి, ఎలా ఉంటుంది? మొన్నే ఎక్కడో చెప్పాను – చాలా expectations taken for granted గా తీసేసుకుంటాడు. పూర్వకాలంలో అల్లుడులాగా! అల్లుడు స్టేషనుకి వస్తే, బావమరిది కారు తెచ్చాడా లేదా? కారు తెస్తే, పెద్ద కారు ఉంటే చిన్న కారు తెచ్చాడా? ఇలా మొదలయిపోతుంది. ఇవన్నీ ఎందుకొస్తాయి? అందరూ అలా అలవాటు చేయడంవల్ల.

తపోధనుడు కదా! ఆయన సంగతి వదిలెయ్యండి. మన సంగతి చూడండి. మన పెట్టె మనం మోసుకుంటే ఉత్తమం. స్వావలంబనే తప్ప మరొకటి లేదు. నీమీద నువ్వు ఆధారపడడమే. అది యోగం. తన మీద తను ఆధారపడడం. తను ఎప్పుడూ భగవంతుడికి సమర్పితంగా కొంచెమై ఉండాలి. భగవంతుడు నీలో నిండి ఉంటే, నువ్వు కొంచెమై ఉండాలి. నువ్వు బాగా పెరిగిపోతే నీలో భగవంతుడికి చోటు చాలా తక్కువ ఉంటుంది. ఇలాంటి వాళ్ళకే ప్రతిచోటా అవమానం జరిగినట్టుగా ఉంటుంది. అంటే, ఎక్కడికెళ్తే అక్కడే అవమానం అన్నట్టుగా అనిపిస్తుంది. దుర్యోధనుడుకి కూడా అదే కదా బాధ! దుర్యోధనుడు కూడా అతడు దురభిమాని అవ్వడం చేత అంత భయంకరంగా తీసుకున్నాడు కాని రాజసూయంలో ఆ సన్నివేశం అంత భయంకరంగా, ఇలాంటి బాధతో వచ్చినటువంటి అవమానం ఏ మాత్రం లేదే!

ఉందా? దురభిమానం. ముక్కు, చెవులు కోసేస్తే శూర్పణఖకి మళ్ళీ వస్తాయి తెలుసా! అవన్నీ మాయా రూపాలు. ఇంతకన్నా మంచి రూపాలు వస్తాయి. దురహంకారం, దురభిమానం. ఈ దురభిమానం ఆసురీ భావన ఉండేవాళ్ళకే కాదు, దైవీ భావన ఉండేవాళ్ళకీ ఏర్పడుతుంది.

ప్రస్తుతం దుర్వాసుడికి దురభిమానం ఏర్పడిందన్నమాట. *"జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హిసా బలాదాకృష్య మోహాయ మహామయా ప్రయచ్ఛతి"* – మహామాయ. ఆ మాయ కేవలం అంతర్యామి కనుసన్నల్లో ఉంటుందిట. త్రిగుణాత్మకమైనటువంటి సృష్టిలో ఏ జీవుడు కూడ మాయని దాటలేడు. ఎంత బ్రహ్మవిదుడైనా సరే అప్పటికప్పుడు మాయ కమ్మడం చాలా సహజంగా జరుగుతుంది. బ్రహ్మవిదుడికి మాయ కలిగితే, దాని వల్ల ఒక పొరపాటు జరిగితే, ఆ పొరపాటు వల్ల జగత్ కల్యాణమైన ఒక ఘట్టం జరుగుతుంది. అలాగే, ఒక దుష్టుడికి, ఆసురీ స్వభావం కలిగినటువంటివాడికి మాయ కమ్మితే, దాని వల్ల పెద్ద జగత్ కల్యాణం ఏమీ ఉండదు – జననష్టం, ప్రాణనష్టం, ధననష్టం కలుగుతుంది. అంచేత, మహాత్ములు సైతం, *"జ్ఞానినామపి చేతాంసి"* – జ్ఞానులైనటువంటి వారు, పూర్ణచైతన్యవంతులు కూడా బలవంతంగా లాగబడతారండి, మాయ చేత. నేను మాయని దాటాను అని ఎవరూ అనుకోవడానికి వీలులేదు. అలా అనుకున్న క్షణంలోనే మాయ కమ్ముతుంది. *"మమ మాయా దురత్యయా"* అని కృష్ణుడు చెప్తాడు. "నా మాయ" – ఎందుకంటే, సృష్టిలో ఆ ప్రాతిపదికే లేకపోతే, నేను, ఇతడు అనేది ఏర్పడదు.

అలా ఏర్పడకపోతే సృష్టి కథే లేదు, జీవుల పరిణామ కథా లేదు, జీవులు పరిపూర్ణం అవ్వడమూ లేదు. ఇవన్నీ కావాలి కాబట్టి దాన్ని ఆ విధంగా ఏర్పాటు చేశారు.

రామాయణంలో అటువంటి మాయ మనకి అప్పుడప్పుడూ గోచరించింది. కైకేయి ఒక్క రాత్రి మాయలో పడిపోయింది. ఒక్క రాత్రే! ఆమె నిజానికి కౌసల్య కన్నా ఎక్కువ ప్రేమ కలిగినటువంటిది. రాముడిని కన్నది కౌసల్య అయినా, రాముడిని ఎక్కువగా పెంచినది కైకేయే. రాముని గారాబం అంతా కూడా కైకేయి దగ్గరే తీరుతూ ఉంటుంది. రాముని చూడని క్షణం కైకేయి ఆనందంగా ఉండలేదు. అలాంటి భక్తి కలిగినటువంటిది, ప్రేమ కలిగినటువంటిది, మాయ కమ్మలేదా? కమ్మింది. సీతమ్మవారికి మాయ కమ్మలేదా? కమ్మింది. కైకేయికి హితవు చెప్పేవాళ్ళెవ్వరూ లేకపోయారు. పైగా ఆ భావన స్థిరపడేంతవరకూ మంథర బానే పనిచేసి పెడుతుంది. మంథర రూపంలో వచ్చింది మాయే. రామాయణంలో వాల్మీకి మహర్షి రాస్తాడు, “ఎక్కడ పుట్టిందో, ఎక్కడినుంచి వచ్చిందో, ఎట్లా చేరిందో అయోధ్యలో మంథర?” అని. దిగి వచ్చింది. మంథర అమ్మ ఎవరో చెప్పండి? నాన్న ఎవరో చెప్పండి? అంత insignficant creature లాగా ఉన్నటువంటిది. ఏమీ కానటువంటి ఒక జీవి, ఒక రోజు సాయంత్రం మొత్తం భూమికి ప్రళయాన్ని తీసుకొచ్చేటువంటి ఒక భావానికి వాహిక అయ్యిందండి. తప్పు మంథరదా? కాదు. భగవత్ సంకల్పం. మరి సీతమ్మ వారికి మాయ కలగలేదా? లక్ష్మణస్వామి చెప్తూనే ఉంటాడు. ఇలాంటివి ఉండవు వదినా అని చాలా స్పష్టంగా

చెప్తాడు. మనం ఉంటున్న ప్రదేశం అంతా కూడా రాక్షసులు సంచరించేటటువంటి ప్రదేశము. ఇది రాక్షస మాయ తప్ప మరొకటి కాదు. సృష్టిలో నువ్వు చెప్పిన, నువ్వు తలుస్తున్నటువంటి ఇలాంటి జింక లేదంటాడు. లేదంటే లేదంటాడు. "ఆ! నేను చూశాను గాబట్టి ఉంటుంది. నువ్వు లేదంటే ఎట్లా?" అంటుంది. "నువ్వు చూసింది మాయ", అంటాడు. చూసింది మాయ అంటే నాకు మాయేంటి అని ఒప్పుకోదు. అదే మాయ! అయిపోయింది కదా! ఇలా ఎన్ని జరగలేదండి!

పొద్దున్నే చెప్పాను – త్రిమూర్తులలో శివుడికి మాయ కమ్మిన సందర్భం ఉంది. త్రిమూర్తులలో విష్ణువుకి మాయ కమ్మిన సందర్భాలు ఉన్నాయి. త్రిమూర్తులలో బ్రహ్మదేవుడి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆయనే చాలాసార్లు రాసేసుకున్నాడు భాగవతంలో. వాళ్ళూ వీళ్ళూ చెప్పేదేంటి? నేనే చెప్పుకుంటాను అన్నాడాయన. అసలు సృష్టి ప్రారంభంలోనే రకరకాలుగా ఆయనకి మాయ కమ్ముతుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే సృష్టిలో త్రిగుణములు ఏర్పడిన తర్వాతే త్రిమూర్తులు ఏర్పడ్డారు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు మహాచైత్యనం నుంచి ఏర్పడిన తర్వాత త్రిమూర్తులు కూడా ఏర్పడ్డారు. వారి పట్టపు మహిషులు, అంటే వారి స్వభావములు, పొద్దున్న చెప్పినట్టుగా, లక్ష్మి, పార్వతి, సరస్వతులు అంటారు. వారు కూడా త్రిగుణములు ఏర్పడిన తర్వాత ఏర్పడిన వాళ్ళే. దానిపైనుండేటటువంటి చైతన్యం, ఇందాక చెప్పినట్లు, జగన్మాత, అదితి, గాయత్రి, సావిత్రి. వారికి త్రిగుణములు అంటవు. ఆ వెలుగుకి ఆధారమైన తత్వానికి

త్రిగుణములు అంటవు. వారే తల్లితండ్రులు. ఆ తత్త్వము నుండి వెలుగు ఏర్పడి, వెలుగు నుండి త్రిగుణములు ఏర్పడతాయి. తెరమీద వెలిగిన తర్వాత బొమ్మ పడుతుంది. అక్కడినుంచే కథ. ఆపైనంతా అది ఏకత్వమే. అంచేత, ఆ త్రిగుణములకు లోబడి జీవులంతా ఏర్పడతారు. త్రిగుణాత్మకమైన సృష్టి కాబట్టి, బ్రహ్మదేవుడికైనా, విష్ణుదేవుడికైనా, రుద్రుడికైనా మాయ కమ్మే అపాయము ఉన్నది. సనకసనందనాదులకి మాయ కమ్మలేదూ? వారు ఈ సృష్టి కల్పానికి ముందే బ్రహ్మత్వము పొందినటువంటివారు. సృష్టి నిర్వహణకి తోడ్పడానికి వచ్చినటువంటి వారు. చతుర్ముఖ బ్రహ్మకి కూడా తెలియనటువంటి కొన్ని రహస్యములు తెలిసినటువంటివారు. సామాన్యులు కాదు. మరి వారికి మాత్రం మాయ కమ్మలేదా? కమ్మింది. అంతా విష్ణువే అనుకుంటూ వెళ్తూ సరిగ్గా ద్వారం దగ్గర అడ్డుపడితే జయవిజయులను చూస్తారు. అంతవరకూ అన్నిటా విష్ణువునే చూసి, అక్కడ జయవిజయులను చూస్తారు. జయవిజయులే అని చూస్తే వాళ్ళింకా గట్టిగా జయవిజయులుగానే కనిపిస్తారు. విష్ణువుగా చూడరు. ఆ కథంతా మనకి తెలుసు. వీళ్ళు కోపించడం, విష్ణుమూర్తి శాంతింపచేయడం. ఆయన సనకసనందనాదులను తిట్టీతిట్టనట్టుగా తిట్టడం, చివాట్లు పెట్టడం... బాగా చివాట్లు పెడతాడు. అప్పుడు మాయలో పడ్డామని అనుకుంటారు సనకసనందనాదులు. సప్తర్షులకి కూడా అలాంటి పరిస్థితి ఉంటుంది. గౌతముడు మాయలోకి వెళ్తాడు. కోడి కూస్తే తెల్లవారిందనుకున్నాడు. అనుకుంటాడా అంత పెద్ద ఋషి! అనుకుంటే ఎట్లా? అలాగే దుర్వాసుడు.

మాయ రెండు రకాలుగా అర్థం చేసుకోవాలి – ఒకటి, లీల; రెండు, శిక్షణ. దుష్టశిక్షణకూ మాయే. శిష్టుడిని బాగా శక్తిమంతుడిగా కూడా ఒక మాయలో ఉంచి పైకి తీసుకొస్తుంది. ఒక మునక వేస్తే గానీ పూర్తిగా తేలం, తరించం! అంచేత, దుర్వాసుడు ఎక్కడికెళ్ళినా మరి అడ్డులేని స్వభావం కలవాడని అందరూ గౌరవిస్తారు. ఇలా గౌరవించేవాడికి క్రమంగా తెలియకనే లోపల చిన్న అహంకారం వస్తుంది. అందుకనే, చెప్తూ ఉంటాను మనవారందరికీ కూడా. మన చుట్టూ సహాయం చేసే వాళ్ళు చాలామంది ఉన్నా మన పని మనమే చేసుకుంటూ ఉండాలి. వాళ్ళు కోరి సహకరిస్తుంటే కాదనకూడదు. అలా అని వారి సహకారంకోసం ఎదురు చూడకూడదు. అదీ యోగం! ముందుగానే అందరి సహకారం కోరి, దాన్ని ఒక ఆశగా పెట్టుకుని పని చెయ్యకు. మనకిగా మనం, ఏమిటి నీ బలం అంటే నీ లోబలమే నీ బలం. Do it yourself అని చెప్పి మనకో వాక్యం ఉంది. Nike shoe సందేశంగా వాళ్ళు చాలా చోట్ల 1980 లో అది వాడేవారు. ఆయన కలిసొస్తే చేస్తాను, ఆవిడ కలిసొస్తే చేస్తాను, అట్లా చెయ్యడం చెయ్యడం కాదు. అప్పుడు చంకల్లో కర్రలు పెట్టుకుని నడిచినట్లుగా ఉంటుంది. నీకు నువ్వే బలం. ఏమిటి నీ బలం? నీ లోబలం. నీ లోబలమే నిన్ను రక్షిస్తుంది తప్ప నీ బయట బలం నిన్ను రక్షిస్తుందని అనుకోకూడదు. సహాయంగా రావచ్చు. లోబలం ఉండేటటువంటివారు బయట సన్నివేశాలని ఎరుకతో ఎదుర్కొంటారు. లోబలం లేదనుకోండి, విలవిల లాడిపోతారు. మన వైఫల్యాలకి ఎవరెవరు కారణాలో అంతా list రాసుకుంటూ ఉంటారు. మన వైఫల్యాలకి నిస్సందేహంగా మనమే కారణం.

మన విజయాలకి నిస్సందేహంగా మనమే కారణం. ఎప్పుడు? నీవు లోపల ఉండేటటువంటి దైవముతో ముడిపడి నిర్వర్తిస్తూ ఉంటే అతడే బలం. *''బల మెవ్వడు కరిబ్రోవను, బలమెవ్వడు పాండు సుతుల భార్యను గావన్, బలమెవ్వడు రవి సుతునకు, అట్టి నీవే నాకు బలమౌ కృష్ణా!''* అని చిన్నప్పుడు శతకం నేర్పారు కాబట్టి యిలా బ్రతికి బట్టకడుతున్నాం. గుర్తుంచుకోండి, బహిరాలంబనం మనిషిని బలహీనుని చేస్తుంది. అంతరాలంబనం బలవంతుని చేస్తుంది. అంతరంగమందలి ఈశ్వరాలంబనం పూర్ణబలవంతుడిని చేస్తుంది. అట్లా నా బలం నువ్వే అని చెప్తూ ఉంటాం. లోబలమే బలం తప్ప బయట బలం బలం కాదు. అట్లా బహిరంగం మీద ఆధారపడిపోతున్నకొద్దీ అవశుడైపోతూ ఉంటాడు జీవుడు. అంతరంగం మీద ఆధారం పెంచుకుంటున్నకొద్దీ సమర్థుడైపోతూ ఉంటాడు. *''నిరాలంబా''* అని మనం నామం చదువుతాము అమ్మవారి లలితా సహస్రనామాలలో.

మాస్టరుగారు పూజలు చేసే రోజుల్లో అంత పెద్ద సహకారం ఏం అందేది కాదు చుట్టుపక్కలనుంచి. కబుర్లు చెప్పేవాళ్ళు, మందులు వేయించుకునేవాళ్ళు, పనులు చేయించుకునేవాళ్ళు తప్ప, సహకారం అందించేవాళ్ళు తక్కువ. అంటే, వచ్చే వాళ్ళందరూ వాళ్ళకేం కావాలో వాళ్లకి తెలుసు తప్ప మాస్టరుగారికేం కావాలో తెలిసినవాళ్ళు తక్కువగా ఉంటారు. అసలు లేరని నేనను. అంచేత, ఎప్పుడన్నా ఇంటికి వెళ్తే పొద్దున్నే, ప్రార్థన అయిపోయిన తర్వాత, మనలాంటి వాళ్ళు వస్తే మాట్లాడుతూ ఆయనే దీపంలోకి వత్తి ఎక్కించుకుంటూ

ఉండేవారు, "ఏరా! ఇట్లా వచ్చావు?", "ఏమిటోయ్ పని?" అంటూ. అవసరం అయితే వత్తి కూడా తయారు చేసుకునేవారు. తయారుచేసి దీపంలోకి ఎక్కించుకునేవారు. నూనె పోసుకునేవారు. దీపం పెట్టుకునేవారు. ''ఎవడో వస్తాడని చూస్తామా? నువ్వు ప్రార్థన చేసుకుందామనుకుంటే నువ్వు చేసుకోవడమే. ప్రార్థన చేద్దామన్న భావన నీది కాబట్టి. దీపం పెట్టాలన్నా భావన నీదే కాబట్టి నువ్వే ఏర్పాటు చేసుకో. చేతులు ఇచ్చాడుగా దేవుడు!'' అనేవారు. ఆయనతో ఎప్పుడు తిరుగుతున్నా... ఇదివరకూ కూడా చెప్పాను. చూశారుగా ఎట్లా ఉండేవాడినో నేను! ఓ పది పెట్టెలు మోసెయ్యడానికి వీలుగా ఉండేవాడిని! రెండే పెట్టెలు ఉండేవి – నా పెట్టె, ఆయన పెట్టె. నేను పట్టుకునే లోపలే ఆయన గభాలున ఆయన పెట్టె ఆయన పట్టేసుకునేవారు. "ఎందుకు మాస్టారు? నేను పట్టుకుంటాను కదా? మీరెందుకు అలా?" అంటే, "అలాగే పట్టుకో" అని ఇచ్చేసేవారు. ఒకసారి అడిగాను, "ఎందుకట్లా చేస్తున్నారు మీరు?" అని. అంటే, "ఇందులో రెండున్నాయోయ్!" అని చెప్పారు. "ఒకటేమిటంటే, ఎప్పుడూ నువ్వు పక్కన ఉంటావనుకోలేము కదా! రెండు, ఎప్పుడూ పట్టుకోవాలని నీకు అనిపించాలని rule ఏముంది?" అన్నారు. "నా పెట్టె పట్టుకోవాలని నీకు ఎప్పుడూ అనిపించాలని సిద్ధాంతం ఉందా?" అని అడిగారు. "నీకు ఒక రోజు పట్టుకోవాలని అనిపించలేదనుకో, దాని సంగతేంటి? నా సంగతేంటి?" అన్నారు. ఆయన అంత అప్రమత్తంగా ఆయన పనుల విషయంలో ఉండేవారు. తలవంచుకొని మన పని మనం చేసుకుంటూ వుంటే లోకం నీ జోలికి రాదు. నీవు వచ్చిన పని నిశ్శబ్దంగా పూర్తి చేసుకోవచ్చు.

చప్పుడు చేస్తూవుంటే అందరి దృష్టి నీ మీద పడుతుంది. అపుడు పని పాడవుతుంది. ఒక మనిషి ఎంత పని అయినా చేయవచ్చు, ఎన్ని పనులనైనా చెయ్యవచ్చు. ఎప్పుడు? మౌనంగా, వృథా కాలయాపన కాకుండా, తలవంచుకు పనిచేస్తుంటే. అదే మనకు మహాత్ములు నేర్పేది. పై తెలిపిన మూడు గుణములకు వినయంకూడ తోడైతే అంతా సవ్యంగా సాగుతుంది. *"కొండ అద్దమందు కొంచెమై ఉండదా విశ్వదాభిరామ వినురవేమ"*.

చుట్టూ ఉండే మనుషులే వాళ్ళు తెలియక ఎన్నో రకాలుగా ఒక మంచివాడిని వికారంగా తయారుచేసి పెడతారు. మరోలా జరిగిందనుకోండి, ఇలా అవుతుంది. ఒక్క నిమిషం ఆగుతాయి కొన్ని స్టేషన్లలో బండ్లు కదా! "మాస్టరుగారు! మీరు మా స్టేషను మీదుగా వెళ్లిపోయారట. మాకు చెప్పలేదు" అని అంటారు. ఎంత ప్రయత్నం ఒక్క నిమిషం కోసం? అప్పటికే కాఫీ పట్టుకొచ్చి, పరిగెత్తుకుంటూ వచ్చి... మన రైలు అటుపక్క ఆగుతుందంటే అది ఇటుపక్క ఆగి, అక్కడినుంచి పరిగెత్తుకు వచ్చి... ఎప్పుడూ పరిగెత్తడమే సావిత్రమ్మగారు రాజమండ్రిలో! ఎందుకంటే, రాజమండ్రిలో బోర్డులు ఎప్పుడూ ఆవిడ కోసమే అన్నట్టు, నా compartment ఇటుంటుందంటే అది అటు వస్తుంది! అది అటు వస్తుందంటే ఇటు వస్తుంది! అందుకని, కూలీలని అడగకండి, నన్ను అడగండి అనేవాడిని! "మీరు చెప్పరు కదా వస్తున్నట్టు!" అనేవారు. ఆ ఒక్క నిమిషం కోసం పదిమంది రకరకాలుగా అన్నీ తయారుచేసుకుని పువ్వులు, పళ్ళు, కాఫీ, టిఫిన్లు. పరిగెత్తి వచ్చి నీకిస్తే, నువ్వు ఎలా భావించాలి? నేను

ఎప్పుడూ చిన్నవాడిని అయిపోతాను. నువ్వు ఇతరులకు చేస్తావా అట్లా? అలా ప్రశ్నించుకోవాలి.

చిన్నచిన్న వాళ్ళకే ఇలా అహం వస్తుంటే ఆయనేంటండి, దుర్వాసుడు? ఎంతటి వాడు? ఎటువంటి దంపతి నుండి దిగివచ్చినవాడు? పొద్దున్న చెప్పుకున్నాం. ఎంతటివాడు? అలా స్మరణమాత్రం చేత అలా పరమాత్మతో అనుసంధానం చెంది పరమై, అందులో మునిగిపోయేటటువంటివాడు కదా! అలాంటి వాడితో తెలిసినవారు గాని, చక్రవర్తులు గాని అప్రమత్తంగా ఉన్నారుట, పొగిడారట, భయపడుతూ వినయంగా ఉన్నారట అంటే ఆశ్చర్యం లేదు. కానీ ఈ లోపల ఆయన లోపల చూడండి ఎలా మారుతూ ఉంటుందో తత్త్వం! తత్త్వం మారుతూ ఉంటుంది. ఆ మారడం చేత ఇలా చేశాడండి. మాయ కమ్మింది. కమ్మి, ఎంత మాట అన్నాడండి ఆయన?

*"... సూపెద నన్నిదిశల నేను గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు."* అంతవరకూ వెళ్ళిపోయింది.

"పెటపెటఁ బండ్లు గీటుచును భీకరుఁడై కనుఁగ్రేవ నిప్పుకల్
పొటపొట రాల గండములు పొంగ మునీంద్రుఁడు హుంకరించుచున్
జటమొద లంటఁగాఁ బెఱికి చక్కన దానవ కృత్య నాయుధో
త్కటవరశూలహస్తయుతఁగా నొనరించి కవించె రాజుపై."

పటపటా పళ్ళు కొరికాడండి. పళ్ళు అలా ఉన్నాయండి మరి! మనం పటపటా పళ్ళు కొరికితే ఊడి కింద పడిపోతాయి

కదా! రావణాసురుడు పళ్ళు పటపటా కొరికాడట. ఎట్లా కొరుకుతారో నాకు అర్థం కాదు! మనకి చప్పుడు కూడా చూపిస్తూ ఉంటారు సినిమాల్లో వాళ్ళు కొరుకుతూ ఉంటే! వాళ్ళేం కొరకరు, వీళ్ళే చప్పుడు చేస్తుంటారు. పాత్రధారి మనలాంటి వాడే కదా! ఆ విధంగా పటపటా పళ్ళు కొరికాడండి. భీకరుఁడై, కన్నులు ఎఱ్రగా అయిపోయాయట. అవి అట్లా ఉన్నాయంటే అందులోంచి, *"నిప్పుకల్ పొటపొట రాల"* – నిప్పులు కురుస్తున్నట్టు ఉందట. నిప్పులు కురిసేటట్టుగా చూస్తున్నాడండి. *"గండములు పొంగ"* – చూశారా! ముఖ కండరాలు చింపుకున్నారంటూ ఉంటారు కదా అట్లా చింపుకున్నాడట. సరే! ఇవన్నీ నాటకీయంగా ఉంటాయి బాగా. ఎందుకంటే, మనం ఆ సన్నివేశంతో బాగా అనుసంధానం చెందడం కోసమే ఈ వర్ణన. ఆయనకి కోపం వచ్చింది, పీకాడు, నాలుగు కొట్టాడంటే అంతలా రాదు కదా! వెంట్రుక పీకాడు, నేలమీద కొట్టాడు. అందుకని అట్లా! సినిమా వెయ్యకుండా ఆ దృశ్యం మనకి కనబడాలంటే, ఇలా వర్ణన వల్ల కనబడుతుంది. అందువల్ల, *"జటమొద లంటఁగాఁ బెఱికి"* – ఇలా పీకితే వచ్చేసింది. *"హుంకరించుచున్ జటమొద లంటఁగాఁ బెఱికి చక్కన దానవ కృత్య నాయుధో"* – ఆయుధాలతో కూడినటువంటి ఒక దానవ కృత్యను... అంటే దాని పనే అది. దానవ కృత్యను ఒకదాన్ని సృష్టించాడు. ఆయుధాలతో సహా వచ్చేసిందింట అప్పటికప్పుడు. ఆయనేమో ఉస్కో అన్నాడన్నమాట. *"కవించె రాజుపై"* అంటే, వెళ్ళు వాడి సంగతి చూడు అని.

"కాలానలసన్నిభయై
శూలాయుధహస్త యగుచు సుఱసుఱ స్రుక్కన్
నేలఁ బదంబులఁ ద్రొక్కుచు
వాలి మహాకృత్య మనుజవల్లభుఁ జేరెన్."

పుట్టంగానే ఆకాశంలోకి ఆ మహాకృత్య ఎగిరి హాహాకారాలు చేస్తూవుంది. నేలపైనున్న అంబరీషుని చూపించాడు ముని. వెంటనే ఆ మహాకృత్య త్రిశూలంతో అంబరీషుని మీదకు దూకుట కుద్యుక్త అయింది.

"ఆ ప్రకార మెఱిఁగి హరి విశ్వరూపుఁడు
వెఱ్ఱితపసి సేయు వేడబంబుఁ
జక్కఁబెట్టు మనుచుఁ జక్రంబుఁ బంచిన
వచ్చెనదియుఁ బ్రళయవహ్నిపగిది."

ఏదీ ఇంత తపోధనుడు... అంతకు ముందు పోతన ఏమన్నాడండి?

*"భాసుర నిగమపదోప*
*న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమయోగా*
*భ్యాసుఁడు రవిభాసుఁడు దు*
*ర్వాసుఁ డతిథి యయ్యెఁ దన్నివాసంబునకున్."*

అలా పొగిడాము కదా! కొన్ని ముహూర్తాలు అయ్యేసరికి వెఱ్ఱివాడయిపోయాడంటే, అంతటి వాడు వెఱ్ఱివాడయిపోవడ

మేమిటండి, ఆలోచించండి. నడచి వస్తుంటే సూర్యుడిలాగా ఉంటాడట. పలుకుతుంటే ఉపన్యాసమే వేదమట. న్యాసము, ఉపన్యాసము చెప్పుకున్నాం కదా! మరి తపస్సు అంటారా, ఊరంతా వేడెక్కి పోతుంది ఆయన తపస్సు చేస్తే. అంతటి వాడు. ఆయన గురించి అంతర్యామి అయిన భగవంతుడు ఇలా వెఱ్ఱివాడిగా చెప్తున్నాడు. అది కాలానలం వలె వస్తే, ఇది (సుదర్శన చక్రము) ప్రళయంలాగా వచ్చేసిందిట.

**"వచ్చి మునిపంచిన కృత్యను దహించి తనివిసనక మునివెంటంబడిన మునియును మేరుగుహ సొచ్చిన నదియు వ్యాళంబు వెనుకొను దవాన లంబుచందంబునఁ దోన సొచ్చె మఱియును."**

ముందు వచ్చి ఆ మహాకృత్యను సుదర్శనం కొట్టేసింది. ఎందుకంటే, ఆయన చేస్తున్నటువంటి వికారాలు కొంచెం సరిదిద్దు అన్నాడు తప్ప మునిని సంహరించమనలేదుగా! అన్నడా? మునిని సంహరిస్తారా? సంహరించరు. మంచి వాడే కదా! చిన్న వెఱ్ఱి వచ్చిందంతే. కాసేపు, temporary గా వెఱ్ఱివాడయిపోయాడు. అంచేత, వికారమైన కార్యాలు చక్కబెట్టు అన్నాడు తప్ప, సంహరించమనలేదుగా! అదే గజేంద్రమోక్షంలో అయితే ''చంపేయ్ దాన్ని'' అన్నాడు కదా! *"భీమంబై తలఁద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్"* అంటాడు. క్షణంలో కొట్టేస్తుంది. వెయ్యి సంవత్సరాలు ఇంత పెద్ద గజేంద్రుడు కుస్తీ పట్టినా, పిలవంగానే చక్రం ఆశువుగా చంపేసిందిట ఆ మకరాన్ని.

అలాంటిది ఇక్కడ వెళ్ళింది, మహాకృత్యని దహించేసింది. దహించేసి, అంతటితో ఆగలేదు. చక్కబెట్టాలి కదా! అంటే, world goodwill work అంటారే, అదే ప్రపంచానికి శ్రేయస్సు కలిగించేటట్టుగా పని చెయ్యాలి కదా! చక్రం కదా! ధర్మచక్రం, కాలచక్రం.

# సుదర్శన చక్రము

పొద్దున్న చెప్పుకున్నాం చక్రం ఎలా ఉంటుందో. అట్లా పట్టుకుని కూర్చోడు అని చెప్పాను కదా! సృష్టి ప్రారంభంలోనే దాని పని అది మొదలుపెడుతుంది. దానియందు భూతము, వర్తమానము, రెండిటికీ సంబంధించినటువంటివి ఉంటాయి. మనం కూడా accounts లో previous year, current year అని వేసుకుంటూ ఉంటాము. Previous year మాత్రమే కాదు, previous మొత్తం. పాత అంతా. All previous and current. అంతవరకూ ఉండే account తేల్చి నీకు ఫలం ఇస్తుంది చక్రం. అంచేత, ఏమీ previous లేనటువంటి స్థితిలో ఉంటే అక్కడ account settle అయిపోతూ ఉంటుంది. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అయిపోతాయండి, ఎప్పటికప్పుడు accounts settled up. Right angles erected, wrong angles adjusted. ఇట్లా ఉంటుంది. అదృష్టవంతుడు భగవద్భక్తుడు. భగవద్భక్తుడికి ఎప్పటికప్పుడు సద్యోఫలితంగా corrections చేసేస్తాడండి. ఎప్పటికో postpone చేసి, పేర పెట్టి, ఇంత లప్పం మీద పడెయ్యడు. అప్పటికప్పుడు సద్యోఫలితం. “Karma is neither postponed, nor purged but neutralised” అన్నారు మాస్టర్ సి.వి.వి.గారు.

అంచేత, ఈయన వెంటబడితే ఈయనేమో పెద్దగుహలో దూరిపోయాడట. గుహలో దూరితే ఊరుకుంటుందా? అదీ గుహలో దూరుతుంది. ఎట్లా దూరుతుందంటే దావానంలా దూరిందట. అంటే, లోపలికెళ్తే ఇంక ఎటుపక్కనా చోటుండదు. అన్ని పక్కలనుంచీ కమ్ముకుంటూ వచ్చేస్తుంది. అప్పుడేం చేస్తాడంటే, *"భువిఁ దూఱన్ భువిఁ దూఱు"* – భూమిలోకి వెళ్ళిపోయాడట. ఉన్నాయి కదా సిద్ధులు ముని దగ్గర! అన్ని రీతుల్లో ఉన్నాయి. దానికన్నా మించి విద్యలు అక్కడ ఉన్నాయి – అది సుదర్శనం కదా!

"భువిఁ దూఱన్ భువిఁ దూఱు నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు నుద్వేగియై
దివిఁ బ్రాఁకన్ దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ జి
క్కి వెసం గ్రుంగినఁ గ్రుంగు నిల్వ నిలుచుం గ్రేడింపఁ గ్రేడించు నొ
క్కవడిన్ దాపసువెంట నంటి హరిచక్రం బన్యదుర్వక్రమై."

ఇంక లాభం లేదని భయపడిపోయి నీళ్ళలో దూకేశాడట. దూకేస్తే అదీ దూకుతుంది. *"నిల్వ నిలుచుం"* – ఈయన ఆగితే అది ఆగిందట. అంటే, భయపెడుతోంది తప్ప ఏం చెయ్యట్లేదు కదా! భయపెడుతోంది. *"నిల్వ నిలుచుం గ్రేడింపఁ గ్రేడించు"* – పరిగెడితే పరిగెడుతోంది. *"నొక్కవడిన్ దాపసువెంట నంటి హరిచక్రం బన్యదుర్వక్రమై"* – ఎవరూ దాన్ని ఆపలేరు. ఎందుకంటే, అసలే ఆయన ఒక task ఇచ్చాడు, ఈయన్ని కొంచెం సరిచెయ్యమని. అంతవరకూ అది ఆగదు. ఒక్కసారి చెప్తే, ఏదో సినిమాలో చెప్పినట్టు, ఒక్కసారి commit అయితే

నామాటే నేను వినను అన్నాడు. అలా ఉండాలి ధర్మం అంటే. రాముడు అట్లా ఒక్కసారి commit అయ్యి ఇంక నామాట నేను వినను అన్నాడు కదా! అంచేత, అట్లా commitment పెట్టుకుని వచ్చాడు. అంచేతే, ఆయన చక్కబడేంతవరకూ ఈయన అదృశ్యం అవ్వడండి. రూపం దాల్చాడు, ఉంటాడు.

మన చుట్టూ ఉండే వారియందు మనం చూపే ప్రవర్తన బట్టి మనకి అతడు దుర్దర్శనుడో, సుదర్శనుడో అవుతూ ఉంటాడు — మన ప్రవర్తనను బట్టి, ఇప్పటిదీ, పాతదీ. పాతకక్షలతో చచ్చిపోయామనుకోండి. మళ్ళీ పుడితే, పుడుతూనే ఎదుటివాడికి నీమీద కోపం. నిష్కారణం అనిపిస్తుంది. నిష్కారణం ఏమీ లేదు. ఇదివరకు కారణం ఉంది, పాతకారణాలు ఉన్నాయి. అంచేత, కొంతమందిని చూస్తే మొట్టబుద్ధేస్తుంది. చూశారా ఇవన్నీ! వాళ్ళెందుకు మొట్టుతున్నారు అనిపిస్తుంది. ఇదివరకు నువ్వు మొట్టావు. అన్నీ ఉంటాయి అందులో — భూతము, వర్తమానము. ఈ చక్రంలోనే నీ కథంతా ఉంటుంది. ఆ చక్రమే అన్నీ చక్కబెడుతూ ఉంటుంది.

ఇంకొకటి వినండి. మనం పేపర్లో చూస్తే అన్యాయం జరిగిపోతోందని అనుకుంటూ ఉంటాము కదా! అన్యాయమునకు గురికాబడినటువంటివారు, వారు ఎటువంటి క్రియలు చెయ్యడం వల్ల అటువంటి అన్యాయం వారికి కలిగిందో మనకి పేపర్లో రాదు. వస్తుందా! ఒక స్త్రీ భర్తని హత్య చేసిందని పేపర్లో ఇస్తారు. భర్తని హత్య చేసేటటువంటి పరిస్థితికి ఆ స్త్రీ ఎందుకొచ్చిందో రాస్తారా? తిని కూర్చుని అట్లా చేస్తుందా? వెనక కథ ఉంటుంది.

మరీ విపరీత ధోరణి అనుకోకపోతే ఇంకొకటి చెప్తాను. Terrorism ఇప్పుడు ఎందుకు పుట్టింది? ఇదివరకు ఏదీ? ఇప్పుడు ఎందుకు పుట్టింది? Nuxalism ఎందుకు పుట్టింది? Maoism ఎందుకు పుట్టింది? నాగరిక మానవుల్లో కొందరు చేసేటటువంటి దుశ్చర్యల వల్లే సమస్యలు పుట్టుకొస్తాయి. బలహీనులని బలవంతులు భయంకరంగా దుర్వినియోగం చెయ్యడం వల్ల అది భరించలేక ఒక తిరుగుబాటు వస్తుంది. ఎప్పుడూ అంతే! ఫ్రెంచి విప్లవం ఎందుకు వచ్చింది? విప్లవాలు ఎందుకు వస్తాయి? ఏదో ఒకటి చాలా కాలం విస్మరించడం చేత అవి వస్తాయి. ఆ మధ్య ప్రపంచంలో ప్రఖ్యాతి గాంచిన ఒక Zen Master ని ఢిల్లీకి ఆహ్వానం చేసి, ఒక interview పెడితే, మన రాజకీయ నాయకుల్లో ప్రముఖులంతా వెళ్ళారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇలాంటి వాళ్ళంతా కూడా వెళ్ళారు. ఆయన్ని అడిగారు terrorism మీద మీ అభిప్రాయం ఏమిటని? "వాళ్ళకేదో రావలసినది, అవసరమైనటువంటిది, తరతరాలుగా నిరాకరింపబడడంచేత ఆ విధంగా తయారయ్యారని నా అభిప్రాయం. అంచేత, వాళ్ళని చంపడం పరిష్కారం కాదు" అని అన్నాడు. గుడ్లూ, నాలుకలూ వెల్లబెట్టారు అంతా, అదేమిటి అన్నట్టు. అంటే, అప్పుడు ఆయన అన్నాడు, "ఒక terrorist తో మీరు పోట్లాడాలంటే ఒంటి నిండా కవచాలు వేసుకుని, బుల్లెట్లతో మొత్తం guns అవీ తీసుకుని వెళ్లి, వాళ్ళని చంపించడానికి వెళ్తారు. వాడు ప్రాణాన్ని అర్పించేస్తున్నాడు. నువ్వు ప్రాణాలు రక్షించుకుంటూ ఎదుటివాడి ప్రాణాలు తీద్దామని చూస్తావు. వాడు ప్రాణాలని లెక్కచెయ్యకుండా తన సిద్ధాంతాన్ని ప్రపంచానికి

అందిద్దామని చూస్తున్నాడు. వాడు నీకన్నా చాలా పెద్ద త్యాగి" అని చెప్పాడు. "అంటే ఏమిటంటే, ప్రతిదాంట్లోనూ బొమ్మ, బొరుసు ఉంటుంది. ఒకటే చూసి నిర్ణయం చెయ్యకూడదు. ఎందుకు పుట్టిందో, ఆ కారణాలు వెతకడం అనేటటువంటిది చెయ్యవలసిన పని" అని ఆయన చెప్పాడు. "ప్రేమ ఉన్నచోట ఇవన్నీ ఎందుకు పుట్టాయి? ద్వేషం వాళ్లలోనే కాదు కదా! వాళ్ళ ద్వేషం గురించి పేపర్లోనూ, టీవీలోనూ చూపిస్తున్నారు. ఎంత ద్వేషపూరితమైన కార్యాలు వారియందు చెయ్యడంవల్ల వారు ఆ విధంగా తయారయ్యారో ఆలోచించండి" అని ఆయన చెప్పాడు. We only see one side of the coin. We don't see the other side. పూర్వాపరాలు తెలియకుండా ఉంటే న్యాయం తెలియదు, ధర్మం తెలియదు.

మహా భారతంలో పాండవులు ఐదుగురూ వచ్చి పీటలమీద పెళ్లికి కూర్చుంటే ఇదేం ధర్మం అంటాడు ద్రుపదుడు. పూర్వం గురించి అంతా వ్యాసుడు చెప్తాడు. దీని వెనక కథ ఒకటుందయ్యా, అందుకనే ఈ రాజులు ఇట్లా కూర్చున్నారు. వాళ్ళు ధర్మాత్ములు కదా! అంతేకాదు, మీ అమ్మాయికి కూడా ఇష్టమే, కావాలంటే కనుక్కో అన్నాడు. ఏ స్త్రీకైనా అట్లా ఉంటుందాండి? ఆవిడకి ఉంది. ఎందుకుంది? ఇదివరకు కథ ఉంది. అంతకుముందు మనమేం చేసి రావడంవల్ల ఇప్పుడు ఇలా ఉంటున్నామో అనేది ఎవరికీ అక్కర్లేదు. అందుకనే, వీటియొక్క అవగాహన అంతా కూడా అపరిపూర్ణంగా ఉంటుంది. ఇదంతా మనకి ఉపాఖ్యానముగా

వచ్చింది. ఎందుచేతంటే, ఇది కథలో భాగంగా దాన్ని అట్లా మనం చెప్పుకోవడం వరకూ వచ్చాము.

ఆ విధంగా (సుదర్శన చక్రం) వెంటబడ్డదండి. ఎందుకని? సుదర్శనం చక్కబెట్టేంత వరకూ కూడా శాంతించదు. ఎప్పుడు చక్కబడుతుందంటే మొదట్లో ఎవడు ఎక్కడ తప్పు చేశాడో వాడు ఒప్పుకుంటేగాని చక్కబడదు. అదే ఇక్కడ జరిగేది కూడా. ఇక్కడ తప్పు చేసి ఎక్కడోక్కడ సర్దుకుందామనుకుంటే కుదరదు.

"ఏ లోకంబునకైన వెంటఁబడి తో నేతెంచు చక్రానల
జ్వాలల్ మానుపువారు లేమిఁ జని దేవజ్యేష్ఠు లోకేశు వాఁ
డాలోకించి విధాత విశ్వజననవ్యాపారపారీణరే
ఖాలీలేక్షణ! చూడవే కరుణఁ జక్రంబున్ నివారింపవే."

అని బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళిపోయాడు. అందరి వ్రాత ఆయనే కదా రాస్తాడు! *"రేఖాలీలేక్షణ"* – రాసి లీలగా చూసుకుంటాడటండి. రేఖలే చూసుకుంటాడు. అంచేత, *"దేవజ్యేష్ఠు లోకేశు"* అక్కడికి చేరాడు. చేరితే ఆయన చెప్పాడు.

"కర మర్థిన్ ద్విపరార్ధసంజ్ఞ గల యీ కాలంబుఁ గాలాత్ముఁడై
సొరిదిన్ నిండఁగఁ జేసి లోకములు నా చోటున్ విభుం డెవ్వఁడో
పరిపూర్తిన్ గనుఁగ్రేవఁ గెంపు గదురన్ భస్మంబుగాఁ జేయు నా
హరి చక్రానలకీల కన్యుఁ డొకరుం డడ్డంబు గానేర్చునే."

ఎవరు అడ్డో చూస్తానన్నాడు కదా దుర్వాసముని.

అందుకనే, answer ఇక్కడ కొంచెం... *"ద్విపరార్ధసంజ్ఞ గల"* అంటే, అయిపోయినది, జరుగుతున్నది – ఈ రెండూ కలిపి వచ్చేటటువంటి చక్రం అది. దానికెవరూ అడ్డు తగలలేరు. దాన్ని ఎవరు అడ్డుకోగలరు? ఎవరూ అడ్డుకోలేరు. అంచేత, దాని చేతిలో అన్నీ భస్మం అయిపోతాయి. దానికి అడ్డులేదు. *"హరి చక్రానలకీల కన్యుఁ డొకరుం డడ్డంబు గానేర్చునే"* – దాని ముందెవ్వరూ... నేనయినా అంతే. నేను దాన్ని మించిన వాడిని కాదు. నువ్వు నన్ను పొగిడినా, నేను మొహమాటపడను అంటాడు. మొహమాట పడ్డామనుకోండి, మనని కూడా కలిపి, ఇద్దరినీ తరుముతుంది కదా! ఎవరయినా అడ్డుపడితే అడ్డుపడ్డవాళ్లని, దుర్వాసుడిని కలిపి తరుముతూ ఉంటుంది. అందుకని, ఈ running race లో he did not want to join. దుర్వాసుడి పరుగుపందెంలో బ్రహ్మదేవుడు చేరడం ఇష్టపడలేదు. ఎందుకంటే, మనవల్ల కాదబ్బాయ్, అదంతే, దాని పని అది చేస్తుంది.

ద్విపదార్ధ సంజ్ఞ గల కాలమంటే సృష్టి, స్థితి కలిగించటం, అటుపైన పరిపక్వం చెందటం, లయమైపోవటం అని రెండుగా (పూర్వార్ధము, పరార్ధము లేక ఉత్తరార్ధము) కదిలే కాలం. దానికి ఎదురు లేదు. సృష్టించేటప్పుడు ఎవరు ఎదురు వచ్చినా ఊరుకోదు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు అలా అడ్డుకో చూచారు. కుదర లేదు. అలాగే స్థితిని, పురోగతిని అడ్డినవారుకూడా కాలమందు నశించారు. అదే విధంగా సృష్టి తిరోధానం కూడా కాలానుగుణంగా సాగుతుంది. దానినీ ఎవరూ ఎదుర్కొనలేరు. అటువంటి శ్రీహరి యొక్క సుదర్శన చక్రం అగ్ని జ్వాలకి అడ్డుపడగలిగిన శక్తి

కలిగినటువంటివాడు మరొకడున్నాడా! అని తాత్పర్యం ఇచ్చారు ఇక్కడ. ఎంచేతంటే, సృష్టి ప్రారంభంలోనే కాలము, ప్రకృతి – అది ఎలా అంటే, ఆయనే habit forming nature తయారు చేశాడు ఆయనకి. మనం పడుకుంటే అలవాటు ప్రకారం లేవం మళ్ళీ? ఐదింటికి లేస్తాము అలారం లేపకుండా అంటే, అలవాటు ఉండటం. అట్లాగే ఒక ప్రళయంలోకి సృష్టి వెళ్ళిపోయినప్పుడు నిద్రవంటి స్థితిలో ఉన్నటువంటి నారాయణుడుకి ఈ సృష్టికాలం ఎంతుంటుందో, ప్రళయకాలం అంతా అయిన తర్వాత మళ్ళా మెలకువ వస్తుందిట. ఆయనకి మెలకువ రావడం అంటే కాలం బయటకి రావడం. అప్పటినుంచే కాలం మొదలు. కాలంలో ప్రకృతి విచ్చుకుంటూ ఉంటుంది, వృద్ధి చెందుతూ ఉంటుంది. ఆ తర్వాత ముడుచుకుంటూ ఉంటుంది. కాలము–ప్రకృతి గురించి మనకి అంతర్ముఖ ధ్యానాలలో ఇచ్చారు CVV గారు. ఆ ధ్యానంలో వీటన్నిటి గురించి బాగా రాస్తారు. ఏ విధంగా సృష్టి ఈ కాలం పుణ్యంగా ఇన్ని కోశాలు కోశాలుగా, పద్మకోశంలాగా విచ్చుకుంటుందో, *"పద్మకోశం ప్రతీకాశగ్ం"* అని చెప్పుకుంటూ ఉంటాము కదా! అట్లా గుడ్డులో గుడ్డుగా ఏర్పడి, ఆ గుడ్డు విచ్చుకుని, పద్మంలాగా అయిపోయి, అదలా వికసించి, మళ్ళీ కాలానుగుణంగా అందులో కలిసిపోతుంది. ఇదంతా నిర్వర్తించేటటువంటివాడు త్రిమూర్తులకి అతీతమైన దైవము. పేరు ఏదయినా పెట్టుకోవచ్చు. ఇక్కడ అంతర్యామి అని చెప్పుకుంటాం. భాగవతంలో విష్ణువు, వాసుదేవుడు, నారాయణుడు అంటూ ఉంటారు. చెప్పానుగా నిన్న! ఈశ్వరుడు, సదాశివుడు, పరమేశ్వరుడు, అట్లా కూడా అంటూ ఉంటారు. అట్లాగే పరాశక్తి, ఆ తర్వాత చైతన్య స్వరూపిణి,

ఆ తర్వాత ముగ్గురు అమ్మలు, అట్లాకూడా చెప్పుకోవచ్చు. తత్త్వం అర్థం అయితే ఇబ్బంది లేదు పేర్లతో.

అంచేత, బ్రహ్మదేవుడు పని సృష్టి. రుద్రుడి పని ప్రళయం. రెండూ కూడా according to time table జరిపేస్తారు. Time table ప్రకారం అది జరిగిపోతూ ఉంటుంది. అంచేత, అదే (సుదర్శన చక్రం) పూనుకుంది. ఎవరు నిర్ణయం చేస్తారో మొత్తం అందరిదీ, మా గురించి కూడా, అదేనయ్యా వచ్చింది. అదే వెంటపడి వస్తోంది. అగ్నిజ్వాలలతో వస్తోందట. అందుకే భయం. అంచేత, ఆ విధంగా బ్రహ్మదేవుడు చెప్పాడు.

"ఏను భవుఁడు దక్షుఁ డింద్రాదులును బ్రజా
పతులు భృగుఁడు భూతపతులు శిరము
లందుఁ దాల్తు మతని యాజ్ఞ జగద్ధితం
బంచు భూరికార్యమతుల మనుచు."

బ్రహ్మదేవుడు ఇంకా చెప్తున్నాడు. నేను, శివుడు, దక్షుడు, ఇంద్రుడు, ప్రజాపతులు, భృగువు వంటి మహర్షులు, భూతపతులు, అందరమూ కూడా నెత్తిమీద పెట్టుకుంటాము దానిని. నెత్తిమీద వీళ్ళు పెట్టుకోవడం కాదు, అది నెత్తిమీద ఉంటుంది. మనకి ఎక్కువ ఇటునుంచి అటు ఆలోచిస్తాము కాబట్టి మన నెత్తిమీద పెట్టుకోవడం కాదు, ఎప్పుడూ నెత్తిమీదే ఉంటుంది. ఎంచేత అంటే, మన roots అక్కడ ఉన్నాయి. ఊర్ధ్వమూలం కదా! అంచేత, నెత్తిమీదే ఉంటుంది అందరికీ. అదే దిగుతుంది లోపలకి, sink అవుతుంది, ఫిల్టర్ కాఫీ లాగా. Sink అయితే

వీళ్ళవీళ్ళ ఆలోచనలు వీళ్ళకి వచ్చేస్తుంటాయి. వాళ్ళ వాళ్ళ పనులు వాళ్ళు వాళ్ళు చేసేస్తూ ఉంటారు. అక్కడినుంచి దింపేది ఆయన సంకల్పం. ఆ సంకల్పాన్నే సరస్వతి అంటారు. దివ్య సంకల్పం. బ్రహ్మదేవుడు చెప్తాడు భాగవతం ద్వితీయ స్కంధంలో, "నేనేం చెయ్యట్లేదయ్యా. అంతా మా ఆవిడే చేసేస్తూ ఉంటుంది. నన్ను appoint చేసింది husband గా" అని చెప్తాడండి. ఎక్కడి నుంచి వచ్చిందట ఆవిడ? అక్కడి నుంచి. అక్కడ ఎక్కడ ? అక్కడే! దానికంతకన్న పేరులేదు. తెలిసినవారెవ్వరూ దానికి పేరు పెట్టలేదు. *''తత్రైకాగ్రం''* అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు (6వ అధ్యాయం). ''అక్కడ నీ మనసు లగ్నం చెయ్యి! అని'' అర్జునుని ఆదేశించాడు. ''అక్కడంటే ఎక్కడ?'' అని అడిగాడు అర్జునుడు. ''అక్కడ అంటే అక్కడే!'' అన్నాడు శ్రీకృష్ణుడు. సృష్టి మూలాన్ని 'అది', 'అక్కడ', 'తత్' అని తెలిసినవారు పిలుస్తారు. 'అది' అన్నిటికి అతీతం. అందులోంచే అన్నీ పుడతాయి. అక్కడనుంచి పుట్టుకొచ్చేదే కాలచక్రం, సుదర్శనచక్రం లేక ధర్మచక్రం! ఆ మూలాన్ని పరతత్త్వమని, పరమని, బ్రహ్మమని, నారాయణమని, శివమని ఋషులు కీర్తించారు. ఆ తత్త్వం యొక్క లక్షణాలు పేర్లుగా తెలిపారు. బ్రహ్మమంటే వ్యక్తం చేసేవాడు-బృంహణము. నారాయణమంటే, జీవుల అవరోహణము, ఆరోహణములకు మూలము. శివము అంటే సర్వశుభంకరము. ఇవన్నీ పరతత్త్వము లక్షణాలు. అక్కడ నుంచి సంకల్పం పుట్టుకొచ్చి, ఆ సంకల్పం నన్ను నియమించి, నా నుంచి పని చేస్తోంది." మనకైనా అంతే. ఆ సంకల్పం అక్కడి నుంచి వస్తుంది కదా! అందుకనే, మనం దాన్ని అడుగుతూ ఉంటాము. *"భర్గో దేవస్య"* అని. అది అలా

దిగివచ్చి, వీళ్ళందరిచేత, వాళ్ళ వాళ్ళ పనులు చేయించేస్తోందండి. గురుపూజల్లో ఎవరి పనులు వాళ్ళు చెయ్యరండి? ప్రతివాడికి రోజూ బొట్టు పెట్టి చెప్తారా detail గా? చెప్పరుగా! ఎవరి పనులు వాళ్ళకి తెలుస్తాయి కదా! వాళ్ళ వాళ్ళ పనులు చేసేసుకుంటూ ఉంటారు. అంతేగా! ఎట్లా జరుగుతుంది? సంకల్పం నడిపిస్తుంది. మనల్ని నడిపించేది కూడా అదే! అంచేత, దాని జోలికి మనం పోలేమని చెప్పాడు.

"కావున సుదర్శనానల నివారణంబునకు నోప నని విరించి పలికిన దుర్వాసుండు గైలాసంబునకుఁ జనుదెంచి శర్వు నాలోకించి చక్రానలంబు తెఱం గెఱింగించిన నమ్మహాదేవుం డి ట్లనియె."

ఆయనంటే కదలడు. కుర్చీ కదలకుండా కబుర్లు చెప్తాడు కదా బ్రహ్మదేవుడు! బ్రహ్మదేవుడు lotus అంటూ ఒకటి ఏర్పాటు చేసుకున్నాడు. ఇంక అందులో comfortable గా కూర్చుంటాడు. సంకల్పాలు వస్తూ ఉంటాయి, పంపిస్తూ ఉంటాడు. వాహికే! నారాయణుడికి first medium ఆయనే కదా! తర్వాతే అందరూ వస్తారు. అంచేత, దుర్వాసుడు కైలాసానికి వెళ్ళాడు. ఇది source దుర్వాసుడికి. అక్కడినుంచే వచ్చాడాయన. దుర్వాసుడు శివాంశ సంభూతుడై వస్తాడు. అంచేత, అక్కడికెళ్ళాడు. *"జనుదెంచి శర్వు నాలోకించి"* – అంటే ఆయనే ఇది అసలు! *"త్రికాగ్నికాలాయ కాలాగ్నిరుద్రాయ"* అంటూ ఉంటాము కదా! కాలాగ్నే!

*"చక్రానలంబు తెఱం గెఱింగించిన నమ్మహాదేవుం డి ట్లనియె"* ఆయన దగ్గరకి వెళ్ళాడు. మనమిద్దరమూ ఒకటే party కదా అని!

"వినవయ్యా! తండ్రీ!" – చూడు నాన్నా! అని చెప్పాడు. చిన్న పిల్లల్ని మనం ముద్దుగా తండ్రీ అని పిలవమా! మా నాయనే అని! ఈయనేగా అక్కడికి వచ్చాడు!

"వినవయ్య! తండ్రి! యే విశ్వేశ్వరునియందుఁ
జతురాస్యజీవకోశములు పెక్కు
వేల సంఖ్యలు గూడి వేళతో నిబ్బంగి
నగుచుండుఁ జనుచుండు నదియుఁగాక
యెవ్వానిచే భ్రాంతి నే మందుచున్నార
మేను దేవలుఁ డసురేంద్రసుతుఁడు
నారదుఁ డజుఁడు సనత్కుమారుఁడు ధర్ముఁ
డా కపిలుఁడు మరీచ్యాదు లన్య"

కాలప్రకారం అందరం ఆయన్ని మన్నుతూ ఉంటాము. ఆయనలో పుడుతూ ఉంటాము. ఆయనలో తిరుగుతూ ఉంటాము.

"పారవిదులు సిద్ధపతులు నెవ్వనిమాయ
నెఱుఁగలేము దాన నింత వడుదు
మట్టి నిఖిలనాథు నాయుధశ్రేష్ఠంబుఁ
దొలఁగఁజేయ మాకు దుర్లభంబు."

మేమంతా కూడా ఈ చక్రంలో వాళ్ళమే అని చెప్పాడండి. అంతా చక్రంలో ఉన్నవాళ్ళమే. చక్రభ్రమణం చేసేటటువంటి వాడొకడు ఉన్నాడు. ఆ చక్రం ఆయనది. అందుకనే, సృష్టి ప్రణాళిక ప్రకారం మా పనులు చేసేవాళ్లము. ఎంత తెలిసినవాడయినా అంతే. మేము దాని జోలికి వెళ్ళము. అంచేత, దాని జోలికి వెళ్లి, మేం ఏదో చెయ్యగలమనే టటువంటి భ్రమ మాకు లేదు. ఎంచేత అంటే, ఈయన ఒక్క మాటన్నాడు ఇక్కడ, *"యెవ్వానిచే భ్రాంతి నే మందుచున్నార మేను"*. సృష్టిలో మొట్టమొదట తపస్సు చేసినవాడు శివుడు. పుట్టీపుట్టంగానే బ్రహ్మదేవుని పని చేసేసి, కూర్చుంటాడు, చాలంటాడు. అంటే, వెళ్లి తపస్సు చేసుకుంటాడు. అందుకని, సృష్టిలో మొట్టమొదటినుంచి తపస్సు చేసుకుంటున్నవాడు శివుడు. ఓం ప్రథమం అంటూ తపస్సు మొదలుపెట్టింది ఆయనే. అందుకనే, ఆయన ఆది యోగి. జనులందరికీ కూడా అధిపతి అయి ఉన్నాడు. తపోధనులకి అధిపతి అయి ఉన్నాడు. ఎవరిని గురించి తపస్సు? అంతర్యామి తత్త్వాన్ని భావన చేస్తూ, ప్రశాంతంగా ఉంటాడు, శంకరుడై ఉంటాడు. లేకపోతే, రుద్రుడే. By nature, దొక్క చించే స్వభావం. కానీ, అలక్ నిరంజన్. ఆయనతో కలిసి ఉంటే మనంత ప్రశాంతమూర్తి ఎవరూ ఉండరు. అలా ఉంటాడు. ఆయనకి తెలిసిపోయింది. ఇదంతా భ్రాంతి. నేనున్నాను అనేటటువంటిది భ్రాంతి కదా! ఆ భ్రాంతిలో పెట్టాడు మనలను. ఆ భ్రాంతిలోనే మనుచున్నాము మేమంతా అన్నాడు. అది అదే అని చెప్పాడు. ఆ వచ్చే చక్రం కాలచక్రం రూపంలో ఇవన్నీ ఏర్పాటు చేస్తున్నట్టు... అది ఏర్పాటు చేసినదాంట్లో మా వంతు కర్తవ్యం మేము చేస్తున్నాము. దాన్ని అతిక్రమించి ఎవరూ ఏమీ చెయ్యలేరు.

"మునీంద్రా! నీవు నమ్మహాత్ముని శరణంబు వేఁడు మతండు మేలు సేయం గలవాఁ డని పలికిన నీశ్వరునివలన నిరాశుండై దుర్వాసుండు వైకుంఠ నగరంబునకుం జని."

*"మునీంద్రా! నీవు నమ్మహాత్ముని శరణంబు వేఁడు"* – ఎవరు? అంతర్యామి దైవాన్ని. First preference అది కాదు ఆయనకి. ఎందుకంటే, అది ఆయనకి కూడా తెలుసు కదా! ఆ ఆయుధం, సుదర్శన చక్రం, నారాయణుడిదని తెలుసు. అంచేతే, మిగతా వాళ్ళందరినీ అడిగి చూశాడు. మీరేమయినా చేసి పెడతారా అని. అంటే, అప్పుడు... పైగా శివుడు సలహా ఇచ్చాడు, అక్కడికెళ్ళు నువ్వు అని. మా వల్ల కాదు అన్నాడాయన. ఎవరూ ఏం చెయ్యలేరు అని చెప్పాడు. మేం ఎవ్వరూ ఏం చెయ్యలేము కాబట్టి ఆయన దగ్గరికి వెళ్ళు అని. సరే అక్కడికి వెళ్తాడు.

"ఆ వైకుంఠములోనిభర్మమణిసౌధాగ్రంబుపై లచ్చి దా
గ్రేవన్ మెల్లన నర్మభాషణములం గ్రీడించు పుణ్యున్ హరిన్
దేవాధీశ్వరుఁ గాంచి యో వరద! యో దేవేశ! యో భక్తర
క్షావిద్యాపరతంత్ర! మానుపఁగదే చక్రానలజ్వాలలన్."

"కాస్త ఆపు నాయనా, మహానుభావా!" అన్నాడు. "నువ్వు వరదుడివి కదా!" అన్నాడు. "వరాలు ఇచ్చేవాడివి దేవతలకి. దేవుడివి కదా!" అన్నాడు. *"భక్తరక్షావిద్యాపరతంత్ర"*. ఆయనది పరతంత్రం. అంటే, తను భగవద్భక్తుడే కదా! ఆయన తపస్సు చేస్తే చేరేది ఈయన్నే. దుర్వాస మహర్షి కనులు మూసుకుంటే చేరేది

ఈయన్నే. మరి ఎందుకిలా తంటాలు పడుతున్నాడు? మాయ. కనులు మూసుకుంటే అది అయిపోతాడండి ఆయన. అది ముందే చెప్పారు. అలాంటి వాడిని కూడా మాయ కమ్మిందంటే ఇంకేమిటి చెప్పండి!

"నీ మహిమార్ణవంబు తుది నిక్కముగా నెఱుఁగంగ లేక నీ
ప్రేమకు వచ్చు దాసునకుఁ గ్రించుతనంబున నెగ్గు సేసితిన్
నా మఱపున్ సహింపు మట నారకుఁడైన మనంబులో భవ
న్నామము చింత సేసిన ననంతసుఖస్థితి నొందకుండునే."

*"ఏతావాన్ అస్య మహిమాన్"* అంటాము కదా! నీ మహిమ, దాని అంతు నాకు తెలియడం లేదు. తెలియక... ఒళ్ళు గగుర్పొడుస్తోంది చదువుతుంటే! ఉన్నమాట చెప్పేశాడు దుర్వాసుడు. Straight గానే ఉంటాడు కదా! డొంకతిరుగుళ్ళు కుదరవు కదా! ఆయనకి లేవు కూడా. దుర్వాసుడికి డొంకతిరుగుళ్ళు ఉండవు. మెలికలు పెట్టడం చేతకాదు. సూటిగా పోతూ ఉంటాడు. గుద్దుకుంటే గుద్దుకుంటూ ఉంటాడు. అంచేత, చెప్తున్నాడు.

పెద్దవాడిలా ఆశీర్వదించవలసినవాడు ఇలా చిన్నవాడిగా... *"నా మఱపున్"* – మరపే కదా! మాయంటే ఏమిటి? మరపే మాయ. *"సహింపు మట నారకుఁడైన మనంబులో భవ న్నామము చింత సేసిన ననంతసుఖస్థితి నొందకుండునే"* – మనసులో తలుచుకుంటేనే నువ్వు సుఖస్థితి యిస్తావు కదా! నాకేమిటి యింతలా అయిపోయిందని బాధ పడ్డాడు.

"అని పలికి పాదకమలంబులకు మ్రొక్కి లేవక యున్న దుర్వాసునిఁ గని హరి యి ట్లనియె."

మరి లేవ లేదు. *"అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ, తస్మాత్ కారుణ్యభావేన రక్షరక్ష"* అన్నాడండి. "జనార్దనా!" అని పాదాలమీద పడిపోయాడు. పడిపోయి నువ్వే రక్షించు. మరపు వచ్చిందని ఒప్పుకున్నాడు. దేని గురించి మరపు? అంతా ఆయనే అన్న మరపు. రెండవ మరపు, అంబరీషుడు భక్తుడు అని తెలుసు. కాబట్టే, వీడు భక్తుడు కాదు, విష్ణుభక్తుడు కాదని ఎందుకన్నాడు? Negate ఎందుకు చేశాడు? మరపు వచ్చింది కాబట్టి negate చేశాడు. లేకపోతే, negation ఎందుకు? ఇంకొకటి చెయ్యచ్చు. మరపు వచ్చింది. మరపు వలన యిలా చేశాను. వాడు నీ దాసుడు. పెద్దవాడిగా నన్ను ఆదరిస్తే, హీనంగా ప్రవర్తించాను. అంచేత, నువ్వే నన్ను రక్షించాలని చెప్పి కాళ్ళు పట్టుకున్నాడు.

"చలమున బుద్ధిమంతు లగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలికొని పోవుచుండుదు రకిల్బిషభక్తిలతాచయంబులన్
నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్
వలలకుఁ జిక్కి భక్తజనవత్సలతం జనకుందుఁ దాపసా!"

సాధులైనటువంటి భక్త జనులు, వాళ్ళేం చేస్తారంటే, బాగా ఆరాధన చేసి చేసి, తమను మర్చిపోయినటువంటి స్థితిలోకి వెళ్ళిపోతారు. వారు చూపించేటటువంటి భక్తి, ప్రేమ, అనురాగం కారణంగా ఈయన వాళ్ళలో ఉండడం మొదలు

పెడతాడు. వాళ్ళు ఆయన్ని కట్టేసుకుంటారు. ఈయనకి ఇష్టమే. అందుకని ఉండిపోతాడు. ఏనుగును ఈ ఆకులు అలముల తాడుతో బంధించినట్టుగా ఎట్లా బంధిస్తారో అట్లా భక్తులు నన్ను బంధిస్తారు. వాళ్ళ హృదయాలలో నేను ఉంటాను అని చెప్తున్నాడు హరి. హరి అంటేనే దిగివచ్చే భగవంతుడు.

*"నాకు మేలుగోర నా భక్తులక కాని"* – తన భక్తుల మేలే కోరతాడండి. అంటే, తన్ని మర్చిపోతాడు భక్తుడి కోసం. ఎందుకని? భక్తుడు తన గురించి మర్చిపోయాడు ఆయన కోసం. భక్తుడు అన్నీ మర్చిపోయాడనేగా! మర్చిపోయాడంటే అన్నిటా ఈయనే ప్రసరిస్తున్నాడు. అంబరీషుడికి ఇంకేమీ కనపడడం లేదు. భార్య కనపడడం లేదు, కొడుకు కనపడడం లేదు, రాజ్యపాలన ఏదీ కనబడడం లేదు, పౌరులు కనబడడం లేదు. ఎటుచూసినా అంతా విష్ణువే కనిపిస్తున్నాడు. తనుకూడా తను లేని స్థితి. అక్కడుండేది విష్ణువు కదా! అలా వాళ్ళుంటారు కాబట్టి same to you, నేనూ అలాగే ఉంటాను. మనని చూడండి! ఎవరయినా happy new year అంటే మళ్ళీ happy new year అనము కదా! Same to you అంటాము. వాళ్ళు నాతో ఎలా ఉంటే నేను వాళ్ళతో అలా ఉంటాను. అది భగవంతుని యొక్క ప్రధాన గుణము. ప్రేమగా ఉంటే, భక్తిగా ఉంటే, భగవంతుడిగా ఉంటాడు. స్నేహంతో చూస్తే స్నేహంగా ఉంటాడు. అంతా నేనే అనుకుంటే నేనే. నువ్వు ఎట్లా అనుకుంటే అట్లా. మరి వీళ్ళు అట్లా చేసి నన్ను లోపల గట్టిగా కట్టేసుకుంటారు. వాళ్ళే నాకు ముఖ్యం. ''నువ్వు తపస్వివి'' అని చెప్తున్నాడు.

"దాపసా" అన్నాడు. అంటే, తపస్వీ జనులకి, భక్తులకి ఉండేటటువంటి ఒక చిన్న తేడా. వాళ్లెప్పుడూ అందులోనే ఉంటారు. విష్ణుభక్తుడు ఎప్పుడూ అందులోనే ఉంటాడు. *"పానీయంబులు త్రావుతున్ కుడుచుచున్ హాసనిద్రాదులు చేయుచున్."* ఏం చేస్తున్నా దైవంలోనే ఉండి చెయ్యడం అనేటటువంటిది భక్తుడి పని. అది రాజవిద్య. నేను దైవమందు ఉన్నాను. దైవము నాయందు ఉన్నాడు. దైవము నాయందు ఉండడంవల్ల నేను దైవమందు ఉన్నాను. అల సముద్రమందున్నది. సముద్రమందు అల ఉన్నది. సముద్రం ఉంటేగా అల ఉంది! ముందేముంది? ముందు సముద్రం ఉంది. కాబట్టి దైవము ఉన్నాడు. అతనియందు నేను ఉన్నాను. అందుచేత, నాయందు అతడున్నాడు అనే స్థితిలో తనయందు, అఖిలభూతములందు, పుట్టినవాటన్నిటియందూ అలాగే చూస్తాడు. అందుకనే, ఈ భక్తి ముందు ఏమీ ఆగదు. అది అనన్య భక్తి, పరిఉపాసన. తపస్సు చేసినా కూడా తపస్సు నుంచి బయటకొస్తే కొంత ప్రపంచం కనబడుతూ ఉంటుంది. అభిషేకాలు బాగా చేశామనుకోండి, తర్వాత non–అభిషేకం సమయంలోనో? హోమాలు బాగా చేస్తున్నామనుకోండి, Non–హోమం time లోనో? పూజలు బాగా చేస్తున్నామనుకోండి, non–పూజ time లోనో? గురుపూజల్లో... తర్వాత? భక్తుడికి లేచిన దగ్గరనుంచి పడుకునేంతవరకూ గురుపూజే. 365 days throughout the life. ఎందుకంటే, లేచిన దగ్గర నుంచి తానుగా లేవడం చేత, అతడే తానుగా ఉండిపోతాడు. అలా దిగుతాడండి తానుగా. దిగంగానే అమ్మో! అనుకుని, మళ్ళీ తానుగా కూర్చుంటాడు.

అందుకనే, మొన్నోచోట ఒక hospital లో, డాక్టరుగారు ఎప్పుడూ *"అహం బ్రహ్మాస్మి"* అనుకుంటానండి అని అన్నాడు. అతను చాలా సాధువు, చాలా తెలిసినవాడు. అంటే, ''మీరు చాలా పెద్దవారు, నేను మీకు చెప్పగలిగిన వాడిని కాదు గాని, ఒక్కమాట స్నేహపూరితంగా చెప్తున్నాను'' అన్నాను. చెప్పండి అంటే, *"అహం బ్రహ్మాస్మి"* అనుకోవద్దు, *"బ్రహ్మాహమస్మి"* అనుకోండి అని చెప్పాను. అదేంటి అన్నాడు. ముందు బ్రహ్మం కదా! బ్రహ్మమే మనంగా ఉన్నాము. మనం బ్రహ్మంగా ఉన్నామనుకోవడంకంటే, బ్రహ్మమే మనంగా ఉన్నామనుకోవడం మంచిది. అలా అనుకుని చూడండి బావుంటుంది అన్నాను. మర్నాడు వచ్చి, దణ్ణం పెట్టేశాడు. "చాలా తేడా ఉంది. అర్థమదే అయినా" అన్నాడు. నేనే దేవుడిని అనుకుంటే హిరణ్యకశిపుడివి అయిపోతావు. అయిపోయి, "హిరణ్యకశిపాయనమః" అని చెప్పుకోండి అందరూ అన్నాడు కదా! అదేగా మంత్రంగా ఇచ్చాడు! నేనే భగవంతుడిని అనుకుంటే ఆ దారిలో వెళ్ళే ఆవకాశం ఉంది, అపాయం ఉంది.

దేవుడే నేనుగా ఉన్నాననుకుంటే పడి ఉంటావు. నేను ఉండీ లేననుకుంటాడు భక్తుడు. అంచేత, నువ్వు తపస్సు చేసుకునేవాడివి, నీకు వాళ్ళ గురించి అంత తెలియదు సుమా! అని చెప్తున్నాడు హరి. అందుకే చెప్తున్నాడు, వ్రతాలకు చిక్కను, తపములకు చిక్కను, జపములకు చిక్కను, భక్తులకు చిక్కుతాను. భక్తంటే అనన్య భక్తి. మనం ఏదయినా జపం చేశామనుకోండి, తర్వాత ఏమిటి? బాగా నమిలేస్తాం కదా! నమిలేసిన తర్వాత ఏమిటి next? చేసామన్న feeling తప్ప! హోమం చేశామనుకోండి, వళ్ళంతా

తడిసిపోయింది కదా! బాగా చేశామన్న ఒక feeling తప్ప, తరువాత ఏమిటి? ముందు ఉంది అగ్ని. తర్వాతా ఉంది, మధ్యలో కనబడ్డది అంతే. *"అదృశ్యో వ్యక్త రూపస్య"* అంటే అర్థం ఏమిటి? ఇంతకుముందు నువ్వు లేనట్టుగా ఉన్నావు, ఇప్పుడు ఉన్నట్టుగా ఉన్నావు అని చెప్పడం. ఇప్పుడు ఉందాండి? ఉంది. లేనట్టుగా ఉంటుంది. అప్పుడు చేసినప్పుడు? ఉన్నట్టుగా ఉంటుంది. రోజులో మనకు ఉన్నట్టు ఉండేది తక్కువ, లేనట్టుగా ఉండేది ఎక్కువ. లేనట్టుగా ఉండేవాడు దైవం. దాన్నే చూస్తూ ఉంటారు అన్నిట్లోనూ. వాడూ భక్తుడు. వాడికి మించినవాడెవడూ లేడు. వాడు చూడడానికి హోమాలు చేసేవాడిలాగాను, వేదాలు చదివేవాడిలాగాను, జపాలు, క్రతువులు, యజ్ఞాలు చేసేవాడిలాగా కనబడడు. ఎందుకంటే, ఆయనకి... అవి చేసే వాళ్ళకేమవుతుందంటే అవి చేసేటప్పుడు కాసేపు అందులోకి ఒక ఉన్మత్తము వచ్చి, మళ్ళీ తగ్గిపోతుంటుంది. పాలపొంగు, పాలు కాదు కదండి! పాలపొంగు పాలా! ఉత్త పొంగు ఒక కప్పునిండా వేసి ఇస్తే! నీటి నురుగు నీరా! పాలనురుగు పాలా! అంచేత, పాలనురుగు పాలవాడు బాగా బుస్సుబుస్సుమని పిండుతాడు గిన్నిలోకి! ఎందుకంటే, బాగా నురుగు తోసేయ్యచ్చని కదా! మనం తెలివితక్కువ వాళ్ళమా? వాళ్ళు పాలు పోస్తుంటే వేలు అడ్డం పెడతాము కదా! ఇలాంటివన్నీ ఉన్నాయి కదా! నురుగు, పాలు ఎట్లా కాదో, ఈ తాత్కాలికమైన పెరుగుదల కాసేపు పెరుగుతుంది. పూజలు చేశామనే పెరుగుదల, అక్కడుండదు తర్వాత. ఎందుకంటే, సహజస్థితి కాదు. తర్వాత మామూలుగానే ఉంటావు. సహజంగానే అది అయ్యి ఉంటే? సహజంగా అది అయ్యి ఉండాలంటే, ప్రతి కార్యంలోనూ దైవంతో

యుగళగీతం పాడుకుంటున్నట్టు. ఎప్పుడు లేదు? ఎక్కడ లేదు? ఏ సన్నివేశంలో లేదు? అదీ భాగవతం.

అయి ఉండడం చేత నువ్వు తపస్సు చేశావు. నన్ను పొందుతావు. మళ్ళీ నా నుండి బయటకు వచ్చేస్తావు. అంటే, పరమును చేరతాడండి ధ్యానంలో. తర్వాత ఏంటి? Before and after కూడా అలాగే ఉన్నావా? అంబరీషుడు అలా ఉంటాడు. అతడు ద్వాదశీవ్రతం ఆచరిస్తున్నా, ఆచరించకపోయినా అదే స్థితి. మాట్లాడే పద్ధతుల్లో extra లు ఉండవు. మనం పూజ మొహం పెట్టుకుని తిరుగుతూ ఉంటాము కదా పూజలు చేసేటప్పుడు! అదొక రకమైన tension పెట్టుకుని తిరుగుతూ ఉంటాము. ఏమిటంటే, దుర్గాపూజలు చేస్తున్నాము! ఇంకా కొంచెం వికారంగా ఉంటే గడ్డాలు పెంచుతారు. ఏదో చేస్తుంటాము లెండి. అదలా ఉంచి... అందుకే రాసి ఇచ్చాను, “To be spiritual is to be normal” అని. C.V.V. కూడా “normal temperment” అని ఇచ్చారు కదా! అంచేత, అంబరీషుడి normal level అదే. His normalcy is attunement with the divine. భగవంతుడితో అనుసంధానం చెంది, సర్వకాల, సర్వావస్థలయందూ ఉంటాడు. ఇది పూర్ణిమ అని, ఇది అష్టమి అని ఏమీ తేడాలుండవు. ఇది పుణ్యప్రదేశమని, ఇది కాదని ఏమీ తేడాలుండవు. ఈ కాలమని, ఈ దేశమని ఏమీ ఉండదు. ఎప్పుడూ ఉన్నాడు కదా! అలా చూడండి. వాటిని గురించి అది భావన. ఇలా ఉండేవాడికి ఇంక బయట ప్రకటన, ప్రచారం ఏమీ ఉండదు. ఆనందంగా ఉంటాడు. ఇంకోడు గుర్తించాడా, గుర్తించలేదా? ఈ

బాధలు కూడా ఉండవు. ఎవడు గుర్తించాలి? వాడు గుర్తించాలి. ఇంకెవరు గుర్తించాలి? మిగతా వాళ్ళంతా గుర్తించింది గుర్తింపా? మాస్టరుగారి భాషలో "గ్రుడ్డికన్ను తెరిస్తే ఎంత? మూస్తే ఎంత?" అనేవారు. ఎవడు గుర్తించాలి? పైవాడు గుర్తించాలి. వాడికి నువ్వు ప్రీతిపాత్రుడవైతే చాలు. అందుకే, అలా ఉన్నాడు అంబరీషుడు. నువ్వు తపస్సు చేస్తావు. నన్ను చేరతావు, మళ్ళీ కింద పడిపోతావు. నిచ్చెనలు ఎక్కుతావు, పైకి వెళ్తావు. పాములో పడతావు. మళ్ళీ కిందకొచ్చేస్తావు – వైకుంఠపాళి. అంబరీషుడు నిచ్చెన ఎక్కకుండా, పాములో పడకుండా అట్లా వచ్చేస్తాడు పరమపదంలోకి. అంచేత, ఈ ఎక్కువ తక్కువ అని ఒడుదొడుకులు ఉండవు నిజమైన భక్తుల్లో.

"నాకు మేలుగోర నా భక్తులక కాని
భక్తజనుల కేన పరమగతియు
భక్తుఁ డెందు జనినఁ బఱతెంతు వెనువెంట
గోవువెంటఁ దగులు కోడెభంగి."

ఆవు వెంట ఏ విధంగా దూడ వెళ్తుందో అదే విధంగా నా భక్తుడిని అనుసరించి నేను వెళ్తూనే ఉంటాను సుమా! అలాంటి ఇష్టం నాకు భక్తుడంటే. ఎందుచేతంటే, వాడు ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను మర్చిపోడు. అంబరీషుడు ఎటువంటివాడు? "సప్తద్వీప *విశాలభూభరము దోఃస్తంభంబునం*". అటువంటివాడు కూడా అన్ని కార్యకలాపాల్లోనూ ఎక్కడా విష్ణువుని మరవకుండా ఉన్నటువంటివాడంటే ఎంతటివాడు?

"తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల
నాలి విడిచి సంపదాలి విడిచి
నన్న కాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టివారి నైన."

తనువు అంటే తన శరీరం గురించి తాను ఆలోచించుకోడండి. ఇది భగవత్ దత్తం, భగవంతుడు చూసుకుంటాడు. మనం కాపాడుకుందామనుకుంటే గతి లేదు. ఆయన ఇచ్చాడు. ఆయన పని చేస్తుంటే అదీ పని చేస్తుంది. ఆయన పని మనం చేస్తుంటే, ఇది మనకి పని చేస్తుంది. అందుకే దేహాత్మ భావన ఎక్కువ ఉండదు భక్తుడికి. దీని పోషణ, దీని maintenance ఖర్చులు, దీని comforts, ఇవన్నీ ఆయన చూసుకోవాలి, మనం కాదు. మనం చూసుకోవలసినది ఆయన్ని. ఆయన పని ఇది. ఆయన పనే జీవుల శ్రేయస్సు. అది ఒక్కటే ఆయన పని. అందులోనే ఉన్నావనుకో, నీ శరీరం గురించి నువ్వు ఆలోచించుకోనక్కర్లేదు. నీ జీవితం గురించే నువ్వు ఆలోచించుకోనక్కర్లేదు. నీ మనుగడ, నీ జీవితం గురించి నువ్వు ఆలోచించుకుంటే అది నాసిగా ఏదో జరుగుతూ ఉంటుంది. నీ జీవితం గురించి వాడు ఆలోచించాలి. పైవాడు ఆలోచిస్తే అది వైభవంగా ఉంటుంది. "నేను దైవం పనిలో ఉంటాను, నా మనుగడ అతడే చూసుకుంటాడు", అనేవాడు భక్తుడు. మనుగడ చూసుకుని, ఆరోగ్యం చక్కబెట్టుకుని, అప్పుడు చేద్దామనుకోవడం కాదు. ముందది, తర్వాత ఇవి. తర్వాత మిగతావేం లేవు. అన్నీ ఆయనే చూసుకుంటాడని ధైర్యం, విశ్వాసం, పరిపూర్ణమైన విశ్వాసం. మన వృత్తి ఏమైపోతుంది,

మన వ్యాపారం ఏమైపోతుంది, మనం గురుపూజలకెళ్తే ఎట్లా, మనం అక్కడికి, ఇక్కడికీ తిరిగితే ఎట్లా? ఎట్లా అంటే సంశయాత్మ అని అర్థం. *''సంశయాత్మా వినశ్యతి''*. సంశయంలో వుండే వాడు ఏమీ చేయలేడు. మంచో, చెడో నీవు నమ్మినదానికి దాసోహం అని సమర్పణ చెందినవాడే ఏమైనా చేయగలడు. *"ఆలి విడిచి..."* విడవడం అంటే, విడిచి వెళ్లిపోకూడదు, పొద్దున్న చెప్పుకున్నాం కదా! భార్య యందు భగవంతుని దర్శనము, పిల్లలయందు భగవంతుని దర్శనము, తనయందు భగవంతుని దర్శనము, చుట్టాల యందు భగవంతుని దర్శనము, నీ దేహం భగవత్ దత్తం. ఇట్లా ఏం చూసినా భగవంతుడితో ముడి వేసి చూసుకుంటాడు. *"నన్న కాని యన్య మెన్నఁడు నెఱుఁగని వారి విడువ నెట్టివారి నైన"* – impossible అటువంటివాడిని వదలడం, అని చెప్పాడండి. ఇవి భగవంతుడి వాగ్దానాలు కదా! నీకు తెలియలేదు అంబరీషుడి గురించి... వీడు విష్ణుభక్తుడు కాదన్నాడు కదా! ఎలాంటి భక్తుడు? మరివన్నీ అంబరీషుడిలో ఉన్నాయని చెప్తూ, మనకి కూడా సందేశం ఇస్తున్నాడు, దుర్వాసుడికి సందేశం ఇస్తూ...

"పంచేంద్రియముల తెరువుల
వంచించి మనంబునందు వరమతులు ప్రతి
ష్ఠించి వహింతురు నన్నున్
మంచివరుం బుణ్యసతులు మరగిన భంగిన్."

మాములుగా ఇంద్రియములు మనని వంచిస్తూ ఉంటాయి కదా! వాటిని వీళ్ళు వంచిస్తుంటారు. మనసులో అవీ ఇవీ

చోటు లేకుండా ఈయన్ని నింపేసుకుంటారు. పూర్తిగా ఈయన్నే దింపేసుకుంటారటండి. అంటే, mind, divine mind అయిపోతుంది – దివ్యమతి. Divine mind నే diamond అన్నారు. ఇట్లా divine mind అయిపోతుంది. ఎంచేత? మనసంతా తనని దింపుకుంటాడు భక్తుడు. ఇతరములకు అంత చోటు ఉండదు. కాబట్టి ఇంద్రియాలన్నీ కూడా విచ్చలవిడిగా ప్రవర్తించడానికి చోటు లేదు. ఆ విధంగా నన్ను వహింతురు. నన్ను ధరిస్తాడు వాడు. ఎట్లాగయ్యా అంటే, *"మంచివరుం బుణ్యసతులు మరగిన భంగిన్"*. పుణ్యమైన స్త్రీలు ఏవిధంగా తన భర్తను ప్రేమిస్తూ వుంటారో. అందుకే, భారత స్త్రీ పుణ్య స్త్రీ. ఏమీ సందేహం లేదు. ఇప్పుడిప్పుడే కొంచెం మార్పు వస్తోందిగాని, స్త్రీ మనసులో ఒక పురుషుడిని గురించి భావన పడితే, ఆ జన్మకది permanent. అలా ఉంటుంది భారత స్త్రీ మనస్సు. భారత పురుష మనసు అలా ఉంటుందని మనం చెప్పలేము. అందుకనే, స్త్రీలకే దర్శనాలు ఎక్కువ అవుతూ ఉంటాయి. అలా భగవంతుడిని ఆవిధంగా వరిస్తారు భక్తులు, ఇంకోటి ఉండదు. No other. అన్యం లేదు. ఇంక అదే అట్లా ఉంటారు. *"సాధులహృదయము నాయది"* – వాళ్ళ హృదయం నా ఇల్లు. అక్కడే ఉంటాను నేను.

"సాధులహృదయము నాయది
సాధులహృదయంబు నేను జగముల నెల్లన్
సాధుల నేన యెఱుంగుదు
సాధు లెఱుంగుదురు నాదుచరితము విప్రా!"

నా గురించి వాడికి తెలుస్తుంది. వాడి గురించి నాకు తెలుస్తుంది. మా ఇద్దరి మధ్యా అట్లా ఉంటుంది ఒక private and confidential సంబంధం. వాళ్ళ హృదయమందే ఉంటాను. నేనే నిండి ఉంటాను. ఉండడం చేత వాళ్లకి నేను తెలుసు. నాకు వాళ్ళు తెలుసు. మేం ఇద్దరం ఒకరికొకరు తెలిసి ఉంటాము.

"ధారుణీసురులకుఁ దపము విద్యయు రెండు
ముక్తి సేయుచుండు ముదము తోడ
దుర్వినీతు లగుచు దుర్జను లగువారి
కివియె గీడు సేయ కేల యుండు."

*"ధారుణీసురులకు"* అంటే బ్రాహ్మణులని అర్థం. తపము, విద్య – బాగా తపస్సు చేస్తారుట. బాగా విద్యలు పొందుతారుట. *"రెండు ముక్తి సేయుచుండు ముదము తోడ"* – బాగా బంధవిమోచనం కలిగించి భగవత్ తత్వానికి దగ్గరగా చేరుస్తుంది. *"దుర్వినీతు లగుచు దుర్జను లగువారి కివియె గీడు సేయ కేల యుండు"*, అంటే ఏ విద్యతో, ఏ తపస్సుతోను నువ్వు చేరుకున్నావో, ఆ విద్య ఇప్పుడు పనికి రాలేదు కదా! పనికొచ్చిందా! ఎంచేత? మనసులో తేడా ఉండడం చేత అవి పనికి రాలేదు. వాడో? వాడు మనసులోకి దింపేశాడు ఈయన్ని. నువ్వు ఉండి అవన్నీ నేర్చుకున్నావు నీ మనసుతో. నువ్వు నువ్వుగా ఉండి విద్యలు నేర్చుకున్నావు. నువ్వు నువ్వుగా ఉండి అతడు అవ్వడానికి తపస్సు చేస్తూ ఉంటావు. అప్పుడప్పుడూ అవుతూ ఉంటావు. బుద్ధి బావుంటే మంచిదే. బుద్ధి బాగాలేదంటే వాటివల్లే దెబ్బతింటావు అని

ఒక సందేశం ఇస్తున్నాడు. ఎంచేతంటే, భక్తుడు దింపుకున్నంత లోతుల్లోకి ఈ తపస్వీ జనులు దింపుకోలేరనేటటువంటి ఒక భావన ఇక్కడ వ్యక్తం చేస్తున్నారు. అందుకనే, అప్పుడప్పుడూ శాపాలు పెట్టడం, వరాలు ఇవ్వడం, ఇటువంటివన్నీ ఉంటాయి. భక్తులు రెండూ చెయ్యరు. మహిమలు చూపించకూడదు. ఇక్కడ మహిమలు దైవం చేసుకుంటే చేసుకుంటాడు. తను చెయ్యడు. తను చేసేదేమీ లేదు. తను ఆయనలో ఉండడమే ఉంటుంది. ఇప్పుడు కొత్తగా అందరూ అంటున్నారు "ఆమ్ ఆద్మీ" అని, అలా సామాన్యంగా ఉంటాడు. సామాన్యంగా ఉంటాడు గాని అసామాన్యం. సామాన్యులవలే గోచరించి అసామాన్యుల వలే ఉంటాడు. ఎందుకంటే, అతని నుంచి అసామాన్యమైన కార్యాలు నిర్వర్తింపబడతాయి. కానీ చూడడానికి చాలా సామాన్యంగా ఉంటాడు. విశేషంగా ఉండడానికి ప్రయత్నం కూడా ఉండదు. విశేషంగా దైవమందు ఉండాలని అనుకుంటాడు తప్ప, తను విశేషించి ప్రపంచానికి ప్రకటింపబడాలనే తపన కూడా దాటినటువంటి స్థితిలో ఉంటాడు. అంచేత, అది తేడా అని చెప్తున్నాడు.

"నా తేజము సాధులలో
నాతతమై యుండువారి నలఁచు జనులకున్
హేతిక్రియ భీతి నిచ్చుం
జేతోమోదంబుఁ జెఱుచు సిద్ధము సుమ్మీ."

అంబరీషుని వంటి సాధుమూర్తులలో నా తేజస్సు

నిహితమై వుంటుంది అని శ్రీహరి ఒక సత్యాన్ని ప్రకటించాడు. అలాంటి వారితో పొరపాటు ప్రవర్తన వలన, ఎవనికైనా భయం కలుగుతుంది. దుర్వాసుని యందు ఏర్పడిన భయం అతడి దుష్ప్రవర్తనయే. అంబరీషుని అమర్యాదగా, అధర్మముగా హింసించ బూనడంవల్ల దుర్వాసుని యందు భయం కలిగింది. అపరిమితమైన భయం ఏర్పడింది. ప్రాణభయం కలిగింది. మనశ్శాంతి నశించింది. ఆనందము చెడింది. కనుక అట్టి సాధు పురుషుల యందు భయభక్తులతో సామాన్యులు ఉండాలి. దుర్వాసాది మునులు మైత్రితో ఉండాలి. ఇది మనకు తెలియాలి. అంచేత, అక్కడికే వెళ్ళిపోకూడదా! అంబరీషుడు వద్దకే వెడితే బాగుంటుందని శ్రీహరి సూచన యిస్తున్నాడు. ఎక్కడ తప్పు చేశావో అక్కడ దిద్దుకోవాలి తప్ప ఇంకెక్కడో సిఫారసులు చేసుకుంటే అవుతాయండి! అవుతాయి మన దేశంలో, కలియుగంలో! సృష్టిలో అట్లా అవ్వదు. అందుకనే...

"అదె పో బ్రాహ్మణ! నీకును
సదయుఁడు నాభాగసుతుఁడ జనవినుతగుణా
స్పదుఁ డిచ్చు నభయ మాతని
మది సంతసపఱచి వేఁడు మా శరణంబున్."

Smooth గా చెప్పాడు, please get out అని. ఇంతలా చెప్పేశాడండి దుర్వాసుడికి. నా దగ్గరకు వచ్చి లాభం లేదయ్యా! ఆ సుదర్శనాన్ని ఆయనకే ఇచ్చేశాడుగా ఈయన! సరే, దానికొక పని ఇచ్చాడు ఆయన. ఆ పని ఇప్పుడు నువ్వు అడిగావని,

పోన్లే మనవాడంటే కుదరదు కదా! మనవాడే వదిలెయ్యి అని సుదర్శనానికి చెప్పడానికి ఆయనకి కూడా వీలు లేదు. ఎంచేత అంటే, ఎవడు మనవాడు? ఎవడు మనవాడు కాదు? ఆ rules కొంచెం clear గా చెప్పు అని అడుగుతుంది సుదర్శనం. అంచేత, నువ్వు ఏం చేస్తే బావుంటుందంటే... *"సదయుఁడు"* అంటే దయ కలిగినటువంటి వాడు. *"నాభాగసుతుఁడ"*– అంబరీషుడు. అతడు కీర్తింపదగు సద్గుణములు కలవాడు. దయ కలవాడు. రక్షణ స్వభావముగా గలవాడు. అతని మనస్సును సంతసింపచేస్తే, ఆపైన శరణుకోరితే, అతడే నీకు పరిష్కారం చూపుతాడు. నేను చేయగలిగిందేమీ లేదు సుమీ! అని అన్నాడు శ్రీహరి. ఇది అసలు సిసలు ధర్మం. ఎక్కడ తప్పు జరిగిందో అక్కడ సరిచేసుకోవాలి కాని, మరొక మార్గం లేదు. ఇది మనందరికీ బాగా తెలియాలి. కీలెఱిగి వాత పెట్టాలంటారు పెద్దలు. ఎక్కడ కీళ్ళు వాచినాయో అక్కడ వాత పెట్టాలి గాని, ఇంకెక్కడో వాత పెడితే జబ్బు తగ్గదు కదా! ఒక చోట తప్పు చేసి, మరొక చోట దేవుడికి కొబ్బరికాయలు కొట్టే రకం మానవులం. ఈ ఉపాఖ్యానము ప్రధానంగా ఈ ధర్మాన్ని అందిస్తుంది. ''తప్పు అంబరీషుని వద్ద చేశావు. కాబట్టి అక్కడే సరిదిద్దుకో! అపుడే సుదర్శనం నిన్ను వదుల్తుంది'' అన్నాడు దైవం. దుర్వాసునికి దర్శనం అవాలి. అంబరీషుని యందలి దైవం దర్శనమవాలి. అపుడు అలాంటి సు–దర్శనం జరగటం వల్ల సుదర్శన చక్రం తనకు తానుగా నిష్క్రమిస్తుంది. అది ధర్మం. అది న్యాయం. అదే దైవ నిర్ణయం!

# విష్ణు భక్తి

"అని శ్రీవల్లభుఁ డానతిచ్చిన మహోద్యచ్చక్రకీలావళీ జనితాయాసుఁడు నిర్వికాసుఁ డుదితశ్వాసుండు దుర్వాసుఁ డ ల్లన యేతెంచి సభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్యవేషున్ విదో షు నయోదారమనీషు మంజుమితభాషు న్నంబరీషున్ వెసన్."

"కని దుఃఖితుండయి యమ్మహీవల్లభు పాదంబులు వట్టి విడువకున్న నా నరేంద్రచంద్రుఁడు చరణస్పర్శనంబునకు నోడుచుఁ గరుణారసభరిత హృదయుం డయి హరిచక్రంబు ని ట్లని స్తుతియించె."

కొండంత ఆశతో దుర్వాస మహర్షి త్రిమూర్తుల వద్దకు వెళ్ళాడు, వెళ్ళగలిగాడు. అది తపోబలం. ఎవరలా వెళ్ళగలరు? అందరికీ సాధ్యమా? సత్యలోకం, కైలాసం, వైకుంఠం సంకల్ప మాత్రాన చేరగలిగిన అద్భుతమగు మహర్షి! త్రిమూర్తులతో సంభాషించగల ప్రజ్ఞావంతుడు. ఆగ్రహ అనుగ్రహ సమర్థుడు.

శ్రీహరి అంబరీషునే శరణు వేడమంటే హుటాహుటిని భూలోకానికి వచ్చి సరస్వతీ తటిని చేరి, అంబరీషుని శరణువేడడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఇది సామాన్య విషయం కాదు. అది మనం గమనించాలి. అలా చేయడం అందరికీ సాధ్యం

కాదు. ఆయనకు అహంకారమెలా విజృంభించిందో అలాగే తుస్సుమని కరిగిపోతుంది. అలా తపోధనులకే వీలు పడుతుంది. ప్రాణం మీదకు ఆపద వచ్చినా రావణుడు లొంగలేదు. శివ భక్తుడే! ఏమి లాభం? అసుర ప్రవృత్తి గలవారు అలా అహంకారాన్ని విసర్జించ లేరు. శ్రీరాముని శరణువేడి, సీతమ్మను అప్పగిస్తే రాముడు మన్నించేవాడు. కాని రావణునికి సాధ్యం కాదది. అలాగే దుర్యోధనుడు. అతడు దురభిమాని. చిట్టచివరకు ధర్మరాజు సంధికై అవకాశమిచ్చినా అహంకారాన్ని వదలలేదు. మనమూ అంతే! పంతాలు, పట్టింపులు ముఖ్యం. కాని దుర్వాసుడు వెన్నవంటి స్వభావము గలవాడు. ఆయన వెనువెంటనే అంబరీషుని పాదాలు పట్టుకొనే ప్రయత్నం చేశాడు! అంబరీషుడు మునిని ఆపాడు. దుర్వాసుడు ఆయాసపడుతూ, నిరంహకారియై అంబరీషుని చూచే సమయానికి ''సభక్తుడై'' యున్నాడు. సభక్తితో అంబరీషుని చూశాడు. భక్తితో చూచేసరికి అంతకు ముందు కనబడని దివ్యగుణాలు ఇపుడతనిలో మునికి కనపించాయిటండీ! మనకైనా అంతే! ఏవో అభిప్రాయాలు పెట్టుకొని పెద్దవారిని చూస్తే మన అభిప్రాయాలు అడ్డుతెరగా ఏర్పడి మనకేమీ వారిలో దివ్యత్వం గోచరించదు. భక్తితో చూస్తే గోచరిస్తాయి. *''సభక్తిన్ కాంచె''* అనునది ముఖ్యం. అపుడు అంబరీషునిలో దుర్వాస మహామునికి లావణ్యంతో కూడిన కరుణ కనిపించింది! దోషము కనిపించలేదు. విదోషుడుగా కనిపించాడు. నయోదార మనీషుడు కనిపించాడు! అంటే వినయము, ఉదారము అపారముగా గల మహాత్ముడు కనిపించాడు. మితము, మంజులము అయిన మితభాషి కనిపించాడు.

అలాంటి అంబరీషుని చూసిన మునికి దుఃఖము పెల్లుబికింది. బావురుమంటూ ఏడుస్తూ అంబరీషుని పాదాలపై వాలాడు. అప్పటికాని శాంతించలేదండి! అంబరీషుడు మునీశ్వరుని వారిస్తూ సుదర్శనాన్ని ప్రార్థించాడు. అంబరీషుని ఇక్కడ *‘‘నరేంద్ర చంద్రుడని’’* పోతనామాత్యుల వారు కీర్తించారు. నరులలో ఇంద్రుడంటే శ్రేష్ఠుడని, చంద్రుడంటే చల్లని మనసు కలవాడని. సూర్యుడనలేదు సుమండీ! చంద్రుడన్నారు. సూర్యవంశపు రాజులు పరాక్రమవంతులు. అందులో చంద్రుడనటం విశేషం. అంబరీషుడు, శ్రీరాముడు ఆ వంశములో చంద్రులవంటివారు.

కరుణారసంతో హృదయం పొంగినవాడై చక్రాన్ని ప్రార్థించాడు. సుదర్శన చక్రాన్ని, ఇంక నువ్వు వెళ్లిపోవచ్చు అని చెప్పలేదు. అందుకే అంబరీషుడు అయ్యాడు. లేకపోతే, మనలాగే ఉండేవాడు కదా! అంబరీషుడు సంతోషించడంతో సుదర్శన చక్రానికి వచ్చిన పని అయినట్లే. ధర్మం స్థాపించబడినట్లే. పైగా సుదర్శనాన్ని అంబరీషుని ఆధీనంలో శ్రీహరి ఉంచాడు కదా! ‘‘ఇక నీవు వెళ్ళవచ్చు. వచ్చిన పని అయ్యింది.’’ అని అంబరీషుడు అనలేదు. అతనికి సుదర్శనము కూడా విష్ణువే! పాదాలపై పడ్డ మునీశ్వరుడు కూడా విష్ణువే! ఇది అనితర సాధ్యమైన భగవద్భక్తి! కరుణారసంతో కూడిన భక్తి హృదయమంతా నిండగా, సుదర్శనాన్ని ఆయన ప్రార్థించాడండి. ఒక్క ప్రక్క పాదాలు పట్టుకొన్న మునీశ్వరుడు! మరొక ప్రక్క సాక్షాత్తు ధర్మ స్వరూపమైన విష్ణుచక్రం. అంబరీషుడు కరగిపోయాడు. హృదయం పొంగిపోయింది. రెండు చేతులూ జోడించేశాడు. మోకాళ్ళపై

నిలబడి ప్రార్థించాడట! ఎంతటి చల్లని హృదయం గలవాడండి! అలాంటి మహా భక్తుని ఉపాఖ్యానం చెప్పుకోవటం, వినటం చాలు. కల్మషాలన్నీ కరగిపోతాయి. అక్షరాల్లో 'అ' మొదటి అక్షరం, అలాగే అంబరీషుడు భక్తులలో మొదటివాడు!

**ప్రార్థన :**

"నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు
నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవ సమీరంబు
నీవ భూతేంద్రియనికర మీవ
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును
నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లేకేశులు నీవ సర్వాత్మయు
నీవ కాలంబును నీవ జగము

నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య
మూలతేజంబు నీకు నే మ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి
శస్త్రముఖ్యమ! కావవే చాలు మునిని."

భగవంతుడగు శ్రీ మహావిష్ణువు చాల మన్నించునట్టి చక్రము సుదర్శన చక్రం. శ్రీ మహావిష్ణువు సృష్టి పరిపాలకుడు. అతడే చాల మన్నించ ముఖ్య శస్త్రము సుదర్శనము. ధర్మ పరిపాలనమునకు

సహకరించునది. సృష్టిని రక్షించు చక్రమది. అది ధర్మ స్వరూపము, అగ్ని స్వరూపము, సూర్యాత్మకము, సోమాత్మకము, జీవాత్మకము (నీరు, నారము, జీవము). ఆకాశము, పృథివి కూడ అదియే! అదియే బ్రహ్మము, అదియే సత్యము, అదియే జీవకోటి. యజ్ఞ మదియే. యజ్ఞఫలము అదియే. కాలమదియే! జగత్తదియే! లోకేసుల రూపంలో వున్నది అదియే. సర్వాత్మకుడగు నారాయణు డదియే!

ఇది సుదర్శన స్వరూపము! అది కాని దేదీ లేదు. అందుకే మహావిష్ణువు సుదర్శనాన్ని అంతగా మన్నిస్తాడు. ధర్మం వల్లనే సృష్టి నిలబడివుంది. ఈ చక్రం వల్లనే సృష్టి ఉంది. అది చక్ర స్వరూపము. అందులోనుండి అన్నీ పుట్టి, పెరిగి, అందులోకే చేరిపోతాయి. అదియే యజ్ఞం. యజ్ఞాన్ని భుజించేవాడు సుదర్శనమే! నిత్యము, సత్యము అయిన మూల తేజమది.

"హరిచే నీవు విసృష్టమై చనఁగ మున్నాలించి నీధారలన్
ధరణిన్ వ్రాలుట నిక్క మంచు మునుపే దైత్యేశ్వరవ్రాతముల్
శిరముల్ బాదములున్ భుజాయుగళముల్ ఛేదిల్లి యంగంబు ల
ప్డారగం బ్రాణసమీరముల్ వదలు నీ యుద్ధంబులం జక్రమా!"

హరిచేత నీవు జనింపబడి, నీ కాంతి కిరణాలకే రాక్షస సమూహాలు అన్నీ ఎక్కడికక్కడ ముక్కలు ముక్కలైపోతాయటండి. అమిత పరాక్రమము కలిగినటువంటిది. దానికి తిరుగు లేదు కదా! విష్ణుచక్రానికి తిరుగు లేదు. సృష్టి చక్రం, కాల చక్రం, ధర్మ చక్రం – అన్నీ అదే. శ్రీహరి చేత వదలబడి నువ్వు విజృంభించినా ఆ

సంగతి ముందే పసిగట్టి, ఎలాగూ చావు తప్పదని, ముందుగానే రాక్షస సమూహాల తలలు, కాళ్ళు, చేతులూ తెగి తమతమ దేహాల్లో ప్రాణవాయువులను వదులుతారు. ఇంక అది వస్తే, దానితో యుద్ధం అంటూ ఏమీ ఉండదు. ఏదో సుదర్శన చక్రం కనబడితే అధర్మం చిన్నాభిన్నం అయిపోతుంది. విష్ణుచక్రం ఇంకొక పేరు 'నమః'. అందులో నువ్వు ఒక నలుసులాంటి వాడివి. విష్ణు చక్రంలో నువ్వు ఒక నలుసు. నలుసు కూడా కాదేమో. ఎందుకంటే, భూమే ఆవగింజంత. భూమే ఆవగింజయితే, ఆవగింజలో నువ్వెంతున్నావు? ఆ భూమి మీద నువ్వు కనబడతావా శాల్తీవి? కనబడవు కదా! భూమే ఆవగింజయితే, ఇంక నువ్వేం కనబడతావు? నువ్వు దానితో యుద్ధం ఏమిటి? అందుకనే, అది ప్రయోగించాడనగానే వీళ్ళకి కాళ్ళు, చేతులు, తలకాయలు తెగిపోతాయండి.

"కలఁగి నిద్ర వోవఁ గలలోన వచ్చిన
నిన్నుఁ జూచి దీర్ఘ నిద్రవోదు
రసురవరులు శయ్య లం దున్నసతులు ప్ర
భాతమందు లేచి పలవరింప."

పొద్దున్న లేచి చూసుకుంటే అసురుడు చచ్చిపోయి ఉంటాడటండి. ఏమయిందంటే, వాడికి కలలో చక్రం కనిపించిందట! చెప్పడానికి కూడా వీలుపడలేదు, కలలో కదా! ఎట్లా చచ్చిపోయాడో తెలియదు. పొద్దున్న లేచే సరికి లేడు. ఈవిడ

లబోదిబోమని ఏడుస్తూ ఉంటుంది. అట్లా చేస్తావు కదా నువ్వు అని కీర్తిస్తున్నాడు అంబరీషుడు.

ఈ పద్యాలు కంఠస్థం చెయ్యడం చాలా ముఖ్యం. ఈ నాలుగైదు పద్యాలు ఉన్నాయి. కంఠస్థం చేసుకుని చదువుకుంటూ ఉంటే ప్రస్తుతం ఉండేటటువంటి విపరీతమైన కాలపరిస్థితుల్లో మనకి రక్షణ ఉంటుంది. మన నుంచి కూడా మనకి రక్షణ ఉంటుంది. ఎందుకంటే, "మనకి మనమే శత్రువులం. మనకి మనమే మిత్రులం. మనని మనమే ఉద్ధరించుకుంటాం. మనని మనమే పాడు చేసుకుంటాము," అని చెప్పాడు ఆరో అధ్యాయంలో శ్రీకృష్ణుడు. ఆత్మకు ఆత్మయే మిత్రువు. ఆత్మకు ఆత్మయే శత్రువు. ఆత్మ ఆత్మని ఉద్ధరించుకోవాలి. ఆత్మ వలనే ఆత్మ పతనం చెందుతుంది. అంటే రకరకాలుగా, ముక్కలుముక్కలుగా ఆత్మ ఉంటుందిలెండి మనకి. *"యోగో నష్టః పరంతప"* అని ఆరు ముక్కలుగా పడిపోయి ఉంటుంది. వాటిని పూసకెక్కించుకున్నా సరే, ఉన్న దారంలోకి ఎక్కించుకున్నా సరే. అంచేత, మన నుంచి, మన పరిసరాలనుంచి మనకి రక్షణ కావాలి. దానికి కాలస్వరూపాన్ని ఈ విధంగా ఆరాధన చేసుకోవడానికి ఐదు అద్భుతమైన పద్యాలు అంబరీషోపాఖ్యానంలో ఉన్నాయి. వాటిని చక్కగా రోజూ పఠనం చేస్తుంటే మనకి మంచి జరుగుతుంది.

"చీఁకటిఁ బాపుచున్ వెలుఁగు సేయుచు సజ్జనకోటి నెల్ల స
శ్రీకను జేయు నీ రుచులు సెల్వుగ ధర్మసమేతలై నినున్

వాకున నిట్టి దట్టి దని వర్ణన సేయ విధాత నేరఁ డ
స్తోకము నీదురూపు గలదుం దుది లేదు పరాత్పరాద్యమై."

మొదలు, తుది లేని రూపం అది. సృష్టి చక్రాన్ని ఎవరు చూడగలరు? దాన్ని సృష్టించిన వాడే చూడగలడు. అందులో ఉన్నవాడు చూడలేదుగా! అంచేత, దాని మొదలు తుది తెలియదు ఎవ్వరికీ. దాని గురించి బ్రహ్మదేవుడు కూడా పూర్తిగా వర్ణించలేడుట. ఎందుకంటే, ఆయన అందులో భాగం అవ్వడం చేత. దాన్ని తలుచుకుంటేనే మన లోపల, బయటా ఉన్న చీకటులన్నీ పోతాయండి. చక్కని సంస్కారం మనలో ఏర్పడుతుంది. "*స శ్రీకను జేయు*" – ఆ సుదర్శన కాంతులు అట్లా చేస్తాయి. అవి ధర్మముతో కూడి ఉన్నటువంటి కాంతులు. "*ధర్మసమేతలై నినున్ వాకున నిట్టి దట్టి దని*" వర్ణింపరాదు, అలా ఉన్నావు నువ్వు. నేనేం పొగడగలను! బ్రహ్మదేవుడే పొగడలేడు కదా! నీ దర్శనమే సర్వ శుభకరం కదా! నువ్వు ఉన్నచోట ఎటువంటి అజ్ఞానం ఉండదు కదా! కుసంస్కారులు కూడా సంస్కారులు అవుతారు కదా! అని చెప్పి ప్రశంసిస్తున్నాడు.

"కమలలోచనుండు ఖలుల శిక్షింపంగఁ
బాలు సేయ నీవు పాలుపడితి
వైన నింకఁ జాలు నాపన్నుఁడై యున్న
తపసిఁ గావు మీవు ధర్మవృత్తి."

సుదర్శనునిది ధర్మవృత్తి. ధర్మమైన ప్రవృత్తి. ధర్మ సంస్థాపన జరిగింది. తపస్వి దుర్వాసుడు పశ్చాత్తప్తుడైనాడు. ధర్మమందు సుస్థితుడైనాడు. ఇక సుదర్శనునికి పనియేముంది? మునిని చక్కబెట్టటమే ఆయన పని. అది నెరవేరింది కదా! అందుకే కమలలోచనుడైన హరి సంకల్పించాడు. సంకల్పం నెరవేరింది. అలా ప్రార్థిస్తూ రెండు చేతులు నొసల చేర్చి అంబరీషుడు ప్రార్థిస్తున్నాడు. ''ఇంద్రుని శత్రువులకు ధూమకేతువై గోచరించెడివాడు, లోకములందు ధర్మపు వంతెనవలె ఏర్పడు శిష్టాచార సంపన్నులకు తరింపు నిచ్చువాడు, నిర్మలమూర్తి, విశ్వదీపము, చర్మ చక్షువులకు కనపడక గుప్తముగ నుండువాడు అగు సుదర్శనునికి నా నమస్కారములు'' అని పలికాడు.

"అని వినుతించి కేలుఁదమ్మిదోయి నొసలం బొసంగించి యి ట్లనియె."

"ఏ నమస్కరింతు నింద్రశాత్రవ ధూమ
కేతువునకు ధర్మ సేతువునకు
విమలరూపమునకు విశ్వదీపమునకుఁ
జక్రమునకు గుప్తశక్రమునకు."

దణ్ణం పెట్టాడు. పెట్టి, నమస్కారం చేస్తున్నాను నీకు అని...

"విహితధర్మమందు విహరింతునేనియు
నిష్టమైన ద్రవ్య మిత్తునేని

ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుఁగాక."

*"విహితధర్మమందు విహరింతునేనియు"* – నేనెప్పుడూ శాస్త్రవిహితమైనటువంటి ధర్మమునందే ప్రవరిస్తూ ఉన్నటువంటి వాడినయితే, *"నిష్టమైన ద్రవ్య మిత్తునేని"* – అడిగినవారికి సంతృప్తి కలిగేటట్టుగా దానం చేసినవాడినయితే, *"ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని"* – బ్రాహ్మణులను నేనెప్పుడూ దేవుడిగా పూజించినట్టయితే, *"విప్రునకు శుభంబు వెలయుఁగాక"* – ఆయనకి శుభం కలగాలి.

"అఖిలగుణాశ్రయుఁడగు హరి
సుఖియై నా కొలువువలనఁ జొక్కెడినేనిన్
నిఖిలాత్మమయుం డగుటకు
సుఖమందుం గాక భూమిసురుఁ డివ్వేళన్."

*"అఖిలగుణాశ్రయుఁడగు హరి సుఖియై నా కొలువువలనఁ జొక్కెడినేనిన్"* – అన్ని సద్గుణాలకి ఆశ్రయమైనటువంటి హరి నా కొలువులో, అంటే నా పూజలో, సుఖియై ఉండేవాడయితే, నా యందు సుఖంగా ఉన్నవాడయితే ఈ బ్రాహ్మణునికి ఈ వేళ సుఖము కలగాలి అని ప్రార్థించాడు.

"అని యివ్విధంబున బొగడు పుడమిఱేనివలన మన్నించి తపసికి దాహంబు నొందింపక రక్కసులగొంగచక్రంబు తిరిగి

చనియె నంత దుర్వాసుండు శాంతింబొంది మెల్లనిమాటల
నా రాజున్ దీవించి యి ట్లనియె."

భూమికి చక్రవర్తి అయిన అంబరీషుడు సృష్టి చక్రము నా విధముగా ప్రార్థించగా, సుదర్శన చక్రం శాంతించి, రాక్షసుల పని బట్టేందుకు తిరిగి వెళ్ళిపోయింది. దుర్వాస మహామునికూడ శాంతిని పొందాడు. అతని సహజ స్థితి మరల స్థిరపడింది. చల్లని, మెల్లని మాటలతో యిక అంబరీషుని దీవించ ఆరంభించాడు.

"నరనాథోత్తమ! మేలు సేసితివికదా నా తప్పు మన్నించి శ్రీ
హరిపాదాబ్జము లింత ముట్టఁ గొలుతే యాశ్చర్య మౌ నెన్నుచో
నరుదండ్రే నినుబోఁటి సాధునకుఁ దానై యిచ్చుటల్ గాచుటల్
సొరిదిన్ నైజగుణంబులై సరస వచ్చుంగాదె మిత్రాకృతిన్."

నా తప్పు మన్నించి మేలు చేశావు. శ్రీహరి పాదాలు ఇంత గాఢంగా నమ్మి సేవించావా? అంత చుట్టేసుకున్నావా అని. ఎంత బాగా కొలిచావో? ఎంత ఆశ్చర్యమో! నీవంటి సాధువుకి ఇది అరుదేమీ కాదు. ఎంత సాధువై పోయావు. అంచేత, నీకోసం సుదర్శన చక్రం నా వెంటబడడం పెద్ద విషయం కాదులే అన్నాడు. కోరినది ఇవ్వడం, కాపాడడం అనేవి నీలాంటి సాధువు సహజగుణాలే. మైత్రీభావంతో సరసంగా సంప్రాప్తిస్తాయి కదా! ఎప్పుడయితే సాధువు అవుతావో అప్పుడు ఈ గుణాలన్నీ నీ దగ్గరకు వస్తాయి. ఆరాధన వల్ల సాధువు అయ్యాడు అని అంబరీషుని పొగిడాడు.

"ఒక మా టెవ్వనిపేరు కర్ణములలో నొయ్యారమై సోఁకినన్
సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స
త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశు ని
న్నకలంకస్థితిఁ గొల్చుభక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ!"

ఇలాంటి భక్తులకు అడ్డమేముందయ్యా? ఉంటుందా? అట్లా ఉండదన్నాడు. చాలా సంతోషించాడు దుర్వాసముని. *"ఒక మా టెవ్వనిపేరు కర్ణములలో నొయ్యారమై సోఁకినన్ సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్"* – వింటే చాలటండి. వయ్యారంగా సోకడమంటే? అంటే, వినంగానే తన్మయత్వం రావాలి, ఒక ఆనందం రావాలి, ఒక ప్రేమ భావం రావాలి, హృదయం పొంగాలి. భగవత్ నామం గాని, పద్యం గాని, కీర్తన గాని వింటే అట్లా ఉందనుకోండి, నామం వయ్యారంగా లోపలకి వెళ్తే చాలు, లోపల లోతుల్లోకి వెళ్ళిపోతుంది. లోపలుండే చీకటులన్నీ బాబోయ్ అని పారిపోతాయి. *"సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్"* – పల్టీలు కొట్టేస్తాయి మన లెక్కల్లో చెప్పుకోవాలంటే. అటువంటి *"స త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశు"* – హరిని విష్ణువుగా కొలిచాడు అంటే అన్నిటిలోనూ చూశాడు, అంతటా చూశాడు. *"దేవదేవేశు ని న్నకలంకస్థితిఁ గొల్చుభక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ!"* అని విష్ణువు యొక్క భక్తి ఎలాంటిదో దుర్వాసుడు ప్రశంసిస్తున్నాడు.

దేవదేవుడగు విష్ణువును, అకలంకముగా గొల్చు భక్తులకు అడ్డమేమీ వుండదు అని దుర్వాసుడు తెలుపుతున్నాడు. దైవాన్ని

విష్ణువుగ కొలవడం అంటే, యీ కనపడుతన్నదంతా దైవమే అని భావించటం. అకలంకముగ కొలవడమంటే నిర్మలముగా పూజించడం. అన్నిట, అంతటా విష్ణువే వున్నాడని తెలిసి ఏ కోరికలు లేకుండా, కేవలము ప్రేమతో ఆరాధించటం. ఇది అందరివల్ల అయ్యే పని కాదు. అరుదుగ అంబరీషుని వంటి భక్తులుంటారు. అలాంటివారికి దైవము సుకరములు చేస్తూ వుంటాడు. శుభములు కూరుస్తూ వుంటాడు. అట్టి భక్తులతో కూడి వుంటాడు. *"మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద!"* అన్నాడు భగవంతుడు. ఆయన ఎక్కడ, ఏ భక్తునితో కూడి వుంటే అక్కడ అంతా మంగళమే. అది పుణ్య తీర్థమైపోతుంది. పుణ్యక్షేత్రం అయిపోతుంది. అలా అయినవే పుణ్య క్షేత్రాలన్నీ. పండరి, ఆలంది, షిర్డి, అక్కల్ కోట... అలా చెప్పుకుంటూ పోతే తెమలదు.

"తప్పు లోఁగొని చక్ర పావకదాహముం బెడఁబాపి తౌ
నొప్పు నొప్పు భవద్దయారస మో నరేశ్వర! ప్రాణముల్
సెప్ప మున్మను వోయి క్రమ్మఱఁజేరె ధన్యుఁడనైతి నీ
కెప్పుడున్ శుభమేను గోరెద నింకఁ బోయెద భూవరా!"

నేను చేసిన తప్పులు లెక్కించకుండా మింగేశావు. సుదర్శన చక్రం మంటల్లో పడిపోకుండా నన్ను తప్పించావు. నీ కరుణారసం నీకే తగును. పోయిన ప్రాణం మళ్ళీ వచ్చింది. ధన్యుడనయ్యా! నీకు ఎప్పుడూ సుఖం కలగాలని కోరుకుంటాను. అంటే, ఇప్పుడు ఇంకొకటి extra వచ్చిందన్నమాట అంబరీషుడికి. ఎప్పుడూ సుఖం కలగాలని దుర్వాసుడు ఆశీర్వదిస్తూ ఉంటాడండి

ఎక్కడున్నా. ఇంతకుముందు ఆ కార్యక్రమం దుర్వాసుడికి లేదు కదా! ఇప్పుడాయనకి ఇది ఏర్పడింది. ఎంచేతంటే, మనకి ప్రాణబిక్ష పెట్టాడు.

"అనిన విని రాజముఖ్యుఁడు
మునివల్లభుపాదములకు మ్రొక్కి కడున్ మ
న్నన సేసి యిష్టభోజన
మనువుగఁ బెట్టించెఁ దృప్తుఁ డయ్యె నతండున్."

అంబరీషుడు దుర్వాసుడి పాదములకు నమస్కారం చేశాడు. మరి భోజనం కథ ఆగిపోయింది కదా! మనం మర్చిపోయాం కదా! మనకి గుర్తు వస్తుంది ఇంకో అరగంటలో! కథలో భోజనం మర్చిపోయాము. ఈయన ఇలా ఇలా తిరుగుతూ ఉంటే మరి ఏం చేస్తుంటాడు అంబరీషుడు? చక్రం చూసుకుంటుంది కదా అని శుభ్రంగా భోజనం చెయ్యలేదు. వచ్చినవాడు అతిథి, భూసురుడు. ఆయనకి అన్నం పెట్టకుండా తను ఎట్లా తింటాడు? ఎప్పటికొచ్చాడో తిరిగి మనకి తెలియదు కదా! అంతవరకూ ఆయన తినలేదు. మధ్యాహ్నం సంస్కృత భాగవతంలో చూశాను. చూస్తే, ఒక్క సంవత్సరం పట్టిందటండి ఆయనకి. ఏదీ బ్రహ్మలోకం, కైలాసం, వైకుంఠం, వీటన్నిటినీ తిరిగెయ్యడమే కాదు, అక్కడ వినడం. అక్కడ కాలపరిమాణం వేరుగా ఉంటుంది. ఆ కొలతలు వేరు. అవన్నీ తిరిగొచ్చేసరికి సంవత్సరం అయ్యిందటండి. ఈయన ఇట్లాగే ఉన్నాడటండి. ఉపావాసం అని అక్కడుంది. ఇక్కడ లేదు.

తిరిగి వచ్చాడు. వస్తే, ఆయనకి కడుపు నిండా భోజనం పెట్టి, ఆయన్ని సంతుష్టుని చేసి, అప్పుడు ఈయన భోజనం చేశాడటండి.

అంబరీషుడి కథ టూకీగా అందరికీ తెలిసినా, ఆయన దుర్వాసుని రాకకోసం సంవత్సరకాలం ఉపవాసం చేశాడంటే మనబోటి వాళ్ళం నమ్మలేము. అనన్య భక్తులకే అది సాధ్యం. వారికి అసాధ్యమనేది వుండదు. ఇది మనం తెలుసుకోవాలి.

"కంటిన్ నేటఁకి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయిం బ్రీతిగా
వింటి న్నన్నముఁగొంటి నీ గృహమునన్ వేడ్కన్ ఫలంబబ్బె నే
మంటిం బోయెద నీచరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁగల రీ మీఁదన్ నరేంద్రాగ్రణీ!"

నీ కథ భూలోకంలో వాళ్ళు, దేవలోకంలో వాళ్ళు ఎప్పుడూ చదువుకుంటూ ఉంటారు. ఇది నా శాసనం అన్నాడు. చాలా ఆనందించాను, *"కంటిన్ నేటఁకి నిన్ను"* – ఇవాల్టికి కనబడ్డది సరిగ్గా ఆయనకి. *"నీ వచనముల్ కర్ణద్వయిం బ్రీతిగా వింటి"* – ఎప్పుడు విన్నాడు? ఇప్పుడేగా! ఇంతకుముందు ఏమయినా మాట్లాడనిచ్చాడా? చక్రాన్ని ఎలా ప్రస్తుతించాడో విన్నాడు. *"న్నన్నముఁగొంటి నీ గృహమునన్ వేడ్కన్"* – చాలా వేడుకగా భోజనం చేశాడు. బాధ పడుతూ భోజనం చెయ్యలేదు సుమా అన్నాడు. "ఫలంబబ్బె" ఎవరికి? అంబరీషుడికి. ఆయనకేం అక్కర్లేదు. అతిథి భోజనం చేస్తే ఫలం ఎవరికి? భోజనం పెట్టినవాడికే కదా! అంటే, అలాంటి తపోధనుడికి భోజనం పెట్టిన

ఫలం నీకు అబ్బుతుంది. ఇంక నేను వెళ్లి వస్తాను. *"నీచరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై మింటన్ మేదిని సన్నుతింపఁగల రీ మీఁదన్ నరేంద్రాగ్రణీ!"*

అది దుర్వాసుని వరం! ఇక మీద నీ భక్తిని గూర్చి, నిన్ను గూర్చి భూలోకంలోను, స్వర్గలోకంలోను మానవులు, దేవతలు, అందరూ స్తుతిస్తూ వుంటారని వరమిచ్చాడు. అనుగ్రహించాడు. కాబట్టే యీ నాటికి మనం చదువుకుంటున్నాము. ఇది ఇప్పటి కథ కాదు. త్రేతాయుగపు కథ. యుగయుగాలు శాశ్వతంగా వుండే పుణ్య కథ!

"అని చెప్పి దుర్వాసుం డంబరీషుని దీవించి కీర్తించి మింటితెరువున బ్రహ్మలోకంబునకుం జనియె. మునీశ్వరుండు వచ్చి మగుడం జను వేళకు నొక్క వత్సరంబు నిండి వ్రతంబు పరిపూర్ణంబైన."

కొన్నాళ్ళు ఇంకెక్కడా మనం తిరగొద్దు, ఇంకేమీ వద్దనుకున్నాడు! సరాసరి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు దుర్వాసుడు.

"అవనిసురుఁడు గుడువ నతిపవిత్రంబైన
వంటకంబు భూమివరుఁడు గుడిచెఁ
దపసినెగులు మాన్పఁ దా నెంతవాఁ డను
హరికృపామహత్త్వ మనుచుఁ దలఁచి."

అదీ అంబరీషుడు! సంవత్సరం అయిపోయింది. దుర్వాసుడు వెళ్ళాడు. ఈయన భోజనం చేశాడు. భూమివరుడు. భోజనం చేసిన తర్వాత అందరూ పొగుడుతారు కదా చుట్టూ ఉండేవాళ్ళు! నేను కాదు, *"హరికృపామహత్త్వం"* అంటే, ఆయన లీల. ఆయన మహత్యం చూపించాడు అని మనసులో తలచాడట. అందరూ పొగుడుతుంటే, ఆయన లోపల, "నీ లీలా మహత్యం ఇది. లేకపోతే తనేమిటి, దుర్వాసుడేంటి? దుర్వాసుడికి ఆ బుద్ధి పుట్టడమేంటి? ఈ చక్రం వెంటపడడం ఏమిటి? ఆయన విష్ణువు యొక్క ఉపదేశంగా వచ్చి తన కాళ్ళు పట్టుకోవడమేంటి? తను ప్రార్థిస్తే చక్రం వినడమేంటి? ఇతడు రక్షింపబడటమేంటి? తానా? కాదు" అనుకున్నాడు.

# ఫలశ్రుతి

"హరిఁ గొల్చుచుండువారికిఁ
బరమేష్ఠిపదంబు మొదలు పదభోగంబుల్
నరకసమము లను తలఁపున
ధరణీరాజ్యంబుతోడి తగులము మానెన్."

హరిని పూజించేవారికి పదవులు, వాటి భోగములు నరకముతో సమానమైనవి అని అంబరీషుడు భావించాడు. ఈ రోజుల్లో భక్తులము, స్వాములము, గురువులము, బాబాలము అనేకునే వారు చాలామంది పదవి, కీర్తి, సంపద, ఆశ్రమాలు, లిటిగేషన్లు వగైరాలతో యిరుక్కుని వున్నారు. కాని అంబరీషుడు తనకు ఇక రాజ్య పదవి (చక్రవర్తి పదవి) ఇక చాలు అనుకున్నాడు. బ్రహ్మపదవి కూడ అవసరం లేదనుకున్నాడు.

"తనకు సదృశులైన తనయుల రావించి
ధరణిభరము వారిఁ దాల్పఁ బంచి
కాననంబు సొచ్చెఁ గామాదివిజయుఁడై
నరవిభుండు హరిసనాథుఁడగుచు."

అందుకని తనతో సమానమైన క్షత్రియ ప్రజ్ఞగల తన కుమారులకు రాజ్యాన్ని పంచియిచ్చి, ఏ కోరికలు లేనివాడై వాన ప్రస్థమునకు వెళ్ళిపోయాడు. హరియే తన భర్తగా శేషకాలం గడిపి

తుదకు శ్రీహరిని చేరుకున్నాడు. పరమగతి చేరిన భక్తుని కథ ఇట్లా వుంది.

అంటే, హరినే సమస్తంగా పెట్టుకుని, ఆ విధంగా నిష్క్రమించాడు ఆయన. అంతా బావున్నప్పుడే వెళ్లిపోవాలి తప్ప, "ఇంక పోరా బాబు!" అన్నంత వరకూ ఉండకూడదు. అది పెద్దలకి తెలిసిన విషయం. అంచేత, ఆయన ఆ విధంగా నిష్క్రమించాడు.

"ఈ యంబరీషుచరితముఁ
దీయంబున విన్నఁ జదువ ధీసంపన్నుం
డై యుండును భోగపరుం
డై యుండును నరుఁడు పుణ్యుఁడైయుండు నృపా!"

ఈ అంబరీష ఉపాఖ్యానాన్ని భక్తితో చదువుకున్నా, విన్నా, అలాంటివారికి బుద్ధి, సంపద, భోగములు జీవితంలో ఉంటాయి. పుణ్యము వస్తుంది. ఇలాంటి ఫలశ్రుతి ప్రతి ఉపాఖ్యానము చివర ఉంటుంది. నిజానికి నా దృష్టిలో ఇది ఒక ప్రలోభం. ఒక ఆశ. ఒక లంచం పెట్టినట్టు. కర్మఫల త్యాగము, సంకల్ప సన్యాసము, పరహిత జీవనము, ఈశ్వర ప్రణిధానము అందించే మన వాఙ్మయమందు చివరిలో ఇలాంటివి చెప్పటం, మనలను పరీక్షించటానికే. మనం ఫలాపేక్షలేక, భగవత్ సాన్నిధ్యంలో ఈ ఉపాఖ్యానము దర్శించాము. అదే ఫలం. ఇది ఈ ఉపాఖ్యానానికి ఫలశ్రుతి.

అంచేత, ఇలాంటి అంబరీషుడి కథ మనం ఈ గురుపూజల్లో ఈ విధంగా కొంచెం మామూలుకన్నా ఎక్కువ సమయం తీసుకుని పరిపూర్తి చేసుకున్నాము. ఈ ఉపాఖ్యానము వినండి. రుచి బాగా పెరిగితే చదువుకోండి. ఇంకా రుచి కలిగితే రోజూ చదువుకోండి. ఇంకా రుచి కలిగితే హృదయస్థం చెయ్యండి. అట్లా చదువుకుంటూ ఉండండి. ఎందుకంటే, చెప్పాను కదా పొద్దున్న, విష్ణువుని ఆరాధించడం కన్నా, అంబరీషుడిని ఆరాధిస్తే విష్ణువు ఎక్కువ సుముఖుడవుతాడు. ప్రహ్లాదుడిని ఆరాధిస్తే విష్ణువు బాగా ఆనందిస్తాడు. హనుమంతుడిని ఆరాధిస్తే రామబ్రహ్మము పలుకుతాడు. ఎంచేత అంటే, భక్తుల ఆరాధన భగవంతుడి ఆరాధన కన్నా అప్పుడప్పుడూ కొంచెం మిన్నయోమో అనిపిస్తుంది. భక్తులని విస్మరించి భగవంతుడి దగ్గరకు వెళ్ళడం అంత సులభం కాదు. అందుచేతనే, మనకి సద్గురు సంప్రదాయం వచ్చింది. దైవము యొక్క ప్రతినిధే గురువు. అంచేత, అతడి ద్వారా బ్రహ్మమును చేరడం. ఇట్లా ఉంటుంది. ఆ విధంగా ఉంటుంది కాబట్టి భగవద్భక్తుల కథలు బాగా ఆరాధన చేసుకుంటూ, పారాయణ చేసుకుంటూ ఉండడం కూడా మనం చేసేటటువంటి ఈ భగవత్ భక్తి కార్యక్రమంలో ప్రధానమైన భాగమని గుర్తుపెట్టుకోండి.

స్వస్తి.

# సుదర్శన చక్ర ధ్యానము

"నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు
నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవ సమీరంబు
నీవ భూతేంద్రియనికర మీవ
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును
నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మయు
నీవ కాలంబును నీవ జగము

నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య
మూలతేజంబు నీకు నే మ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి
శస్త్రముఖ్యమ! కావవే చాలు మునిని."

"హరిచే నీవు విసృష్టమై చనఁగ మున్నాలించి నీధారలన్
ధరణిన్ వ్రాలుట నిక్క మంచు మునుపే దైత్యేశ్వరవ్రాతముల్
శిరముల్ బాదములున్ భుజాయుగళముల్ ఛేదిల్లి యంగంబు ల
ప్పారగం బ్రాణసమీరముల్ వదలు నీ యుద్ధంబులం జక్రమా!"

"కలఁగి నిద్ర వోవఁ గలలోన వచ్చిన
నిన్నుఁ జూచి దీర్ఘ నిద్రవోదు
రసురవరులు శయ్య లం దున్నసతులు ప్ర
భాతమందు లేచి పలవరింప."

"చీఁకటిఁ బాపుచున్ వెలుఁగు సేయుచు సజ్జనకోటి నెల్ల స
శ్రీకను జేయు నీ రుచులు సెల్వుగ ధర్మసమేతలై నినున్
వాకున నిట్టి దట్టి దని వర్ణన సేయ విధాత నేరఁ డ
స్తోకము నీదురూపు గలదుం దుది లేదు పరాత్పరాద్యమై."

"ఏ నమస్కరింతు నింద్రశాత్రవ ధూమ
కేతువునకు ధర్మసేతువునకు
విమలరూపమునకు విశ్వదీపమునకుఁ
జక్రమునకు గుప్తశక్రమునకు."

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఇతర రచనలు

1. అమనస్కుడు
2. అన్వేషకుడు
3. అసంగుడు
4. అంతర్దర్శన ధ్యానములు
5. హిమాలయ గురుపరంపర
6 మైత్రేయ మహర్షి బోధలు
7. మరువు మహర్షి బోధలు
8. దేవాపి మహర్షి బోధలు
9. ధనకాముని కథ
10. గీతోపనిషత్ - జ్ఞాన యోగము
11. గీతోపనిషత్ - కర్మ యోగము
12. గీతోపనిషత్ - సాంఖ్య యోగము
13. గీతోపనిషత్ - ధ్యాన యోగము
14. గీతోపనిషత్ - కర్మసన్యాస యోగము
15. గీతోపనిషత్ - విజ్ఞాన యోగము
16. H.P.B. ఆత్మసాధనా సూత్రములు
17. సంఘనీతి
18. శ్రీ లలిత (10 భాగములు)
19. కథాదీపిక


20. మన మాస్టరుగారు
21. మాస్టర్ సి.వి.వి. యోగము
22. శ్రీకృష్ణ నామామృతము
23. సాయి సూక్తులు
24. శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు
25. ఓం
26. శ్రీ గురుపాదుకా స్తవము
27. భారతీయ సంప్రదాయము
28. మాస్టర్ సి.వి.వి. నూతన యోగము
29. మాస్టర్ సి.వి.వి. యోగము - కర్మరాహిత్యము
30. శ్రీ దత్తాత్రేయ


---

Please visit our website
(www.dhanistha.org.
info@dhanistha.org.) for Copies

## ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠ ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org

అంబరీషుడు భక్తులలో అగ్రగణ్యుడు. భక్తుడనగా సతతము దేవునితో కూడియున్నవాడని అర్థము. అంబరీషు డట్టివాడు.

అంబరీషుడు సామాన్యుడు కాదు, చక్రవర్తి. అందున సప్త ద్వీపములతో కూడిన భూమండల చక్రవర్తి. అట్టి అంబరీషుడు దైవమును మరువక సమస్తము నందును దైవమునే దర్శించుచు, వినుచు యుండుట మరి యే కథ యందును మనము వినము. అతని భక్తికి శ్రీ మహా విష్ణువు ముగ్ధుడై తన సుదర్శనమునే అంబరీషున కిచ్చివేసెను.

అక్షరములలో 'అ' ప్రథమము. భక్తులలో అంబరీషుడు ప్రథముడు. అట్టి పుణ్య చరితుని కథ సవివరముగా ఈ గ్రంథమందు అందింపబడినది.

ISBN 978-81-89467-64-7